11వ వార్షికోత్సవ శుభాకాంక్షలు

CELEBRATING 11TH YEAR ANNIVERSARY

ప్రకటన కర్తలకు,పాఠకులకు, తెలుగు ప్రజలకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు పెన్‌పవర్ వారి

# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు

సంపుటి : 1 సంచిక : 58 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : హైదరాబాద్ శుక్రవారం 9 జనవరి 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE : 58 PAGES : 12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : HYDERABAD FRI 9 JANUARY 2026 PRICE : 1/- RS

Simultaneously Published form : Hyderabad, Thadepalligudem, Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa,,SPSR Nellore, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur




ప్రకటన కర్తలకు, పాఠకులకు, తెలుగు ప్రజలకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు పెన్‌పవర్ వారి
11వ వార్షికోత్సవ శుభాకాంక్షలు

# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక | PEN POWER TELUGU DAILY | ప్రశ్నించడం మన హక్కు

సంపుటి : 1 సంచిక : 58 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : హైదరాబాద్ శుక్రవారం 9 జనవరి 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE : 58 PAGES : 12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : HYDERABAD FRI 9 JANUARY 2026 PRICE : 1/- RS

Simultaneously Published form : Hyderabad, Thadepalligudem, Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa,,SPSR Nellore, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur


# బల్దియాలపై జెండా ఎగరేద్దాం..

## రాబోయే ఎనిమిదేండ్లు మనదే అధికారం

- 2023లో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చాం
- పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎసు బొందపెట్టాం
- కంటోన్మెంట్, జూబ్లీహిల్స్ లోనూ ఓడించాం
- పంచాయతీల్లో మనం పూర్తి పట్టు సాధించాం
- స్థానిక సంస్థల్లో పట్టు ఉంటేనే అభివృద్ధి చేయగలం
- గాంధీభవన్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



**హైదరాబాద్ పెన్ పవర్:** రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో సత్త చాటుదామని, బల్దియాల్లో పట్టు సాధించి తీరుదామని సీఎం రేవంత్ రెడ్డి కాంగ్రెస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. గాంధీ భవన్ లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీలపై కాంగ్రెస్ జెండా ఎగరవేయాలని పిలుపునిచ్చారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో నెగ్గి చూపించామని, పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ ను బొంద పెట్టి గుండు సున్నకు తీసుకువెళ్లామని అన్నారు. కంటోన్మెంట్, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ను ఓడించామని చెప్పారు. పంచాయతీల్లో మనం పూర్తి స్థాయిలో పట్టు సాధించామని అన్నారు. రాష్ట్రంలో రాబోయే మరో 8 ఏళ్లు మనమే అధికారంలో ఉండబోతున్నామని అందువల్ల స్థానిక సంస్థలలో మన పట్టు ఉంటేనే అభివృద్ధి చేస్తామన్నారు. రెండేండ్లలో ఒక్క ఎమ్మెల్యే రాలేదు తాను ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి ఒక్క బీఆర్ఎస్ ఎమ్మెల్యే కూడా తన వద్దకు ప్రజా సమస్యల కోసం రాలేదని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. వాళ్లకు రాజకీయ పదవులు కావాలే తప్ప ప్రజా సమస్యలపై పట్టింపు లేదని విమర్శించారు.

### 9 జిల్లాల్లో సీఎం సభలు

హైదరాబాద్: మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పేరు మార్పుపై 9 జిల్లాల్లో భారీ బహిరంగ సభలు నిర్వహించనున్న ట్టు సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. ఫిబ్రవరిర 3న మహబూబ్ నగర్ తో సభలు ప్రారంభిం చి 9వ తేదీన ముగిద్దామని చెప్పారు. సభల సమన్వయ బాధ్యతను రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి అప్పగిస్తున్నట్టుతెలిపారు. ఏఐసీసీ ఇంచార్జ్ మీనాక్షి నటరా జన్, పీసీసీ చీఫ్, డిప్యూటీ సీఎం లకు పర్యవేక్షణ బాధ్యత అప్పగిస్తున్నట్టు సీఎం తెలిపారు. ములుగులో నిర్వహించనున్న సభకు కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా, రాహుల్ గాంధీలను ఆహ్వానిస్తామని తెలిపారు. మండల కేంద్రాల్లో విస్తృతంగా నిరసన సభలు చేపట్టాలని, తాను ఒక మండలం బాధ్యత తీసుకుంటానని సీఎం అన్నారు.

### రేవంత్ రెడ్డితో హిమాచల్ ప్రదేశ్ మంత్రి సమావేశం...

# తెలంగాణ సీఎంపై ప్రశంస

- రాష్ట్రంలో విద్యా వ్యవస్థలో తీసుకువస్తున్న సంస్కరణలను వివరించిన ముఖ్యమంత్రి
- జాతీయ విద్యా విధానం తరహాలో తెలంగాణ విద్యా విధానం తీసుకు రానున్నట్లు వెల్లడి
- మల్లేపల్లి ఐటీసీని సందర్శించాలని హిమాచల్ మంత్రికి రేవంత్ రెడ్డి సూచన



**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో హిమాచల్ ప్రదేశ్ విద్యా శాఖ మంత్రి రోహిత్ ఠాకూర్ నేతృత్వంలోని బృందం సమావేశమైంది. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రంలో విద్యా వ్యవస్థలో తీసుకువస్తున్న సంస్కరణలు, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలల ఏర్పాటు వివరాలను హిమాచల్ ప్రదేశ్ మంత్రికి ముఖ్యమంత్రి వివరించారు. 25 ఎకరాల సువిశాల స్థలంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థులకు ఒకేచోట మినీ యూనివర్సిటీ తరహాలో రూ. 200 కోట్లతో రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మిస్తున్నట్లు తెలిపారు. జాతీయ విద్యా విధానం తరహాలో త్వరలో తెలంగాణ విద్యా విధానం తీసుకురానున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా మల్లేపల్లి ఐటీసీని సందర్శించాలని హిమాచల్ ప్రదేశ్ మంత్రికి ముఖ్యమంత్రి సూచించారు. ఇంటిగ్రేటెడ్ పాఠశాలల నిర్మాణంపై హిమాచల్ మంత్రి రోహిత్ ఠాకూర్

వివరాలు 7లో..



### రాహుల్ గాంధీని రేవంత్ రెడ్డి ఏం అన్నాడో నేనూ అదే అన్నాను


- రాహుల్ గాంధీ పప్పు కాదు, ముద్దపప్పు అని రేవంత్ రెడ్డి అన్నారన్న కేటీఆర్
- ఇప్పుడు నేనూ ముద్దపప్పు అన్నానని చెప్పిన కేటీఆర్
- రేవంత్ రెడ్డిని విమర్శించిన తర్వాత తనను అనాలన్న కేటీఆర్

**హైదరాబాద్ పెన్ పవర్:** కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఏమని సంబోధించారో, తాను అదే వ్యాఖ్య చేశానని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు.

వివరాలు 7లో..

### 'అన్వేష'తో 2026కి శ్రీకారం...

## మరో ఉపగ్రహ ప్రయోగానికి సిద్ధమవుతున్న ఇస్రో




- 2026 తొలి ప్రయోగానికి సిద్ధమైన ఇస్రో
- ఈ నెల 12న పీఎస్ఎల్వీ-సీ62 ద్వారా జూనూ-చీ1 ఉపగ్రహ ప్రయోగం
- వ్యవసాయం, పర్యావరణ పర్యవేక్షణ కోసం 'అన్వేష' ఉపగ్రహం
- ప్రధాన ఉపగ్రహంతో పాటు మరో 15 చిన్న ఉపగ్రహాలు కూడా
- స్పెయిన్ స్టార్టప్ అభివృద్ధి చేసిన రీ-ఎంట్రీ టెక్నాలజీ ప్రదర్శన

వివరాలు 7లో..

### ఖాళీ అవుతున్న హైదరాబాద్...

## కిటకిటలాడుతున్న సికింద్రాబాద్ రైల్వే స్టేషన్



- సంక్రాంతి సెలవులకు సొంతూళ్లకు పయనమవుతున్న జనాలు
- జనసంద్రాన్ని తలపిస్తున్న రైల్వే స్టేషన్లు
- ఇప్పటికే 150 ప్రత్యేక రైళ్లను అనౌన్స్ చేసిన దక్షిణ మధ్య రైల్వే

**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణలో పాఠశాలలు, కళాశాలలకు సంక్రాంతి సెలవు లు ప్రకటించిన నేపథ్యంలో హైదరాబాద్ లో నివసిస్తున్న

వివరాలు 7లో..

## కేసీఆర్ ఫామ్‌హౌస్‌కు మంత్రులు కొండా సురేఖ, సీతక్క.. బీఆర్ఎస్ అధినేత ఆత్మీయ పలకరింపు

- మేడారం జాతరకు ఆహ్వానం పలికేందుకు ఎర్రవెల్లికి చేరుకున్న మంత్రులు
- "బాగున్నారా అమ్మా" అని పలకరించిన కేసీఆర్
- మంత్రులకు అతిథి మర్యాదలతో పసుపు, కుంకుమ, చీర, తాంబూలాలతో కేసీఆర్ సత్కారం

**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణ రాష్ట్ర మంత్రులు కొండా సురేఖ, సీతక్కలను మాజీ ముఖ్య మంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆత్మీయంగా పలకరించారు. తన నివాసానికి వచ్చిన మంత్రులను "బాగున్నారా అమ్మా" అని ఆయన అప్యాయంగా పలకరించారు. మేడారం సమ్మక్క-సారలమ్మ జాతర ఆహ్వాన పత్రికను కేసీఆర్‌కు అందజేసేందుకు మంత్రులు ఎర్రవెల్లిలోని ఆయన ఫామ్‌హౌస్‌కు వెళ్లారు.



వివరాలు 7లో..

### తిరుమల రథసప్తమి వేడుకల ఏర్పాట్లపై అదనపు ఈవో సమీక్ష..



**హైదరాబాద్ పెన్ పవర్:** :రథసప్తమి వేడుకలకు తిరుమల తిరుపతి దేవస్థానం ముస్తాబవుతోంది. జనవరి 25న జరగనున్న వేడుకల ఏర్పాట్లపై టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి గురువారం (జనవరి 08) సమీక్షా సమావేశం నిర్వహించారు. వేడుకల వైకుంఠ ద్వార దర్శనాలను విజయవంతం చేసినట్లుగానే.. రథ సప్తమి పర్వదినాన్ని అద్భుతంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు

వివరాలు 7లో..

## వాటికి అడ్డు చెప్పవద్దని ఏపీ పునర్విభజన చట్టంలో ఉంది

- కృష్ణా జలాల అంశంలో ప్రజలను కేసీఆర్ పదేపదే మోసం చేశారని ఆరోపణ
- పోతిరెడ్డిపాడు ద్వారా 4 టీఎంసీల నీటిని ఏపీకి తరలించారన్న బండి సంజయ్
- అప్పుడు కాంగ్రెస్, బీఆర్ఎస్ పట్టించుకోలేదని విమర్శ



**హైదరాబాద్ పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంలో అప్పటికే నిర్మాణంలో ఉన్న నీటి ప్రాజెక్టులకు అభ్యంతరం చెప్పకూడదని ఉందని కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ స్పష్టం చేశారు. నీటి పంపకాల విషయంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల మధ్య జరుగుతున్న వాగ్యుద్ధం నేపథ్యంలో ఆయన ఈరోజు మీడియాతో మాట్లాడుతూ, కృష్ణా జలాల్లో తెలంగాణకు 571 టీఎంసీలు రావాల్సి ఉండగా, కేవలం 299 టీఎంసీలకు మాత్రమే అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ఎందుకు అంగీకరించారని ప్రశ్నించారు. కృష్ణా జలాల విషయంలో

వివరాలు 7లో..



### అమెరికా నౌకలను ముంచేస్తాం...

## రష్యా ఎంపీ వార్నింగ్


- వెనెజువెలాతో సంబంధముందంటూ రష్యా జెండా కలిగిన ట్యాంకర్‌ను సీజ్ చేసిన అమెరికా
- అవసరమైతే అమెరికా నౌకలను ముంచేస్తామన్న రష్యా ఎంపీ
- ఉత్తర అట్లాంటిక్ సముద్రంలో హెలికాప్టర్‌తో అమెరికా మెరైన్ల ఆపరేషన్
- ఇది సముద్రపు దొంగతనమంటూ రష్యా తీవ్ర విమర్శ
- వెనెజువెలాపై ఆంక్షల అమలులో భాగంగానే ఈ చర్య

**హైదరాబాద్ పెన్ పవర్:** వెనెజువెలాతో సంబంధం ఉందంటూ, రష్యా జెండా కలిగిన ఆయిల్ ట్యాంకర్‌ను అమెరికా బలగాలు స్వాధీనం చేసుకోవడం తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. ఉత్తర అట్లాంటిక్ మహాసముద్రంలో

వివరాలు 7లో..

## డ్రగ్స్ దందా...

### కువైట్‌లో ఇద్దరు భారతీయులకు మరణశిక్ష



- హెరాయిన్, మెథాంఫెటమైన్‌లతో పట్టుబడిన భారతీయులు
- నిందితులకు అంతర్జాతీయ డ్రగ్స్ నెట్ వర్క్‌తో సంబంధాలు ఉన్నట్లు దర్యాప్తులో వెల్లడి
- ఆధారాలను కోర్టులో ప్రవేశపెట్టడంతో మరణశిక్ష విధిస్తూ కోర్టు తీర్పు

వివరాలు 7లో..

# ముున్సిపల్ ఎన్నికలకు SEC రెడీ..




**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణలో మున్సిపల్ ఎన్నికలపై రాష్ట్ర ఎన్నికల సంఘం సన్నద్ధమవుతోంది.అన్ని రాజకీయ పార్టీల నేతలతో ఇవాళ ఎస్ఈసీ సమావేశం అయ్యింది. మున్సిపల్ ఎన్నికల నిర్వహణ,ఓటర్ డ్రాఫ్ట్ ,పోలింగ్ స్టేషన్ల వివరాలపై చర్చిస్తోంది. ఇప్పటికే కలెక్టర్లు, మున్సిపల్ అధికారులతో ఎన్నికల సంఘం సమావేశమైంది.ఎన్నికలకు సర్కారు రెడీ కావడంతో రాష్ట్రంలో రాజకీయ వాతావరణం హీటెక్కింది. పార్టీ సింబల్స్‌పై జరిగే ఎన్నికలు కావడంతో ప్రధాన పార్టీలన్నీ చాలెంజ్‌గా తీసుకుంటున్నాయి. ఇప్పటికే మూడు ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ నుంచి నేతలు బస్తీబాట పట్టారు. పంచాయతీ ఎన్నికల్లో 66 శాతం సర్పంచ్‌స్థానాలను గెలిచిన కాంగ్రెస్.. అదే ఊపుతో మున్సిపాలిటీలపైనా మూడు రంగుల జెండా ఎగరేయాలని ఉత్సాహంతో ఉన్నది.ఈ సారి మున్సిపల్ ఎన్నికలను బ్యాలెట్ పేపర్ తోనే నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ఎన్నికలు జరిగే117 మున్సిపాలిటీలు,

-4 లో

# పెన్ పవర్ తెలంగాణ రౌండప్





## అమ్మ... అత్తమ్మల పర్యవేక్షణలో..
# ఆప్యాయత వడ్డన

ఈసారి పిండివంటల తయారీలో ఒక ప్రత్యేకత సంతరించుకుంది. తన అత్తమ్మ స్వరాజ్యమ్మ... అమ్మ శ్యామలమ్మల పర్యవేక్షణలో ఈ వంటలను సిద్ధం చేయిస్తున్నారు. కుటుంబంలోని ఈ ఇద్దరు పెద్దల సమక్షంలో... పాతకాలపు రుచులు ఉట్టిపడేలా వంటశాల సందడిగా మారింది. హైదరాబాద్ నుంచి ప్రత్యేకంగా ఇక్కడికి వచ్చి... మరీ ముఖ్యంగా ఇంట్లోని పెద్దల మార్గనిర్దేశంలో ఈ వంటకాలు చేయించడం విశేషం.



# పొంగులేటి ఇంట ఆత్మీయ 'మాధురి'యం..!

## స్వరాజ్యమ్మ... శ్యామలమ్మల పర్యవేక్షణలో పసందైన వంటకం!



### ఘుమఘుమలాడే పసందైన రుచులు

ఖమ్మం శ్రీనగర్ కాలనీలోని మంత్రి క్యాంప్ కార్యాలయం ప్రస్తుతం ఓ పెద్ద వంటిల్లులా మారిపోయింది. నేతి అరిసెలు.... ఫ్లవర్ బాదుషాలు... మిక్చర్... నెలవంకలు వంటి నోరూరించే రుచులు అక్కడ సిద్ధమవుతున్నాయి. "మా కోసం నిరంతరం శ్రమించే సిబ్బంది కూడా మా కుటుంబ సభ్యులే" అని మాధురి పేర్కొన్నారు. బయట కొన్న స్వీట్ల కంటే తమ చేతులతో చేసి పెట్టే వంటకాల్లోనే నిజమైన ప్రేమ ఉంటుందని ఆమె నమ్మకం.

### ఏడాది పొడవునా పంచే అనురాగం

పొంగులేటి కుటుంబానికి పదిమందితో ప్రేమను పంచుకోవడం ఎప్పటి నుంచో ఉన్న అలవాటు. వేసవిలో ఆవకాయ పచ్చడి... ప్రతీ సంక్రాంతి పండుగ వేళ పిండివంటలు పంపడం ఆ కుటుంబానికి ఒక ఆచారంగా మారిపోయింది. ఎన్ని పనులున్నా... తమను నమ్ముకున్న మనుషులను గౌరవించే ఈ సంస్కృతి ఉమ్మడి ఖమ్మం జిల్లాలో అందరి హృదయాలను హత్తుకుంటోంది.



**ఉమ్మడి ఖమ్మం జిల్లా బ్యూరో పెన్ పవర్ జనవరి 8**
అధికార హోదా కన్నా ఆత్మీయతకే పెద్దపీట వేస్తోంది తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి నివాసం. సంక్రాంతి పండుగ అంటే కేవలం వేడుక మాత్రమే కాదు, తోటి మనుషుల నోరు తీపి చేయడమే అసలైన పండుగ అని చాటుతున్నారు ఆయన సతీమణి మాధురి. ప్రతీ ఏటా తమను నమ్ముకున్న వారికి రుచికరమైన పిండివంటలు అందించే ఆనవాయితీని ఈ ఏడాది కూడా కొనసాగిస్తున్నారు.

# తెలంగాణలో IDTR ఏర్పాటు చేయండి

## కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి మంత్రి పొన్నం విజ్ఞప్తి



**హైదరాబాద్ పెన్ పవర్:** న్యూఢిల్లీ లోని భారత్ మండపంలో నిర్వహించిన మంత్రుల సమావేశం, ట్రాన్స్‌పోర్ట్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ సమావేశానికి హాజరయ్యారు మంత్రి పొన్నం ప్రభాకర్. ఈ సందర్భంగా తెలంగాణలో డ్రైవింగ్ ట్రైనింగ్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (IDTR) ఏర్పాటు చేయడానికి మద్దతు ఇవ్వాల్సిందిగా కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీని కోరారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రానికి సంబంధించిన పలు ముఖ్యమైన రవాణా అంశాలపై వివరమైన ప్రతినిధి పత్రాన్ని (Representation) సమర్పించారు.

రాష్ట్రంలో డ్రైవింగ్ ట్రైనింగ్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (IDTR) ఏర్పాటు, మద్దతు

రవాణా మౌలిక వసతుల అభివృద్ధి కోసం 175 కోట్ల రూపాయల సాస్‌సీ (SASC) నిధుల మంజూరు

మోటార్ వాహనాల చట్టంలో ప్రతిపాదిత సవరణలు, వాటి ప్రభావం గురించి చర్చ

తెలంగాణ రాష్ట్రంలో రహదారి భద్రత, డ్రైవర్ శిక్షణ, రవాణా వ్యవస్థను మరింత బలోపేతం చేయడానికి కేంద్ర ప్రభుత్వ సహకారం అత్యవసరమనికేంద్ర మంత్రికి వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం సమర్పించిన అంశాలను సానుకూలంగా పరిశీలించి, తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు నితిన్ గడ్కరీ.



# ఫిబ్రవరి 3 నుంచి ..9 జిల్లాల్లో సీఎం బహిరంగ సభలు

**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణలో ఎన్నికల మున్సిపల్ ఎన్నికల హీట్ మొదలైంది.అధికార కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ ఎన్నికలకు సన్నద్ధం అయ్యింది. జిల్లాల్లో సీఎం బహిరంగ సభలకు ప్లాన్ చేస్తోంది. ఉపాధి హామీ పథకంలో గాంధీ పేరుతొలగింపు ఓ వైపు నిరసన కార్యక్రమాలు..మరోవైపు ఎన్నికల వ్యూహాలతో ముందుకెళ్తోంది కాంగ్రెస్. ఈ క్రమంలోనే ఉమ్మడి తొమ్మిది జిల్లాల్లో సీఎం బహిరంగ సభలకు కసరత్తు చేస్తోంది. ఫిబ్రవరి 3న మహబూబ్ నగర్ జిల్లాలో బహిరంగ సభ జరగనుంది. ఇలా ఫిబ్రవరి 9 వరకు ఉమ్మడి జిల్లాల్లో బహిరంగ సభలు జరగనున్నాయి. పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి బహిరంగ సభల సమన్వయ బాధ్యత అప్పగించింది కాంగ్రెస్. మీనాక్షి, పీసీసీ చీఫ్ డిప్యూటీ సీఎంలకు పర్యవేక్షణ బాధ్యత అప్పగించారు. ములుగు బహిరంగ సభకు సోనియా, రాహుల్ కు ఇన్విటేషన్ ఇవ్వనున్నారు. అలాగే మండలాల్లో నిరసన సభలను విస్తృతంగా నిర్వహించాలని నిర్ణయించింది. ఒక్కో మండలానికి ఒక్క కీలక లీడర్ బాధ్యత తీసుకోవాలని సూచించారు సీఎం.ఈ సారి మున్సిపల్ ఎన్నికలను బ్యాలెట్ పేపర్ తోనే నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం

-4 లో

# అలర్ట్.. HT పత్తి విత్తనాలు అమ్మొద్దు..కొనొద్దు






**హైదరాబాద్ పెన్ పవర్:** కేంద్ర ప్రభుత్వం అనుమతిలేని HT (Herbicide Tolerant) పత్తి విత్తనాలను రాష్ట్రంలోకి రాకుండా చర్యలు తీసుకోవాలని మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు అధికారులను ఆదేశించారు. సరిహద్దులో టాస్క్ ఫోర్స్ టీమ్ లు ఏర్పాటు చేసి నిఘా ఏర్పాటు చేయాలని చెప్పారు. రాష్ట్రంలో అనధికారకంగా, అనుమతిలేని పత్తి విత్తనాల ప్యాకెట్ల అమ్మకాలను అరికట్టాలని మంత్రి తుమ్మల అన్నారు. పత్తి విత్తనాల ప్యాకేట్లపై వ్యవసాయశాఖ సంచాలకులతో సచివాలయంలో వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల సమీక్ష నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ అనుమతిలేని ు పత్తి విత్తనాలను రాష్ట్రంలో అమ్మకుండా కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. HT/BG`III పత్తి రకాన్ని అమెరికాకు చెందిన మోన్సాంటో కంపెనీ కనుగొన్నప్పటికి, ఫీల్డ్ ట్రయల్స్ లో ఫెయిల్ అవడం, దీనివలన పర్యావరణానికి కలిగే అనర్థాలను దృష్టిలో ఉంచుకొని కేంద్ర ప్రభుత్వం ఈ పత్తి రకానికి అనుమతులు ఇవ్వలేదని మంత్రి తెలిపారు.అయినప్పటికి కొందరు దళారులు తమ ప్రయోజనాల కోసం రైతులకు ు పత్తి విత్తనాలను అనధికారకంగా రైతులకు అంటగడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో 20 అధీకృత పత్తి విత్తన కంపెనీలు విత్తనోత్పత్తి చేస్తుండగా, ప్రభుత్వం సర్టిఫైడ్ చేసిన మరో 40 వివిధ కంపెనీలు రాష్ట్రానికి పత్తి విత్తన ప్యాకెట్లను సరఫరా చేస్తున్నాయన్నారు. గత సంవత్సరం ఈ కంపెనీల ద్వారా సరఫరా అయిన 1.10 కోట్ల పత్తి విత్తన ప్యాకెట్లను రైతుల కొనుగోలు చేశారన్నారు. కొందరు దళారులు కేంద్ర ప్రభుత్వం బ్యాన్ చేసిన ు విత్తనాలతో పాటు కల్తీ విత్తనాలను మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రాల నుంచి తీసుకొచ్చి తెలంగాణ సరిహద్దు ప్రాంతాలలోని రైతులకు అమ్ముతున్నట్టు గుర్తించామని మంత్రి తెలిపారు. రాష్ట్రంలో దాదాపు 52 లక్షల ఎకరాలలో పత్తి సాగయ్యే అవకాశం ఉందని, దీనిని ఆసరా చేసుకొని దళారులు ు విత్తనాలు,కల్తీ విత్తనాలను రాష్ట్రంలోకి తెచ్చే అవకాశం ఉన్నందున, ఈ నెల నుంచే సరిహద్దు ప్రాంతాలలో టాస్క్ ఫోర్స్ టీంలను ఏర్పాటు చేసిన పత్తి విత్తనాల అక్రమ రవాణాలను అరికట్టే విధంగా నిఘా ఏర్పాట్లు చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు.

-4 లో

# కులాలు, వర్గాల కతీతంగా మత్స్యశాఖ సహకార సంఘం అభివృద్ధి చెందాలి







**ఉమ్మడి ఖమ్మం జిల్లా బ్యూరో పెన్ పవర్ జనవరి 8** నూతన గుర్తింపు కార్డుల పంపిణీ కార్యక్రమంలో మేకల మల్లి బాబు యాదవ్ దనియాకుల హనుమంతరావు రాజకీయాలు కులాలు వర్గాలకతీతంగా గిరిజనులు గిరిజనేతరులు ఒక కుటుంబం లాగా కలిసిమెలిసి ఆర్థికంగా బలోపేతం కావాలని మాజీ జెడ్పిటిసి, మాజీ డిసిసిబి డైరెక్టర్ మేకల మల్లి బాబు యాదవ్ పిలుపునిచ్చారు.

కామేపల్లి మండలం పండితాపురం గ్రామంలోని కొండాయిగూడెం మత్స్య శాఖ సహకార సంఘంలో నూతనంగా గిరిజనులు సభ్యత్వం తీసుకున్నారు. ప్రభుత్వం వారిచే జారీ చేయబడిన సభ్యత్వ కార్డులు పంపిణీ కార్యక్రమం గురువారం జరిగింది. తదనంతరం మత్స్యశాఖ సంఘం అధ్యక్షులు మేకల మల్లికార్జున రావు అధ్యక్షతన జరిగిన పంపిణీ కార్యక్రమంలో మాజీ పి ఏ సి ఎస్ అధ్యక్షులు ధనియా కుల హనుమంతరావు తో పాటు పాల్గొన్న మల్లి బాబు యాదవ్ మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో ఏజెన్సీ ఏరియా ప్రాంతంలో తెలంగాణ ప్రభుత్వం ఆదేశానుసారం మత్స్యశాఖ సంఘంలో 207మంది గిరిజనులను సభ్యులుగా చేర్చుకోవడం జరిగిందని, వారంతా ఐటిడిఏ, మత్స్య శాఖ ద్వారా చేపలు పట్టడం వల విసరడం మార్కెటింగ్ చేయడం లాంటి వాటిని నేర్చుకోవడం జరిగిందని, అదేవిధంగా ప్రతి సంవత్సరం చెరువులలో చేప పిల్లల పోసి పెంచుకోవాలని, దీనికోసం రేవంత్ రెడ్డి ప్రభుత్వం కూడా అనేక రాయితీలు, భీమా సౌకర్యం, కల్పించిందని, కులాలు తెగలు, బేధాభిప్రాయాలు లేకుండా సంఘం సభ్యులంతా ఒక కుటుంబం లాగా ఆర్థికంగా అభివృద్ధి చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కొమ్మినేని శ్రీను, సంఘం ప్రధాన కార్యదర్శి బండి నాగేశ్వరరావు, డైరెక్టర్లు అయితనబోయిన వీరభద్రం, తురక బిక్షం, చల్ల పెద్ద నాగయ్య, చల్ల నరసింహారావు బండి బేగయ్య, చల్ల మల్లయ్య బానోతు లక్ష్మ, ధరావత్ లాలు అయితనబోయిన విటల్ రావు, శీలం పుల్లయ్య, జక్కంపూడి వెంకటేశ్వర్లు అయితనబోయిన నాగేశ్వరరావు ధర్మ సోత్ కిషన్, ధర్మ సోత్ నాగేశ్వరరావు, భానోత్ వీరన్న బానోతు కిషన్ మరియు తదితరులు పాల్గొన్నారు.

# నర్సింగ్ అధికారులతో భేటీ







**ఉమ్మడి ఖమ్మం జిల్లా పెన్ పవర్ జనవరి 8:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధికారులు కార్యాలయం నవభారత్ పాల్వంచ.... జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారిజడాక్టర్ తుకారాం రాథోడ్ భద్రాది కొత్తగూడెం జిల్లా పార్మసీ అధికారులు మరియు నర్సింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించడం జరిగింది. దీనిలో భాగంగా ఫార్మసీ అధికారులకు ఈ ఔషదీ పోర్టల్ నందు కావాల్సిన మందుల ఇండెంట్ ఎప్పటి కప్పుడు అప్డేట్ చేసుకోవాలని, కాలం చెల్లిన మందుల వివరాలు రిజిస్టర్ పెట్టుకోవాలని అని, కాలం చెల్లుతున్న మందులను గుర్తించి త్వరగా ఖర్చు చెయ్యాలని మరియు అన్ని ఆరోగ్య కేద్రాలయందు మందుల కొరత లేకుండా చూసుకోవాలని ఆదేశాలు ఇచ్చారు

. నర్సింగ్ అధికారుల సమీక్ష నందు ౧ూ మరియు ఇన్ పేషెంట్ రోగులతో ప్రేమతో మాట్లాడుతూ చికిత్స అందించాలని, జీరో డోస్ ఇమ్యూనైజషన్ అప్పుడే పుట్టిన పిల్లలకు ఖచ్చితంగా అందించాలని, ఖూ౬జ ఝఋఋఴుఎ నందు నర్సింగ్ అధికారి శంకరమ్మ అందిస్తున్న సేవలను కొనియాడుతూ, అలాగే అందరు పని చెయ్యాలని మరియు దవాఖనలో ప్రసూతిల సంఖ్యను పెంచాలని, ఆదేశాలు ఇచ్చారు. తదుపరి జిల్లా వాక్సిన్ స్టోర్ ను ఆకస్మికంగా తనిఖీ చేసి సంతృప్తి తెలియజేస్తూ అన్ని ఆరోగ్య కేంద్రాలందు వాక్సిన్ కొరత లేకుండా చూడాలి అని ఆదేశాలు ఇచ్చారు. ఈ కార్యక్రమం నందు డాక్టర్ తేజస్విూా జ౬×, నాగభూషణం జ౬ూ, మోహన్ ఇూమీూ పార్మసీ మరియు నర్సింగ్ అధికారులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ విస్తృతస్థాయి సమావేశం హాజరైన సత్యనారాయణ గౌడ్





**ఉమ్మడి ఖమ్మం జిల్లా పెన్ పవర్ జనవరి 8**తెలంగాణ రాష్ట్ర ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ విస్తృత స్థాయి సమావేశానికి హాజరైన జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ హైదరాబాద్ గాంధీభవన్ లో టి పి సి సి అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ అధ్యక్షతన ,తెలంగాణ రాష్ట్ర ఇంచార్జి మీనాక్షి నటరాజన్ ఏ ఐ సి సి సెక్రటరీ పెరుమాళ్ విశ్వనాథన్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి , ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు మరియు మంత్రి వర్యులు, ముఖ్య నాయకులు పాల్గొన్న తెలంగాణ రాష్ట్ర ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ విస్తృత స్థాయి కార్యవర్గ సమావేశంలో పాల్గొన్న లిజిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా వీ+చీ=జు+ూా బచావో సంగ్రామ్ పేరిట పెద్ద ఎత్తున ప్రజలకు తెలియజేయాలని అదే విధంగా 2005లో యు పి ఏ ప్రభుత్వం చేసిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (వీ+చీ=జు+ూా) హక్కుల ఆదారిత చట్టం, ఇది ప్రతి గ్రామీణ కుటుంబానికి వేతన ఉపాధిని డిమాండ్ చేసి చట్టపరమైన హక్కును హామీ ఇస్తుందని,డిమాండ్ వచ్చిన 15 రోజుల్లోపు రాష్ట్రం ఉపాధిని అందించటానికి చట్టబద్ధంగా కట్టుబడి ఉంటుందని, లేకపోతే నిరుద్యోగ భృతి చెల్లించబడుతుందని, ఈ చట్టపరమైన అర్హత వీ+చీ=జు+ూా యొక్క నిర్వహించే లక్షణం.వీ+చీ=జు+ూా గ్రామీణ జీవనోపాధి భద్రతకు మూల స్థంభంగా ఉండి, ఏటా 5-6 కోట్ల ఉపాధిని ఇస్తూ కష్టాల వలసలను తగ్గిస్తూ,గ్రామీణ వేతనాలను పెంచుతూ మన్నికైన సమాజ ఆస్తులను సృష్టిస్తుందని,డిమాండ్ ఆధారిత డిజైన్ హామీ ఇవ్వబడిన బ్యాంకుల ద్వారా చెల్లింపులు ద్వారా మహిళలు,దళితులు,ఆదివాసీలు మరియు అణగారిన వర్గాలకు ప్రయోజనం చేకూర్చాయని ఈ పని దినాలలో 60 శాతం మహిళలు లబ్దిపొందారని అట్టి పథకానికి తూట్లు పొడుస్తూ కేంద్ర ప్రభుత్వం (బి జె పి) కొత్త వీబీ జీ రామ్ జీ చట్టం ఈచట్రం నుండి ప్రాథమిక నిష్క్రమణను సూచిస్తూ పనికి చట్టపరమైన హామీని తొలగిస్తూ తీసుకొన్న నిర్ణయాన్ని కేంద్రీకరిస్తుంది.గ్రామసభలు ,గ్రామపంచాయితీలను బలహీన పరుస్తూ కేంద్రం యొక్క వేతన సహకారాన్ని 90 శాతం నుండి 60 శాతానికి తగ్గిస్తూ తద్వారా రాష్ట్రాలు మరియు గ్రామీణ,వలస కార్మికులపై ఆర్థికభారం మోపుతూ బడ్జెట్ పరిమితి కేటాయింపులు,వ్యవసాయసీజన్ లో పనిపై పరిమితులు, వేతన రక్షణ తొలగించి తప్పనిసరిగా ఉపాధిని తగ్గించడానికి,వేతనాలను అణచివేయడానికి గ్రామీణ దుస్థితికి దారితీస్తుందని ఈ కార్యక్రమం నుండి మహాత్మా గాంధీ పేరును తొలగించి MGNREGA ఆధారమైన శ్రమ,గౌరవం మరియు గ్రామ స్వపరిపాలన విలువలను నీరుగార్చే ప్రయత్నాన్ని మరింత ప్రతిబింబిస్తుంది.గ్రామీణ, వలస కార్మికుల జీవనోపాధిపై ఈ దాడి తీవ్రతను గుర్తించిన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశంలో గ్రామీణప్రాంత ప్రజలకు పని చేసే హక్కును రక్షించటానికి,MGNREGA ను దాని అసలు హక్కుల ఆధారిత రూపంలో పునరుద్ధరించటానికి జాతీయ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మల్లిఖార్జున ఖర్గే, సోనియా గాంధీ, రాహుల్ గాంధీ ల ఆదేశానుసారం టి పి సి సి అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్,తెలంగాణ రాష్ట్ర ఇంచార్జి మీనాక్షి నటరాజన్,ఏ ఐ సి సి సెక్రటరీ పెరుమాళ్ విశ్వనాథన్, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు, మంత్రి వర్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి,తుమ్మల నాగేశ్వరరావు గార్లు మరియు సహచర మంత్రివర్యులు సూచన మేరకు రానున్న రోజులలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని పునరుద్ధరించాలని,మహాత్మా గాంధీ పేరును యధావిధిగా ఉంచాలని కోరుతూ వీబీ జీ రామ్ జీ చట్టానికి వ్యతిరేకంగా జిల్లా వ్యాప్తంగా ప్రతి గ్రామంలో నిరసన కార్యక్రమాలు నిర్వహించటానికి భారీ ఎత్తున కార్యాచరణ రూపొందిస్తున్నామని అన్నారు.

## మున్సిపల్ ఎన్నికలకు SEC రెడీ..

-3 పేజీ తరువాయి

6 కార్పొరేషన్ల పరిధిలో బ్యాలెట్ బాక్స్‌లు సిద్ధం చేసుకోవాలని జిల్లా కలెక్టర్లు, మున్సిపల్ కమిషనర్లను ఆదేశించింది.రాష్ట్రవ్యాప్తంగా 124 మున్సిపాలిటీలు 9 గ్రేటర్ కార్పొరేషన్లు ఉండగా వీటిలో గ్రేటర్ హైదరాబాద్(జీహెచ్ఎంసీ) పాలకవర్గం గడువు వచ్చే ఏడాది ఫిబ్రవరితో ముగుస్తుంది. వరంగల్, ఖమ్మం కార్పొరేషన్లతో పాటు సిద్దిపేట, జడ్చర్ల, కొత్తూర్, అచ్చంపేట, నకిరేకల్ మున్సిపాలిటీల పాలవర్గాల గడువు వచ్చే ఏడాది మే వరకు ఉన్నది. ఇవి కాక మందమర్రి, మణుగూరు మున్సిపాలిటీలు షెడ్యూల్డ్ ఏరియాలో ఉన్నవి.ఈ పది చోట్ల మినహా ఇంకా మిగిలిన 117 మున్సిపాలిటీలు, 6 కార్పొరేషన్ల పాలకవర్గాల గడువు ఈ ఏడాది జనవరిలోనే ముగిసింది. ప్రస్తుతం ఇక్కడ స్పెషల్ ఆఫీసర్ల పాలన కొనసాగుతున్నది. ఇప్పటికే 117 మున్సిపాలిటీల పరిధిలో 2,630, ఆరు కార్పొరేషన్ల పరిధిలో 366 వార్డులను ఎలక్షన్ కమిషన్ ఫైనల్ చేసింది. అన్ని చోట్ల కలిపి 52.71 లక్షల మంది ఓటర్లు ఉన్నట్లుగా ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రకటించి, అభ్యంతరాలను స్వీకరిస్తున్నారు.

## తెలంగాణ వ్యాప్తంగా సెంట్రలైజ్డ్ కిచెన్..స్టూడెంట్స్ కు బ్రేక్ ఫాస్ట్, లంచ్

-3 పేజీ తరువాయి

ఈ స్కూళ్లలో సోలార్ కిచెన్ల నిర్మాణాలను పీఎం కుసుమ్ లో చేపట్టే అవకాశాలను పరిశీలించాలని... వీటి నిర్మాణాలకు సంబంధించి బిల్లులను ఎప్పటికపుడు విడుదల చేయాలని ఆదేశించారు సీఎం. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో 23 నూతన పాఠశాల భవనాలు నిర్మాణాలు వచ్చే విద్యా సంవత్సరం నాటికి అందుబాటులోకి రావాలని చెప్పారు సీఎం. బాచుపల్లి పాఠశాలకు ప్రస్తుతం ఉన్న స్థలం సమీపంలో ఒకటిన్నర ఎకరాన్ని ఆ పాఠశాల నిర్మాణానికి కేటాయించాలని చెప్పారు. ప్రస్తుత, భవిష్యత్ అవసరాలకు తగినట్లు ఒకటి నుంచి పదో తరగతి వరకు సిలబస్ మార్పుపై కసరత్తును వెంటనే ప్రారంభించాలని ఆదేశించారు. పాలి టెక్నిక్ కళాశాలలు, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ నుంచి బయటకు వచ్చే ప్రతి విద్యార్థికి కచ్చితంగా ఉద్యోగం లభించేలా సిలబస్, బోధన అందించాలని అధికారులను ఆదేశించారు సీఎం.

## ఫిబ్రవరి 3 నుంచి ..9 జిల్లాల్లో సీఎం బహిరంగ సభలు

-3 పేజీ తరువాయి

నిర్ణయించింది. ఈ మేరకు ఎన్నికలు జరిగే117 మున్సిపాలిటీలు, 6 కార్పొరేషన్ల పరిధిలో బ్యాలెట్ బాక్స్‌లు సిద్ధం చేసుకోవాలని జిల్లా కలెక్టర్లు, మున్సిపల్ కమిషనర్లను ఆదేశించింది.రాష్ట్రవ్యాప్తంగా 124 మున్సిపాలిటీలు 9 గ్రేటర్ కార్పొరేషన్లు ఉండగా వీటిలో గ్రేటర్ హైదరాబాద్(జీహెచ్ఎంసీ) పాలకవర్గం గడువు వచ్చే ఏడాది ఫిబ్రవరితో ముగుస్తుంది. వరంగల్, ఖమ్మం కార్పొరేషన్లతో పాటు సిద్దిపేట, జడ్చర్ల, కొత్తూర్, అచ్చంపేట, నకిరేకల్ మున్సిపాలిటీల పాలవర్గాల గడువు వచ్చే ఏడాది మే వరకు ఉన్నది. ఇవి కాక మందమర్రి, మణుగూరు మున్సిపాలిటీలు షెడ్యూల్డ్ ఏరియాలో ఉన్నవి.ఈ పది చోట్ల మినహా ఇంకా మిగిలిన 117 మున్సిపాలిటీలు, 6 కార్పొరేషన్ల పాలకవర్గాల గడువు ఈ ఏడాది జనవరిలోనే ముగిసింది. ప్రస్తుతం ఇక్కడ స్పెషల్ ఆఫీసర్ల పాలన కొనసాగుతున్నది. ఇప్పటికే 117 మున్సిపాలిటీల పరిధిలో 2,630, ఆరు కార్పొరేషన్ల పరిధిలో 366 వార్డులను ఎలక్షన్ కమిషన్ ఫైనల్ చేసింది. అన్ని చోట్ల కలిపి 52.71 లక్షల మంది ఓటర్లు ఉన్నట్లుగా ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రకటించి, అభ్యంతరాలను స్వీకరిస్తున్నారు.

## అలర్ట్.. ను పత్తి విత్తనాలు అమ్మొద్దు..కొనొద్దు

-3 పేజీ తరువాయి

అదేవిధంగా కో-మార్కెటింగ్ కు సంబంధించి విధివిధానాలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ను పత్తి విత్తనాలను రైతులు కొనకుండా పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని అధికారులకు సూచించారు. అదేవిధంగా కలుపును తట్టుకుంటుందని, అధిక దిగుబడి వస్తుందని ను పత్తి విత్తనాలను కొనవద్దని ఈ సందర్భంగా మంత్రిగారు రైతులను కోరారు. ఈ విత్తనాలను వాడటం వలన అధికంగా కలుపు మందు వాడాల్సి వస్తుందని, దీంతో పర్యావరణానికి హాని కలగడంతోపాటు జీవ వైవిధ్యం దెబ్బతిని, ఇతర పత్తి హైబ్రిడ్ లు కూడా కలుషితం అవుతాయని వివరించారు.

## పోక్సో కేసు విజయవంతం అధికారులకు జిల్లా ఎస్పీ ప్రశంసలు

**మహబూబ్ నగర్: పెన్ పవర్:**భూత్పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన ఒక పోక్సో కేసులో నిందితుడికి 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష పడేలా సమర్థవంతంగా దర్యాప్తు, ప్రాసిక్యూషన్ నిర్వహించిన పోలీస్ మరియు న్యాయశాఖ అధికారులను జిల్లా ఎస్పీ డి.జానకి, ప్రత్యేకంగా అభినందించారు.ఈ సందర్భంగా గురువారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలోని ఎస్పీ ఛాంబర్లో జిల్లా ఎస్పీ కేసు విజయవంతానికి కృషి చేసిన ప్రాసిక్యూటర్ జాన్, పోలీస్ లీగల్ అడ్వైజర్ విశ్వేశ్వర్, కోర్టు లైజన్ ఆఫీసర్ బాలకృష్ణ, ఏఎస్ఐ, కోర్టు డ్యూటీ అధికారులు ఎండి.రహీం పిసి-2769, కృష్ణ పిసి 366, శంకర్ పిసి 2194, అరవింద్ పిసి-164 లను తన ఛాంబర్కు పిలిచి ప్రశంసాపత్రాలు అందజేశారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, మహిళలు మరియు బాలలపై జరిగే నేరాల్లో నిందితులకు తప్పకుండా శిక్ష పడేలా పోలీస్ శాఖ న్యాయశాఖతో సమన్వయంతో పని చేయడం ఎంతో అవసరమని పేర్కొన్నారు. ఇలాంటి కేసుల్లో చిత్తశుద్ధితో పనిచేసే అధికారులు అభినందనలకు అర్హులని తెలిపారు. మహిళలు మరియు బాలల భద్రతకు జిల్లా పోలీస్ శాఖ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని జిల్లా ఎస్పీ స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో డిఎస్పి వెంకటేశ్వర్లు, డిసిఆర్బి డిఎస్పి రమణారెడ్డి పాల్గొన్నారు.

## జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో పాల్గొన్న జిల్లా ఎస్పీ డి.జానకి

**మహబూబ్ నగర్: పెన్ పవర్:**జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా గురువారం మహబూబ్నగర్ జిల్లా క్రీడా మైదానంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో జిల్లా ఎస్పీ డి.జానకి, ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, కూడా పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, రోడ్డు భద్రత అనేది కేవలం ట్రాఫిక్ నిబంధనల విషయం మాత్రమే కాదని, అది ప్రతి కుటుంబం భవిష్యత్తుతో ముడిపడి ఉన్న అంశమని తెలిపారు. రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువగా యువత ప్రాణాలు కోల్పోతున్నారని, ఇది సమాజానికి తీరని నష్టమని ఎస్పీ ఆవేదన వ్యక్తం చేశారు.ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, హెల్మెట్ ప్రాణ రక్షణ కవచమని తెలిపారు. అలాగే నాలుగు చక్రాల వాహనదారులు సీట్ బెల్ట్ ధరించడం ద్వారా ప్రమాద తీవ్రతను తగ్గించుకోవచ్చని వివరించారు. ట్రిబుల్ రైడింగ్ చేయడం వల్ల ప్రమాదాల అవకాశాలు రెట్టింపు అవుతాయని, మద్యం సేవించి వాహనాలు నడపడం (డ్రంక్ అండ్ డ్రైవ్) అనేది నేరంతో సమానమని హెచ్చరించారు.జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలు నిర్వహించడం వెనుక ప్రధాన ఉద్దేశ్యం ప్రజల్లో చైతన్యం తీసుకురావడమేనని జిల్లా ఎస్పీ తెలిపారు. పోలీసులు చర్యలు తీసుకోవడం కన్నా ప్రజలు స్వచ్ఛందంగా నిబంధనలు పాటించడమే నిజమైన విజయం అని ఆమె పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించి, తమ కుటుంబాల ఆనందాన్ని కాపాడుకోవాలని, అలాగే ఇతరుల ప్రాణ భద్రతకు కూడా బాధ్యతగా వ్యవహరించాలని జిల్లా ఎస్పీ గారు ప్రజలకు హృదయపూర్వకంగా విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమం ద్వారా రోడ్డు ప్రమాదాల సంఖ్యను గణనీయంగా తగ్గించడమే లక్ష్యమని తెలిపారు. అనంతరం రోడ్ సేఫ్టీ పోస్టర్లను విడుదల చేసి, ప్రతిజ్ఞ చేయించండం జరిగింది.

# గాంధీ భవన్ లో టీపీసీసీ విస్తృత స్థాయి సమావేశం

## హజరయిన సీఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్: పెన్ పవర్:** గాంధీ భవన్లో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) విస్తృత స్థాయి సమావేశం టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరయ్యారు. ఆయనతో పాటు ఏఐసీసీ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్ బాబు, ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీతక్క, తుమ్మల నాగేశ్వరరావు, అజారుద్దీన్, ఏఐసీసీ కార్యదర్శులు విశ్వనాథన్, ఏఐసీసీ నాయకులు ప్రవీణ్ చక్రవర్తి, ప్రభుత్వ సలహాదారులు కేశవ రావు, వేం నరేందర్ రెడ్డి, షబ్బీర్ అలీ, హర్కర వేణుగోపాల్ తదితరులు, హాజరయ్యారు. ఈ సమావేశంలో పొలిటికల్ ఎఫైర్స్ కమిటీ (పీఏసీ) సభ్యులు, టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్లు, జనరల్ సెక్రటరీలు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు తదితరులు పాల్గొన్నారు.

# వరంగల్ లో బీజేపీ ఛీఫ్ రామచంద్రరావు పర్యటన



**వరంగల్: పెన్ పవర్:** వరంగల్ జిల్లా పర్యటన సందర్భంగా బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రాంచందర్ రావు కు ఘన స్వాగతం లభించింది. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వరంగల్ జిల్లాలో పర్యటించడం తనకు ఎంతో గర్వకారణమని రాంచందర్ రావు తెలిపారు. వరంగల్కు భారతీయ జనతా పార్టీకి ఒక ప్రత్యేకమైన భావోద్వేగ అనుబంధం ఉందని ఆయన గుర్తుచేశారు. 1984లో భారతీయ జనతా పార్టీకి లోక్సభలో కేవలం ఇద్దరు ఎంపీలు మాత్రమే ఉన్న కష్టకాలంలో, ఆ రెండు సీట్లలో ఒకటి వరంగల్ జిల్లాకు చెందిన జంగారెడ్డి విజయంగా నిలిచిందని ఎన్. రాంచందర్ రావు గుర్తు చేశారు. అటువంటి కీలక సమయంలో కూడా పార్టీకి అండగా నిలిచిన చారిత్రక నేల వరంగల్ అని అన్నారు. అలాంటి వరంగల్ భూమిపై అడుగుపెట్టడం తనకు ఎంతో గర్వంగా ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు కాషాయ జెండాలతో, జై బిజెపి నినాదాలతో నిర్వహించిన భారీ బైక్ ర్యాలీలో రాంచందర్ రావు పాల్గొన్నారు. ఈ ర్యాలీలో పార్టీ శ్రేణులు చూపించిన ఉత్సాహం, అచంచలమైన నిబద్ధత తనకు మరింత ప్రేరణనిచ్చిందని తెలిపారు. వరంగల్ బిజెపి కుటుంబ సభ్యులందరికీ ఈ సందర్భంగా ఆయన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. తరువాత అయన భద్రకాళి అమ్మవారి దర్శనం చేసుకున్నారు. భద్రకాళి అమ్మవారిని దర్శించుకోవడం గొప్ప ఆధ్యాత్మిక శక్తిని అందించిందని, పార్టీ ప్రయాణానికి ఇది ఒక ఆశీర్వాదంలా భావిస్తున్నానని అన్నారు. అమ్మవారి ఆశీస్సులతో తెలంగాణలో బారతీయ జనతా పార్టీ ప్రయాణం మరింత వేగంగా, బలంగా సాగాలని ఆకాంక్షించారు. మాతృభూమికి మరింత గొప్పగా సేవ చేయడానికి బిజెపి కార్యకర్తలందరికీ శక్తి, ధైర్యం, జ్ఞానం ప్రసాదించాలని భద్రకాళి అమ్మవారిని కోరుకున్నట్లు ఆయన తెలిపారు.

# బీఆర్ఎస్ లో చేరిన కాంగ్రెస్ నేతలు

**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణ భవన్ లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీ నుండి పలువురు నేతలు బీఆర్ఎస్ లో చేరారు. కొల్లాపూర్ నియోజకవర్గం, చిన్నంబావి కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ రంజిత్, వార్డు మెంబర్స్, పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి కేటీఆర్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కొల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి, మాజీ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్, బీఆర్ఎస్ జనరల్ సెక్రటరీ ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్, మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి, పట్నం నరేందర్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు రావుల చంద్ర శేఖర్ రెడ్డి, రంగినేని అభిలాష్, అల్లిపురం వెంకటేశ్వర్ రెడ్డి, ఆంజనేయ గౌడ్, ఇంతియాజ్ అలీ, కురువ విజయ్ తదితరులు పాల్గొన్నారు. కేటీఆర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం మళ్లీ తిరిగి వస్తుందో.. రాదో తెలియదు నేను కూడా గెలుస్తానో లేదో తెలియదు అని మంత్రి జూపల్లి కృష్ణారావు అదిలాబాద్ లో గత ఏడాది చాలా స్పష్టంగా చెప్పాడని అన్నారు. కృష్ణారావును ఎట్టి పరిస్థితుల్లో గెలిపించబోమని కొల్లాపూర్ ప్రజలు మాత్రం ఇప్పటికే నిర్ణయించుకున్నారు. ఇదే కృష్ణారావు మా పార్టీలో ఉన్నప్పుడు కేసీఆర్ గారి గురించి ఎంత గొప్పగా మాట్లాడారు అందరికీ తెలుసు అట్లాంటిది రేవంత్ రెడ్డిని సంతృప్తి పరచడానికి అడ్డగోలుగా మాట్లాడుతున్నారు . తన మంత్రి పదవి కాపాడుకోవడం కోసం రేవంత్ రెడ్డిని ఇంద్రుడు చంద్రుడు అంటున్నాడు. అవకాశవాదంతో కాంగ్రెస్ లోకి పోయిన నాయకుడు జూపల్లి కృష్ణారావు . మంత్రి జూపల్లి కృష్ణారావు అరాచకాలను ఎదుర్కొని మరి పంచాయతీ ఎన్నికల్లో కొల్లాపూర్ లో గట్టిగా గెలిచామని అన్నారు. కాంగ్రెస్ పార్టీ గురించి చెప్పాలి అంటే మూడు ముక్కల్లో.. ఎగవేతలు, కూల్చివేతలు, పేల్చివేతలు తప్ప చేసింది ఏమీ లేదు. ఒకవైపు ఆరు గ్యారెంటీలను ఎగవేస్తూ.. హైడ్రా వంటి అరాచక విధానాలతో ఇండ్లను కూల్చివేస్తూ.. చెక్ డాంలను పేల్చి వేస్తున్న ప్రభుత్వం కాంగ్రెస్ . చెక్ డాములు కట్టేచోట పేల్చివేతలకు పాల్పడుతున్న ఏకైక దరిద్రపుగొట్టు ప్రభుత్వం ప్రపంచంలో కాంగ్రెస్ ఒకటే ఉంటుంది. పాలమూరు ప్రాజెక్టును పండబెట్టి రైతులను తొక్కుతున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి . కేవలం తన పాత బాస్ కి కోపం వస్తుందని ఏకైక ఉద్దేశంతోనే రేవంత్ రెడ్డి నాలమూరును పట్టించుకోవడం లేదు. తెలంగాణలోని ఏ ప్రాంతం ఏ బేసిన్ లో ఉందో తెలవని ముఖ్యమంత్రి తోని మాకు నీటి పాఠాలు అవసరం లేదు. రేవంత్ రెడ్డికి బాక్రానంగల్ ఎక్కడుందో కూడా తెలియని అజ్ఞాని. నదుల గురించి నీళ్ల గురించి ప్రాజెక్టుల గురించి కనీస అవగాహన లేని రేవంత్ రెడ్డి కేసీఆర్ కి నీటి పాఠాలు చెప్తా అంటున్నాడు. కాంగ్రెస్ పార్టీ అరాచకాల నుంచి తెలంగాణను కాపాడుకోవాలి అంటే కేసీఆర్ ముఖ్యమంత్రి కావాలి. ఇందుకోసం పార్టీ శ్రేణులంతా కలిసికట్టుగా పనిచేయాలని అన్నారు.

## కాకగూడలో భూగర్భ డ్రైనేజీ పనుల ప్రారంభోత్సవం

## పాల్గొన్న కంటోన్మెంట్ బోర్డు సభ్యురాలు బానుక నర్మద

**సికింద్రాబాద్: పెన్ పవర్:** గురువారం నాడు సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు నిధులు రూ. 5 లక్షల వ్యయంతో 5వ వార్డు, బ్రుక్ బాండ్ కాలనీ, కాకగూడలో చేపట్టిన భూగర్భ డ్రైనేజీ పనుల ప్రారంభోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న నామినేటెడ్ సభ్యురాలు బానుక నర్మద మల్లిఖార్జున్ మాట్లాడుతూ, తాను ప్రతినిత్యం స్థానిక బిజెపి నాయకులు కార్యకర్తలు కలుపుకుని ప్రజల మధ్య ఉంటూ వారి సమస్యలను తెలుసుకొని సంబంధిత అధికారులను అప్రమత్తం చేస్తూ పరిష్కార దిశగా ముందుకు సాగుతున్నానని తెలిపారు. అలాగే స్థానిక పార్లమెంట్ సభ్యులు ఈటెల రాజేందర్ సహకారంతో అవసరమైన చోట్ల ఎంపీ నిధులు కేటాయించే విధంగా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.
భవిష్యత్తులో కంటోన్మెంట్ పరిధిలోని ప్రతి వార్డులో మౌలిక సదుపాయాలు మరియు అభివృద్ధి పనులను దశలవారీగా అమలు చేస్తామని ఆమె భరోసా ఇచ్చారు.
ఈ కార్యక్రమంలో కాలనీ ప్రెసిడెంట్ సీపీఎస్. ప్రకాష్, వైస్ ప్రెసిడెంట్ పి. ప్రభాకర్ రావు, సెక్రటరీ కె. శశిధర్, ట్రెజరర్ ఎం. రమేష్, సభ్యులు మహేష్ కుమార్, యమునా చారి, వి.ఎస్. సంతోష్, చింతన్ సోలంకి, ఐ. కిషన్ చంద్ తదితరులు పాల్గొన్నారు.

# 20న మున్సిపల్ ఎన్నికల నోటిఫికేషన్

**హైదరాబాద్, జనవరి 8, పెన్ పవర్:**
తెలంగాణ రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికలకు కౌంట్డౌన్ మొదలైంది. గతేడాది డిసెంబర్లో గ్రామ పంచాయతీ ఎన్నికలను విజయవంతంగా పూర్తి చేసిన రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ).. ఇప్పుడు పట్టణ పోరుపై దృష్టి సారించింది. జనవరి 20వ తేదీ నాటికి రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడే అవకాశం ఉండటంతో.. దానికి సంబంధించి ఎన్నికల సంఘం కమిషనర్ రాణికుముదిని అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించేందుకు ఎన్నికల సంఘం షెడ్యూల్ను ఖరారు చేసింది. క్లెయిమ్స్, అభ్యంతరాల స్వీకరణకు చివరి తేదీ జనవరి 12 అని తెలిపారు. అదే రోజున ఓటర్ల తుది జాబితాను ప్రచురించాలని మొదట ఆదేశించారు. టీ పోల్ యాప్లో, ఎన్నికల సంఘం వెబ్సైట్లో పోలింగ్ స్టేషన్ల ముసాయిదా జాబితాను జనవరి 13వ తేదీన అప్లోడ్ చేయాలి. జనవరి 16వ తేదీన ఫోటోలతో కూడిన ఓటర్ల తుది జాబితా ప్రచురించనున్నారు. వార్డుల వారీగా పోలింగ్ కేంద్రాల వివరాలను కూడా ఆరోజే వెల్లడిస్తారు. ఇక జనవరి 20వ తేదీన మున్సిపల్ ఎన్నికల నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశం ఉంది. 2019 నాటి ఓటర్ల జాబితాను ప్రాతిపదికగా తీసుకుని.. బీఎల్వోల ద్వారా క్షేత్రస్థాయిలో వివరాల పరిశీలన జరుగుతోంది. ఎన్నికలకు అవసరమైన బ్యాలెట్ బాక్సులు, ఇతర సామగ్రిని సిద్ధం చేయాలని కలెక్టర్లను ఈసీ ఆదేశించింది. ఎన్నికల నియమావళిని కఠినంగా అమలు చేయడానికి ఫ్లయింగ్ స్క్వాడ్స్, స్టాటిక్ సర్వైలెన్స్ టీమ్స్ ఏర్పాటుకు ఆదేశాలు జారీ అయ్యాయి. గురువారం రాష్ట్ర స్థాయి రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎన్నికల సంఘం కీలక సమావేశం నిర్వహించి, వారి సూచనలను తీసుకోనుంది. తుది ఓటర్ల జాబితాను ఆయా వార్డు పరిధిలోని అన్ని పోలింగ్ స్టేషన్లలో అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. దీనివల్ల ఓటర్లకు తమ పోలింగ్ కేంద్రం, బూత్ వివరాలు తెలుస్తాయని ఈసీ వెల్లడించింది. మున్సిపల్ ఎన్నికలు నిర్వహించేందుకు అవసరమైన మౌలిక సౌకర్యాలపైనా కలెక్టర్లకు ఈసీ దిశానిర్దేశం చేసింది. బ్యాలెట్ బాక్సులు, ఎన్నికల సిబ్బంది నియామకం, రిటర్నింగ్ ఆఫీసర్లు, అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్లు, ఫ్లయింగ్ స్క్వాడ్స్, సిట్టింగ్ స్క్వాడ్స్ను నియమించి.. ఎన్నికల ప్రక్రియను పర్యవేక్షించాలని ఎన్నికల కమిషన్ సూచించింది.

**గెలుపు గుర్రాలపై గురి**

మున్సిపల్ ఎన్నికలపై అధికార పార్టీ ప్రత్యేక గురి పెట్టింది. పంచాయతీ ఎన్నికలలో వచ్చిన ఫలితాలను మున్సిపల్ ఎన్నికల్లో పునరావృతం కాకుండా అధికార పార్టీ ఆచితూచి అడుగులు వేస్తుంది. మున్సిపాలిటీ ఎన్నికల్లో అన్ని స్థానాల ' పైచేయి' సాధించేలా క్షేత్రస్థాయి కసరత్తులు ముమ్మరం చేసింది. ఇప్పటికే పార్టీ ఆదేశాల మేరకు ప్రత్యేకంగా మున్సిపాలిటీ వారిగా సర్వే చేయించి పార్టీ బలాలు, బలహీనతలు పై దృష్టి సారించింది. సీఎం రేవంత్ రెడ్డి రెండు రోజుల క్రితం పీసీసీ చీఫ్ తో ప్రత్యేక సమావేశం నిర్వహించి...జిల్లా ఇన్చార్జి మంత్రులతో పాటు నియోజకవర్గ




ఎమ్మెల్యేలు పార్టీ ఇంచార్జిల కు ప్రత్యేక ఆదేశాలు జారీ చేశారు. జిల్లా లో ఉన్న మున్సిపాలిటీలో అన్ని స్థానాలు కాంగ్రెస్ కైవసం చేసుకునేలా ఎత్తుగడలు వేయాలని ఎక్కడ కూడా ప్రతిపక్ష పార్టీకి అవకాశం ఇవ్వొద్దు అంటూ అంతర్గతంగా నేతలకు దిశా నిర్దేశం చేశారు. మున్సిపాలిటీ ఎన్నికల పై ప్రధాన రాజకీయ పార్టీలు సైతం కసరత్తు ముమ్మరం చేశాయి. మున్సిపల్ పీఠాలను కైవసం చేసుకోవడమే లక్ష్యంగా పావులు కదుపుతున్నాయి. అసంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో చతికిలపడినప్పటికీ స్థానిక పోరు బరిలో బీఆర్ఎస్, బీజేపీ లు అనూహ్యంగా పుంజుకోవడం తో ఆ పార్టీ శ్రేణుల్లో కొంత ఆత్మస్థైర్యం నింపినట్ల య్యింది. దీంతో అధికార, ప్రతిపక్ష పార్టీలు బిఆర్ఎస్, బిజెపి పార్టీ లు సైతం ఎన్నికల కు సై అంటుంది. దీంతో ఆయా పార్టీ లు గెలుపు కోసం వ్యూహరచన చేస్తున్నాయి. రంగారెడ్డి జిల్లాలో 15 మున్సిపాలిటీలు మూడు కార్పొరేషన్లు ఉండగా అందులో ఎనిమిది మున్సిపాలిటీలు మూడు కార్పొరేషన్లను ఇటీవల ప్రభుత్వం జిహెచ్ఎంసిలో విలీనం చేసింది. ప్రస్తుతం ఆమనగల్, షాద్నగర్, ఇబ్రహీంపట్నం, చేవెళ్ల, మొయినాబాద్, శంకర్పల్లి మున్సిపాలిటీ ఎన్నికలకు అధికారులు సన్నాహాలు చేస్తుండగా కొత్తూరు మున్సిపాలిటీ కి పాలకవర్గం గడువు తీరకపోవడం తో అక్కడ ఎన్నికలు మరింత సమయం పడుతుంది. మిగతా ఆరు మున్సిపల్ ఎన్నికలకు చురుగ్గా ఏర్పాట్లు జరుగుతున్నాయి. గత మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అత్యధిక స్థానాల ను గెలుచుకొంది. రాష్టంలో అధికారం కోల్పోయి మారిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో మళ్ళీ పురఎన్నికలో పట్టు నిలుపుకునేలా ఎత్తుగడలు వేస్తుంది. నియోజకవర్గాలో సన్నాహక సమావేశాలు నిర్వహించి పార్టీ నేతల్లో ఉత్సాహం నింపుతుంది. మున్సిపాలిటీ,వార్డుల వారిగా బస్తి బాట పేరుతో ప్రచారానికి సైతం దిగింది. వార్డుల వారిగా రిజర్వేషన్ల ప్రకారం అభ్యర్థులను గెలుపు గుర్రాలను అధికారపాటికి దీటుగా నిలబెట్టేలా వ్యూహాలు సిద్ధం చేసే పనులు పార్టీ నేతలు నిమగ్నంగా అయ్యారు. పురపాలికల్లో అత్యధిక స్థానాలను కైవసం చేసుకునేలా వ్యూహాలకు పదును పెడుతోంది. ఈ మేరకు ఇప్పటికే రంగారెడ్డి జిల్లా లో ఆరు మున్సిపల్ పరిధిలో ఆయా పార్టీ అధ్యక్షులు ఇప్పటికే సన్నాహక సమావేశం నిర్వహించారు. ఆయా డివిజన్ల వారీగా పార్టీ పరిస్థితి, గెలుపు గుర్రాలపై కీలక నేతలతో చర్చించారు. గెలవడానికి ఉన్న ప్రతి అవకాశాన్ని వినియోగించుకోవాలని.. పార్టీ అభ్యున్నతే లక్ష్యంగా ఎన్నికలకు సిద్ధం కావాలని సూచించారు. అధికార కాంగ్రెస్, విపక్ష బీఆర్ఎస్ కు దీటుగా అభ్యర్థులను రంగంలోకి దించేలా క్షేత్రస్థాయిలో గెలుపు గుర్రాలను జల్లెడ పట్టే బాధ్యతలను పలువురికి అప్పగించినట్లు సమాచారం. స్థానిక పోరు లో విజయం సాధించినా కానీ కాంగ్రెస్ లో కొంత అసంతృప్తి నెలకొంది. మెజార్టీ స్థానాలు సాధించలేకపోయామని నేతలు బహిరంగంగానే తమ లోపాలను బయట పెట్టుకున్నారు. సమన్వయంతో పార్టీలో ముందుకు వెళ్ళలేదని పంచాయతీలో వచ్చిన ఫలితాలను చూసి తమ తప్పులను ఒప్పుకుంటున్నారు. పంచాయతీ లో బీఆర్ఎస్ పుంజు కోవడం తో కాంగ్రెస్ నేతలను కొంత ఇరకాటంలో పడేసినట్లయ్యింది. స్థానిక పోరు లో బీఆర్ఎస్, బీజేపీ మద్దతుదారులు గెలవడా నికి ప్రధాన కారణం స్వపక్షంలోని రెబల్స్ అభ్యర్థులేనని కాంగ్రెస్ పార్టీ అధిష్టానం గుర్తించింది. సీఎం సైతం జిల్లా, నియోజకవర్గా ల వారిగా ఫలితాలను చూసి కొంత అసంతృప్తి వెళ్ళగక్కారు. నియోజకవర్గం ఫలితాలను చూసి అందుకు బాధ్యులపై చీవాట్లు పెట్టారు. ఈ నేపథ్యంలో పురపాలక పోరులో రెబల్స్ ప్రభావం లేకుండా ఆ పార్టీ ముఖ్య నేతలు ఆచితూచి వ్యవహరిస్తు న్నారు. ఇందులో భాగంగా ఆయా డివిజన్లు / వార్డుల వారీగా ఆశా వహులు,కౌన్సిలర్ అభ్య ర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరి స్తోంది. ప్రస్తుతం వ్యక్తిగత సమాచారం తో పాటు ఆయా వార్డుల్లో బలా బలాలు, సామాజిక వర్గాల వారిగా ఆర్థిక స్థితిగతులకు అనుగుణంగా అభ్యర్థులను ఖరారు ఖరారు చేసే పనులు ప్రస్తుతం నేతలు నిమగ్నం అయ్యా

# కేటీఆర్ టూర్ లో జగన్ జెండాలు

**ఖమ్మం, జనవరి 8, పెన్ పవర్:**
రాజకీయాలలో ఇలా ఉండాలని ఉండదు. ఇలా ఉంటేనే బాగుంటుందని కూడా ఉండదు. రాజకీయాలలో ఎలాగైనా జరుగుతుంది. ఏదైనా జరుగుతుంది. దానికి ఏ పార్టీ కూడా మినహాయింపు కాదు. కొన్ని సందర్భాలలో బద్ద శత్రువులుగా ఉన్న కాంగ్రెస్, బిజెపి కలిసిపోతాయి. రాజకీయ లక్ష్యాల కోసం కలిసి పోటీ చేస్తాయి. ఇంతవరకు జాతీయస్థాయి రాజకీయ మొక్క చిత్రంలో ఇటువంటి సన్నివేశం చూడకపోయినప్పటికీ.. రాష్ట్ర స్థాయిలలో మాత్రం కాంగ్రెస్, బిజెపి ఒక ఒర లో ఇమిడిపోయిన దృశ్యాలు చాలానే కనిపించాయి. తెలంగాణలో ఇప్పుడు విభిన్నమైన రాజకీయ దృశ్యం కనిపిస్తోంది. బహుశా దీనిని చాలామంది ఊహించి ఉండరు. 2014లో, 2018 లో భారత రాష్ట్ర సమితి తెలంగాణ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చింది. 2018లో అధికారంలోకి వచ్చిన తర్వాత సహజంగానే భారత రాష్ట్ర సమితి అధినేత కేసిఆర్ ఏపీ రాజకీయాలలో వేలు పెట్టడం మొదలుపెట్టారు. అంతకుముందు చంద్రబాబు ప్రస్తావన తీసుకొచ్చి రిటర్న్ గిఫ్ట్ లో భాగంగా కేసీఆర్ ఈ దిశగా అడుగులు వేశారు. 2019లో ఏపీలో జగన్ ప్రభుత్వం అధికారంలోకి రావడంలో విజయవంతం అయ్యారు.. చాలా సందర్భాలలో అలైబలై అన్నట్టుగా వ్యవహరించారు. మధ్య మధ్యలో ప్రగతి భవన్ కు పిలిపించడం.. తెలంగాణ సత్కారాలు అందించడం వంటివి జరిగిపోయాయి. 2023 ఎన్నికల్లో మాత్రం సెంటిమెంట్ రగిలించే క్రమంలో నాగార్జునసాగర్ ప్రాజెక్టు మీదికి ఏపీ పోలీసులు వచ్చారు. అప్పట్లో ఈ సన్నివేశం కాస్త ఉద్విగ్నంగా మారినప్పటికీ.. గులాబీ పార్టీకి మాత్రం ఓట్లు తెప్పించే మంత్రంగా పనిచేయలేదు. ఇప్పుడిక అటు తెలంగాణలో.. ఇటు ఆంధ్రప్రదేశ్లో కెసిఆర్, జగన్ అధికారాన్ని కోల్పోయారు. అధికారాన్ని దక్కించుకోవడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ ప్రయత్నాలు ఎంతవరకు సఫలికృతం అవుతాయి తెలియదు కానీ.. తెలంగాణ రాష్ట్రంలో గులాబీ పార్టీకి వైసిపి



బహిరంగంగా సపోర్ట్ తెలియజేస్తోంది. బుధవారం ఖమ్మంలో కేటీఆర్ పర్యటించినప్పుడు.. కూసుమంచి వద్ద స్వాగతం పలికే క్రమంలో గులాబీ పార్టీ జెండాలతో పాటు, వైసిపి జెండాలు కూడా కనిపించాయి. కొంతమంది జగన్, కేటీఆర్ ను కలిపి ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. తెలంగాణ వాదంతో, తెలంగాణ సెంటిమెంట్తో అధికారంలోకి వచ్చిన భారత రాష్ట్ర సమితి.. తెలుగుదేశం పార్టీని, వైసీపీని, జనసేన ను ఆంధ్ర బూచిలుగా చూపించే ప్రయత్నం చేసింది. చివరికి ఆ పార్టీలపై తీవ్రస్థాయిలో విమర్శలు చేస్తూ 2018లో అధికారంలోకి వచ్చింది. ఇక ఉద్యమ సమయంలో అయితే జగన్ మీద కేసీఆర్, కేటీఆర్ ఏ స్థాయిలో విమర్శలు చేశారో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. మానుకోటలో జగన్ పర్యటన సందర్భంగా రాళ్లు రువ్విన సంఘటన కూడా విధితమే. ఇన్ని జరిగిన తర్వాత కేవలం రాజకీయ ఆకాంక్షలతోనే గులాబీ పార్టీ అడుగులు వేయడం..
తన ఉద్యమస్మృతిని మర్చిపోవడం బాధాకరం. తన పర్యటనలో వైసీపీ జెండాలు కనిపించడం ద్వారా తెలంగాణ సమాజానికి కేటీఆర్ ఏం సమాధానం చెబుతారు? ఎలాంటి సంజాయిషీ ఇస్తారు? ఈ ప్రశ్నలకు కాలమే సమాధానం చెప్పాలి. ఇటీవల బెంగళూరు నగరంలో జరిగిన ఓ ప్రైవేట్ కార్యక్రమంలో జగన్, కేటీఆర్ పాల్గొన్నారు. వారిద్దరూ పక్కపక్కన కూర్చున్నారు.. ఈ కలయికను గులాబీ పార్టీ గొప్పగా చెప్పుకుంది. వైసిపి గట్టిగా ప్రచారం చేసుకుంది. దీనిని బట్టి అంతర్గతంగా ఏం జరుగుతుందో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదని తెలంగాణ వాదులు అంటున్నారు.


# వద్దు వద్దు చైనీస్ మాంజా...!

**ప్రాణాంతక చైనీస్ మాంజాను బహిష్కరించండి..!!!**

**చైనీస్ మాంజాపై హైదరాబాద్ పోలీసుల కొరడా**

**- రూ. 1.24 కోట్ల విలువైన నిషేధిత మాంజా స్వాధీనం**

**హైదరాబాద్ పెన్ పవర్:** సంక్రాంతి పండుగ వేళ పర్యావరణానికి, పక్షులకు హాని కలిగించే నిషేధిత చైనీస్ మాంజా (నైలాన్/సింథటిక్ దారం) విక్రయాలను అరికట్టేందుకు హైదరాబాద్ నగర పోలీసులు విస్తృత చర్యలు చేపట్టారు. నగర కమిషనరేట్ పరిధిలో నిర్వహించిన స్పెషల్ డ్రైవ్లో పెద్ద ఎత్తున నిషేధిత మాంజాను స్వాధీనం చేసుకున్నారు. చైనా మాంజాపై ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్ లో హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ శ్రీ వీసీ సజ్జనర్, ఐపీఎస్ మాట్లాడుతూ.. "సంక్రాంతి అంటేనే పతంగుల పండుగ, ఆనందాల హేళ. అయితే, మన సంతోషం మరొకరి ప్రాణానికి ముప్పుగా



పరిణమించకూడదు. పర్యావరణానికి, మనుషుల ప్రాణాలకు హాని కలిగించే 'చైనీస్ మాంజా'పై ప్రభుత్వం సంపూర్ణ నిషేధం విధించింది. నిషేధాజ్ఞలు ఉన్నప్పటికీ కొందరు గుట్టుచప్పుడు కాకుండా వీటిని విక్రయిస్తున్నా రు. నగరంలో ఎవరైనా చైనా మాంజాను విక్రయించినా, గోదాముల్లో నిల్వ చేసినా, అక్రమ రవాణాకు పాల్పడినా ఉపేక్షించే ప్రసక్తే లేదు. నిబంధనలు అతిక్రమిస్తే తక్షణమే క్రిమినల్ కేసులు నమోదు చేసి అరెస్ట్ చేస్తాం," అని హెచ్చరించారు. దుకాణాల్లో తనిఖీలు ముమ్మరం చేయడంతో వ్యాపారులు ఆన్లైన్ బాట పట్టినట్లు తమ దృష్టికి వచ్చిందని, ఈ-కామర్స్ వెబ్సైట్లు, సోషల్ మీడియా వేదికగా సాగే క్రయవిక్రయాలపై 24 గంటల పాటు ప్రత్యేక నిఘా ఉంచామని తెలిపారు. ఆన్లైన్లో మాంజా కొనుగోలు చేసినా, విక్రయించినా కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ప్లాస్టిక్, గాజు పెంకులు, మెటాలిక్ కోటింగ్ ఉండే ఈ మాంజా వల్ల పిల్లలకు విద్యుత్ షాక్ కొట్టే ప్రమాదం ఉందని, తల్లిదండ్రులు బాధ్యతగా వ్యవహరించి సంప్రదాయ నూలు దారాలనే ప్రోత్సహించాలని కోరారు. ఎవరైనా మాంజా విక్రయిస్తే 'డయల్ 100' లేదా వాట్సాప్ నెంబర్ 94906 16555 కి సమాచారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

# గులాబీకి వరుస చిక్కుముళ్లు



**హైదరాబాద్, జనవరి 8, పెన్ పవర్:** రాజకీయాలలో ముఖ్యంగా కుటుంబాలు నడిపే పార్టీలలో అంతర్గతంగా కుమ్ములాటలు చోటు చేసుకోవడం మనదేశంలో కొత్తేమీ కాదు. గతంలో కాంగ్రెస్ పార్టీ లో సంజయ్ గాంధీ వ్యవహార శైలి ఈ దేశ ప్రజలకు సుపరిచితమే. తమిళనాడులో డీఎంకే, ఉత్తర్ ప్రదేశ్ లో సమాజ్ వాదీ పార్టీ, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో తెలుగుదేశం పార్టీ.. ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో ఉదాహరణలు.. అంతిమంగా అధికారం కోసం, అలవిమాలిన సంపాదన కోసం జరిగే పోరాటాలు ప్రాంతీయ కుటుంబ పార్టీల అసలు బాగోతాన్ని బయటపెడతాయి. ఇప్పుడు ఈ జాబితాలోకి భారత రాష్ట్ర సమితి కూడా చేరింది.2014లో అధికారంలోకి వచ్చిన భారత రాష్ట్ర సమితి.. తెలంగాణలో వ్యవస్థలను ఎంత నాశనం చేయాలో అంత చేసింది. ప్రత్యర్థి పార్టీల ఎమ్మెల్యేలను అడ్డగోలుగా కొనేసింది. ప్రతిపక్షం అనేది లేకుండా చూసుకుంది. కాళేశ్వరం నుంచి మొదలు పెడితే గొర్రెల పంపిణీ వరకు ఇలా ప్రతి పథకంలోనూ అవినీతి జరిగిందని, అక్రమాలు చోటు చేసుకున్నాయని ఆరోపణలు వినిపించాయి. వాస్తవానికి ఇటువంటి కుంభకోణాలు పార్టీకి డ్యామేజ్ చేయడం ఒక ఎత్తు అయితే.. పార్టీలో అంతర్గత కుమ్ములాటలు కలిగించే డ్యామేజ్ మరొక ఎత్తు.వాస్తవానికి గులాబీ పార్టీలో ఈ స్థాయిలో అంతర్గతంగా కుమ్ములాటలు జరుగుతాయని ఎవరూ ఊహించలేదు. సాక్షాత్తు కెసిఆర్ కుమార్తె వ్యతిరేక స్వరాన్ని వినిపిస్తారని.. తన తండ్రి పరిపాలనను ఉదాహరణలతో వివరిస్తూ విమర్శిస్తారని ఎవరూ అంచనా వేయలేదు. కాళేశ్వరం ప్రయోజనం నెరవేరలేదని, పాలమూరు రంగారెడ్డి పథకాన్ని పండబెట్టారని, సామాజిక తెలంగాణ సహకారం కాలేదని ఇలా ప్రతి విషయంలోనూ కవిత విమర్శలు చేసుకుంటూ పోయారు. కొన్ని సందర్భాలలో లెక్కలతో సహా వివరించారు. ఒక రకంగా ఈ పనిని కాంగ్రెస్ చేయాల్సి ఉండేది. ఒక రకంగా బలమైన స్వరాన్ని వినిపించే ప్రయత్నం చేశారు కవిత.కవిత చేస్తున్న ఆరోపణల్లో నిజం లేకపోలేదు. కానీ 10 సంవత్సరాల కాలంలో అధికారంలో ఉన్నప్పుడు ఆమె ఏం చేశారు అనేది ఇక్కడ అసలైన ప్రశ్న. భారత రాష్ట్ర సమితి ఏర్పాటును వ్యతిరేకించానని చెప్పిన ఆమె.. పార్టీ ప్రారంభత్సవానికి ఢిల్లీ ఎందుకు వెళ్లినట్టు? 10 సంవత్సరాల కాలంలో తెలంగాణలో విధ్వంసం జరిగిందని చెబుతున్న ఆమె.. గతంలో బంగారు తెలంగాణ సాకారం అయిందని ఎందుకు చెబుతున్నట్టు.. లిక్కర్ కేసులో అడ్డంగా ఇరుక్కుపోయారు కాబట్టి.. కేసుల నుంచి తప్పించుకోవాలంటే ఆమె కెసిఆర్ కు వ్యతిరేకంగా వ్యవహరించాలి కాబట్టి.. అలానే చేస్తున్నారని గులాబీ పార్టీ నాయకులు ఆరోపిస్తున్నారు. కాంగ్రెస్, బిజెపి రాజకీయాల లక్ష్యాలకు అనుగుణంగా ఆమె నడుచుకుంటున్నారని గులాబీ నేతలు మండిపడుతున్నారు.వాస్తవానికి తన పార్టీలో ఉన్నప్పుడు ప్రాధాన్యం దక్కలేదని పదేపదే ఆరోపిస్తున్న కవిత.. ఒకసారి ఎంపీ ఎలా అయ్యారు? మరోసారి ఎమ్మెల్సీ ఎలా అయ్యారు? సింగరేణిలో అధ్యక్షురాలిగా ఎలా ఉన్నారు? ఇలా చెప్పుకుంటూ పోతే చాలానే ఉన్నాయని గులాబి పార్టీ నేతలు అంటున్నారు. అధికారం దూరంగానే కెసిఆర్ కు వ్యతిరేకంగా మాట్లాడటం సమంజసం కాదని ఆమెకు గుర్తుచేస్తున్నారు. మరోవైపు జాగృతి నేతలు స్పందిస్తున్న తీరు వేరే విధంగా ఉంది. కేటీఆర్ కూడా ఆమెకు ద్రోహం చేశారని.. కనీసం ఒక పని కూడా చేసుకునే అవకాశం కల్పించలేదని.. ఆమె భర్త ఫోన్ కూడా టాప్ చేశారని.. అలాంటప్పుడు ఆమె పార్టీలో ఎలా ఉంటారంటూ జాగృతి నేతలు చెబుతున్నారు. గడిచిన 10 సంవత్సరాల కాలంలో చేపట్టిన సాగునీటి ప్రాజెక్టుల పనుల్లో హరీష్ రావు అడ్డగోలుగా దోపిడీకి పాల్పడ్డారని.. అందువల్లే కవిత ఆయన టార్గెట్ చేస్తూ ఆరోపణలు చేస్తున్నారని జాగృతి నేతలు చెబుతున్నారు.. కవిత రాజకీయ ఎదుగుదలను తట్టుకోలేక ఆమెకు అడుగడుగునా అడ్డు పుల్లలు వేస్తున్నారని.. అందువల్లే కవిత ఈ స్థాయిలో స్పందిస్తున్నారని జాగృతి నేతలు అంటున్నారు.కవితకు, కెసిఆర్ కు మధ్యలో గ్యాప్ రావడానికి ప్రధాన కారణం హరీష్, సంతోష్ రావు అని జాగృతి నేతలు చెబుతున్నారు. అందువల్లే ఆమె ఆధారాలతో సహా విమర్శలు చేస్తున్నారని.. ఇందులో వ్యక్తిగత లక్ష్యాలు అంటూ ఏమీ లేవని జాగృతి నేతలు చెబుతున్నారు. ఏది ఏమైనప్పటికీ అంతపురంలో జరిగే కుమ్ములాటలు రాజ్యానికి అసలు మంచివి కావు. ఇప్పుడు భారత రాష్ట్ర సమితిలో చోటు చేసుకుంటున్న పరిణామాలు కూడా ఆ పార్టీకి ఏమాత్రం శ్రేయస్కరం కాదు. ఇప్పటికే పార్లమెంటు ఎన్నికల్లో 0 ఫలితాలు వచ్చాయి. కంటోన్మెంట్, జూబ్లీహిల్స్ నియోజకవర్గాలలో అధికార పార్టీకి సానుకూలమైన ఫలితాలు వచ్చాయి. స్థానిక ఎన్నికల్లో చెప్పుకోదగ్గ స్థానాలు కూడా గులాబీ పార్టీకి రాలేదు. అలాంటప్పుడు ఈ అంతర్గత కుమ్ములాటను ఏ స్థాయిలో కేసీఆర్ పరిష్కరిస్తారో చూడాల్సి ఉంది.

# టాప్ గేర్ లో రియల్ ఎస్టేట్



**హైదరాబాద్, జనవరి 8, పెన్ పవర్:** దేశంలోని 8 ప్రధాన నగరాల్లో చూస్తే హౌసింగ్ సేల్స్ (ఇళ్లు లేదా ఫ్లాట్ల విక్రయాలు) గతేడాది 3.48 లక్షల యూనిట్లుగా ఉన్నాయి. ఇది అంతకుముందు సంవత్సరంతో పోలిస్తే స్వల్పంగా ఒక శాతం తగ్గిందని చెప్పొచ్చు. అయితే ఇదే సమయంలో ఈ ప్రధాన నగరాల్లో ఇళ్ల ధరలు సగటున 19 శాతం వరకు పెరిగినట్లు పేర్కొంది. బుధవారం రోజు వర్చువల్ ప్రెస్ కాన్ఫరెన్స్ నిర్వహించిన ప్రముఖ రియల్ ఎస్టేట్ కన్సల్టెంట్ నైట్‌ఫ్రాంక్ ఇండియా ఈ డేటా విడుదల చేసింది. ఇక్కడ ప్రధానంగా హోం లోన్ వడ్డీ రేట్లు తగ్గడం సహా ఆర్థిక వ్యవస్థ బలంగా ఉండటం, ద్రవ్యోల్బణం తగ్గుతుండటం వంటివి హౌసింగ్ డిమాండ్‌ను స్థిరంగా ఉంచేందుకు దోహదం చేసినట్లు తెలిపింది. ఈ 8 ప్రధాన నగరాలు చూస్తే ఢిల్లీ- చీజ=, ముంబై, బెంగళూరు, పుణె, హైదరాబాద్, అహ్మదాబాద్, చెన్నై, కోల్‌కతా ఉన్నాయి.ఇక్కడ ప్రధాన నగరాల్లో హైదరాబాద్‌లోనే సేల్స్ కాస్త ఎక్కువగా పెరిగాయి. ఇక్కడ 2025 సంవత్సరంలో మొత్తం ఇళ్ల విక్రయాలు 4 శాతం పెరిగి 38,403 యూనిట్లకు చేరుకున్నాయి. ఇదే సమయంలో ఇళ్లు లేదా ఫ్లాట్స్ ధరలు కూడా 13 శాతం వరకు పెరిగి చదరపు అడుగుకు సగటు ధర రూ. 6,721 గా ఉంది. రెండో అర్ధభాగంలో అంటే జులై- డిసెంబర్ సమయంలో హౌసింగ్ సేల్స్ హైదరాబాద్ నగరంలో 19,355 గా ఉండగా.. ఇది అంతకుముందు సంవత్సరం ఇదే సమయంతో పోలిస్తే 5 శాతం ఎక్కువ.కొత్త ఇళ్ల సప్లై విషయానికి వస్తే 2025లో హైదరాబాద్‌లో ఇది 40,737 యూనిట్లుగా ఉండగా.. అంతకుముందు ఏడాదితో పోలిస్తే ఇది 7 శాతం తగ్గింది. ఇక 2025లో అన్‌సోల్డ్ ఇన్వెంటరీ అంటే అమ్ముడుపోని ఇళ్లు లేదా ఫ్లాట్ల సంఖ్య హైదరాబాద్‌లోనే 54,878 యూనిట్లుగా ఉండటం గమనార్హం. అంటే ఇక్కడ డిమాండ్‌కు మించి కొత్త ఇళ్ల సప్లై ఉండటమే ప్రధాన కారణంగా తెలుస్తోంది. హైదరాబాద్‌లో ప్రధానంగా మౌలిక వసతుల కల్పన, ఉద్యోగాల సృష్టిలో దూసుకెళ్తుండటం వల్ల రియల్ ఎస్టేట్ కూడా వృద్ధి చెందుతున్నట్లు నైట్ ఫ్రాంక్ ఇండియా రిపోర్ట్ తెలిపింది.ముంబైలో హౌసింగ్ సేల్స్ ఒక శాతం పెరిగి 97,188 యూనిట్లుగా ఉంది. ఇక్కడ సగటున ఇళ్ల ధరలు 7 శాతం పెరిగి చదరపు అడుగుకు రూ. 8,856 గా ఉంది. బెంగళూరులో ఇళ్ల విక్రయాలు స్థిరంగా 55,373 యూనిట్లుగా ఉంది. ఇళ్ల ధరలు సగటున 12 శాతం వరకు పెరిగి చ.అడుగుకు రూ. 7,388 గా ఉంది. పుణె, ఢిల్లీ- చీజ=, కోల్‌కతాలోనూ ఇళ్ల అమ్మకాలు కాస్త తగ్గుముఖం పట్టాయి.

# ఉర్దూ వర్సిటీ విస్తరణకు సిద్ధం

**హైదరాబాద్, జనవరి 8, పెన్ పవర్:** గచ్చిబౌలిలోని మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయం విస్తరణకు రంగారెడ్డి జిల్లా కలెక్టర్ జారీ చేసిన షోకాజ్ నోటీసుపై స్పందించింది. మణికొండ జాగీర్‌లోని 50 ఎకరాల భూమిలో భవిష్యత్ అవసరాల కోసం అకడమిక్ భవనాలు, హాస్టళ్లు నిర్మించనున్నట్లు విశ్వవిద్యాలయం తెలిపింది. ఈ పనులకు సంబంధించిన సమగ్ర నివేదిక సిద్ధమవుతోందని, నిధుల మంజూరుకు ప్రతిపాదనలు పంపుతామని.. అందుకు రెండు నెలల సమయం గడువు ఇవ్వాలని సమాధానం ఇచ్చింది.గచ్చిబౌలిలోని మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ యూనివర్సిటీ విస్తరణపై ముందడుగు పడింది. వర్సిటీ క్యాంపస్ విస్తరణ, భవిష్యత్ అవసరాలపై యాజమాన్యం దృష్టి సారించింది. వర్సిటీకి కేటాయించిన భూములపై రంగారెడ్డి జిల్లా కలెక్టర్ జారీ చేసిన షోకాజ్ నోటీసుకు వర్సిటీ సానుకూలంగా స్పందించింది. వర్సిటీకి కేటాయించిన భూముల్లో... మణికొండ జాగీర్ పరిధిలోని 50 ఎకరాల భూమిని ఎందుకు వెనక్కి తీసుకోకూడదో తెలపాలంటూ... రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కొన్ని రోజుల క్రితం షోకాజ్ నోటీసులు జారీ చేశారు.దీనిపై వర్సిటీ తాజాగా స్పందిస్తూ... ఆ స్థలంలో చేపట్టబోయే అభివృద్ధి పనులకు సంబంధించిన వివరాలను వెల్లడించింది. పూర్తి స్థాయి నివేదికను సమర్పించేందుకు రెండు నెలల గడువు ఇవ్వాలని వర్సిటీ రిజిస్ట్రార్ రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌ను కోరారు.

ఈ షోకాజ్ నోటీసులపై 'మనూ' రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎస్కే ఇంతియాజ్ అహ్మద్ స్పందిస్తూ... జనవరి 1న లేఖ రాశారు. వర్సిటీ విస్తరణ కోసం కేటాయించిన ఆ 50 ఎకరాల భూమి ఖాళీగా లేదని... దాన్ని భవిష్యత్ విస్తరణ కోసం రిజర్వ్ చేసినట్లు తెలిపారు. ఈ స్థలంలో వర్సిటీకి అవసరమైన కొత్త అకడమిక్ భవనాలు, విద్యార్థుల కోసం హాస్టళ్లు, సిబ్బంది నివాస సముదాయాల నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయని తెలిపారు.ఈ స్థలంలో చేపట్టబోయే ప్రాజెక్టులకు సంబంధించి సీపీడబ్ల్యూడీ హైదరాబాద్ విభాగం 'సమగ్ర ప్రాజెక్టు నివేదిక'ను సిద్ధం చేస్తోందని వివరించారు. ఆ నివేదిక రాగానే నిధుల మంజూరు కోసం కేంద్ర విద్యాశాఖ, హెఫా కు ప్రతిపాదనలు పంపుతామని లేఖలో పేర్కొన్నారు. అందుకే రెండు నెలల గడువు ఇవ్వాలని కోరారు.అసలేం జరిగిందంటే.. 1998లో ఉర్దూ యూనివర్సిటీని ఏర్పాటు చేయడం కోసం అప్పటి ఉమ్మడి ఏపీ ప్రభుత్వం గండిపేట మండలంలోని మణికొండ జాగీర్ గ్రామంలో..

సర్వే నంబర్ 211, 212లో ఉన్న సుమారు 200 ఎకరాలను కేటాయించింది. అయితే, ఇందులో 50 ఎకరాలు ఇంకా ఖాళీగానే ఉంది. దీంతో నిబంధనల ప్రకారం

వినియోగంలో లేని ఆ 50 ఎకరాల ప్రభుత్వ భూమిని ఎందుకు వెనక్కి తీసుకోకూడదో తెలపాలని 2025, డిసెంబర్ రంగారెడ్డి జిల్లా కలెక్టర్.. రెవెన్యూ శాఖ తరఫున వర్సిటీకి షోకాజ్ నోటీసులు జారీ చేశారు.దీనిపై స్పందించిన వర్సిటీ.. తాము ఆ 50 ఎకరాల భూమిని వృథాగా ఉంచలేదని తెలిపింది. రాబోయే రోజుల్లో వర్సిటీ విస్తరణలో భాగంగా అక్కడ భారీ నిర్మాణాలు చేపట్టబోతున్నామని స్పష్టం చేసింది. వర్సిటీ అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని తమ విజ్ఞప్తిని పరిశీలించాలని కోరింది.

## మీర్జాగూడ వద్ద ఘోర రోడ్డు ప్రమాదం.. చెట్టును ఢీకొన్న కారు ..నలుగురు విద్యార్థులు మృతి

**రంగారెడ్డి పెన్ పవర్:** రంగారెడ్డి జిల్లా మీర్జాగూడ సమీపంలో తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. మోకిలా నుంచి హైదరాబాద్ వైపు వస్తున్న కారు అదుపు తప్పి రోడ్డుపక్కన ఉన్న చెట్టును ఢీకొనడంతో నలుగురు యువకులు అక్కడికక్కడే మృతి చెందారు. ప్రమాదంలో మృతి చెందినవారిని సూర్యతేజ, సుమిత్, శ్రీనిఖిల్, రోహిత్గా పోలీసులు గుర్తించారు. ప్రమాద సమయంలో కారులో మొత్తం ఐదుగురు విద్యార్థులు ప్రయాణిస్తున్నట్లు సమాచారం. తీవ్రంగా గాయపడిన మరో వ్యక్తిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాలను చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలపై దర్యాప్తు కొనసాగుతోంది.

## స్క్రాప్ దుకాణంలో భారీ అగ్ని ప్రమాదం

**హైదరాబాద్ పెన్ పవర్:** ముషీరాబాద్ పోలీసు పరిధిలోని భోలక్ పూర్ ప్రాంతంలోని స్క్రాప్ గోడౌన్లో గురువారం భారీ అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందజేశారు.సమాచారం అందిన వెంటనే అగ్ని మాపక సిబ్బంది ఘటన స్థలానికి చేరుకున్నారు. మూడు ఫైరింజన్లతో మంటలను అదుపులోకి తెచ్చారు. ప్లాస్టిక్, ఇనుము, ఇతర వ్యర్థాలు ఉండటంతో మంటలు వేగంగా ఎగసిపడుతున్నట్లు అధికారులు తెలిపారు. ఈ అగ్నిప్రమాదంలో గోడౌన్లో ఉన్న స్క్రాప్ పూర్తిగా దగ్ధమైంది. లక్షల రూపాయల విలువైన ఆస్తి నష్టం జరిగినట్లు ప్రాథమిక అంచనా వేశారు. ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో అధికారులు ఊపిరిపీల్చుకున్నారు. అయితే అగ్ని ప్రమాదం వల్ల దట్టమైన పొగలు వ్యాపించాయి.

## కార్పొరేషన్ గా నల్గొండ

**నల్గొండ, జనవరి 8, పెన్ పవర్:** తెలంగాణ శాసనసభ పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ, అభివృద్ధిలో భాగంగా జిల్లా కేంద్రమైన నల్లగొండను మున్సిపల్ కార్పొరేషన్‌గా అప్‌గ్రేడ్ చేస్తూ ప్రవేశపెట్టిన బిల్లుకు అసెంబ్లీ ఏకగ్రీవ ఆమోదం తెలిపింది. ఈ చారిత్రాత్మక నిర్ణయంతో నల్లగొండ పట్టణ ముఖచిత్రం పూర్తిగా మారనుంది. నల్లగొండ పట్టణం శరవేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. సాధారణంగా ఒక పట్టణాన్ని కార్పొరేషన్‌గా గుర్తించడానికి రూ. 20 కోట్ల వార్షిక ఆదాయం, 2 లక్షల జనాభా ప్రాతిపదికగా ఉంటుంది.అయితే నల్లగొండ పట్టణం ఇప్పటికే రూ. 40 కోట్ల వార్షిక ఆదాయంతో పాటు 2.5 లక్షల జనాభాను కలిగి ఉండటంతో అప్‌గ్రేడ్ ప్రక్రియ సులభతరమైంది. ఒకప్పుడు కేవలం రూ. 10 వేల బడ్జెట్‌తో ప్రారంభమైన ఈ పట్టణం.. నేడు రియల్ ఎస్టేట్, వాణిజ్య రంగాల్లో దూసుకుపోతోంది. కార్పొరేషన్‌గా మారడం వల్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుండి నిధుల రాక పెరగడమే కాకుండా అధునాతన మౌలిక సదుపాయాలు మెరుగుపడతాయని స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.ఇదే సమావేశంలో నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం తన నియోజకవర్గ సమస్యలను సభ దృష్టికి తెచ్చారు. నార్కట్‌పల్లి మండలంలోని అమ్మనబోల్ గ్రామాన్ని కొత్త మండల కేంద్రంగా ప్రకటించాలని, అలాగే నకిరేకల్ పట్టణాన్ని రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. దీనిపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించే అవకాశం ఉంది.మరోవైపు, తెలంగాణ శాసనమండలి కార్యకలాపాలు ముగిశాయి. స్పీకర్ గుత్తా సుఖేందర్ రెడ్డి సభను నిరవధికంగా వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. ఈ సమావేశాల్లో మున్సిపల్ సవరణ బిల్లుతో పాటు మరో కీలక నిర్ణయానికి మండలి ఆమోద ముద్ర వేసింది. తెలంగాణ రాష్ట్ర గీత రచయిత అందెశ్రీ సేవలను గౌరవిస్తూ.. ఆయన కుమారుడికి అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉద్యోగం కల్పించే బిల్లును డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ప్రవేశపెట్టగా సభ్యులందరూ మద్దతు తెలిపారు. ఈ శాసనమండలి సమావేశాల్లో ఎమ్మెల్సీ కవిత చేసిన చివరి ప్రసంగం ఆసక్తి రేకెత్తించింది. తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించిన ఆమె.. సభలో వీడ్కోలు ప్రసంగం చేశారు. తన రాజీనామాను వెంటనే ఆమోదించాలని మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డిని ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.

## బంజారాహిల్స్ ఉదయ్‌నగర్‌లో కూలిన పురాతన నాలా శ్లాబ్

### నాలాలో పడిపోయిన మినీ ఇసుక లారీ

**హైదరాబాద్ పెన్ పవర్:** బంజారాహిల్స్ రోడ్ నెంబర్11 పరిధిలోని ఉదయ్‌నగర్‌లో ప్రమాదం చోటుచేసుకుంది. లోడుతో వెళ్తున్న మినీ ఇసుక లారీ అకస్మాత్తుగా రోడ్డు కుంగిపోవడంతో కింద ఉన్న నాలాలోకి పడిపోయింది. పైకి సాధారణ రోడ్డులా కనిపించిన ఈ ప్రాంతం వాస్తవానికి ఎప్పుడో నిర్మించిన పురాతన నాలా శ్లాబ్‌గా స్థానికులు చెబుతున్నారు.

ఇన్నేళ్లుగా వానలకు తడిసి, ఎండలకు ఎండిపోవడంతో నాలా శ్లాబ్ పూర్తిగా బలహీనమైంది. ఆపై భారీ బరువుతో వచ్చిన మినీ లారీ కారణంగా శ్లాబ్ ఒక్కసారిగా కూలిపోయి ప్రమాదం జరిగింది. లారీ ఎడమ భాగం నాలాలోకి కూరుకుపోవడంతో అందులో ఉన్న డ్రైవర్ ఇరుక్కుపోయాడు. పెద్ద శబ్దంతో మినీ లారీ పడిపోవడంతో అప్రమత్తమైన స్థానికులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని కష్టపడి డ్రైవర్ ను బయటకు తీశారు. సమాచారం అందుకున్న వెంటనే జీహెచ్ఎంసీ, హైడ్రా, జలమండలి అధికారులు, బంజారాహిల్స్ పోలీసులు అక్కడికి చేరుకుని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు.పోలీసుల ప్రాథమిక విచారణలో, ఇసుక లారీ సిబ్బంది ముందుకు వెళ్లే క్రమంలోనే ప్రమాదంలో చిక్కుకున్నట్లు గుర్తించారు. ఈ మార్గంలో రోజూ పది వరకు భారీ లారీలు రాకపోకలు సాగిస్తుండగా, స్థానికులు కూడా తమ వాహనాలతో ఇదే దారిని వినియోగిస్తున్నారు. అయితే రహదారి కింద నాలా ఉన్న విషయమే తమకు తెలియదని స్థానికులు తెలిపారు.ఇదిలా ఉండగా, నాలాలో పడిపోయిన మినీ లారీని బయటకు తీసే పనిలో అధికారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

## నరేగా లోమహాత్మా గాంధీ పేరు తొలగించడం అన్యాయం

**హైదరాబాద్: పెన్ పవర్:** మన్ రేగా చట్టం విప్లవాత్మక చట్టం. ఇది సోనియాగాంధీ మానస పుత్రిక. ఈ చట్టం వల్ల గ్రామీణ ప్రాంతంలో విప్లవాత్మక మార్పులు జరిగాయని నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు.సోనియాగాంధీ గారు ఎంతో శ్రమించి పేదలకు పని చట్టాన్ని కల్పించారు. మోడీ కి ఏ చట్టానికి గాంధీ పేరు ఉన్నదనో, కాంగ్రెస్ పార్టీ ఈ చట్టం తెచ్చిందనో వారు ఈ చట్టాన్ని రద్దు చేశారు. పని హక్కు చట్టాన్ని రూపొందించి, కనీస వేతనాన్ని ఇచ్చే విదంగా ఉన్న చట్టాన్ని రద్దు చేశారు. మోడీ గ్రామీణ ప్రాంత కూలీలకు పని హక్కు మీద ప్రభావం చూపించే విధంగా మార్పు చేశారు.. జాబ్ కార్డ్ ఉన్న వారికి కనీసం 100 రోజులు కనీస వేతనం లభించేది. మోడీ నరేగా గ్రామ పంచాయతీ లకు ఉన్న హక్కును తీసేసారు. మోడీ తెచ్చిన కొత్త చట్టం గ్రామీణ కూలీలకు మరణ శాసనం లాంటిది. గతంలో మొత్తం నరేగా నిధులను కేంద్రమే భరించేది. 40 శాతం బడ్జెట్ లో కోత పెట్టి రాష్ట్రాల మీద భారం మోపారని అన్నారు.

దీన్ని సహించేది లేదు. నరేగా చట్టం మార్పులను తీవ్రంగా వ్యతిరేకించాలి. నరేగా చట్టంలో మహాత్మాగాంధీ పేరు ను తొలగించడం, చట్టం లో నిధులను పని హక్కులను తొలగించడాన్ని నిరసిస్తూ 12 వేల గ్రామ పంచాయతీలలో తీర్మాణం చేయాలి. బీజేపీ కుట్రలను తిప్పికొట్టి అన్ని గ్రామ పంచాయతీలను నరేగా అంశాలపై తీర్మానాన్ని చేసి 12 వేల పంచాయతీల తీర్మానాన్ని రాష్ట్రపతి కి అందించాలి..నరేగా చట్టాన్ని తిరిగి యధావిధిగా కొనసాగేలా ఉద్యమించాలని అన్నారు.

## ఎడిటర్ వ్యూ

# తెలంగాణ తొలి ఉద్యమ పూర్వాపరాలు

తెలంగాణ ప్రజలకు అన్ని రంగాలలో జరుగుతున్న అన్యాయానికి ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు మాత్రమే పరిష్కారమని, రాష్ట్ర సాధనకై పోరాటం తప్పదనే భావన తెలంగాణ యువతలో అంకురించింది. అలా తెలంగాణ తొలి ఉద్యమం తెలంగాణా హక్కుల పరిరక్షణ ఉద్యమంగా మొదలైంది. తెలంగాణా రక్షణలను అమలు చెయ్యాలని కోరుతూ 1969, జనవరి 9 న ఖమ్మం పట్టణంలో బి.ఎ. స్టూడెంట్, నేషనల్ స్టూడెంట్స్ యూనియన్ నాయకుడైన రవీంధ్రనాథ్ గాంధీచౌక్ దగ్గర నిరవధిక దీక్ష ప్రారంభించాడు. తొలి దశ ఉద్యమ ప్రారంభ పూర్వా పరాలు తెలుసుకునే ప్రయత్నం ఇది. ఆంధ్ర, తెలంగాణ ప్రాంతాలు కలిసి ఆంధ్ర ప్రదేశ్ ఏర్పాటు కావడంలో కీలకమైనది పెద్దమనుషుల ఒప్పందం. 1956లో తెలుగు మాట్లాడే ప్రాంతాలన్నీ ఏకమై ఒకే రాష్ట్రంగా ఏర్పడటానికి రాయలసీమ, తెలంగాణ ఆంధ్ర ప్రాంతాల నాయకులతో కలిసి.1956, ఫిబ్రవరి 20 న ఒప్పందం కుదుర్చుకున్నారు. ఇదే పెద్దమనుషుల ఒప్పందం. న్యూ ఢిల్లీలో పెద్దమనుషుల ఒప్పందంపై సంతకాలు చేసిన వారు తెలంగాణ తరపున, బూర్గుల రామ కృష్ణారావు, కె.వి.రంగారెడ్డి, మర్రి చెన్నారెడ్డి, జె.వి. నరసింగరావు; ఆంధ్ర తరపున నీలం సంజీవరెడ్డి, బెజవాడ గోపాలరెడ్డి, అల్లూరి సత్యనారాయణ రాజు, గౌతు లచ్చన్న ఉన్నారు. తెలంగాణ అభివృద్ధికి, తెలంగాణ సమానత్వ పరిరక్షణకు సంబంధించిన నిబంధనలు ఏర్పరచు కున్నారు. ఈ ఒప్పందాన్ననుసరించి 1956, నవంబర్ 1 న ఆంధ్రప్రదేశ్ ఏర్పడింది. ఆంధ్ర ప్రాంతానికి చెందిన నీలం సంజీవరెడ్డి ముఖ్యమంత్రి అయ్యారు. అయితే, ఈ ఒప్పందం అమలు విషయమై కొద్దికాలంలోనే తెలంగాణా ప్రజల్లో అసంతృప్తి తగిలింది. ఒప్పందాన్ననుసరించి ఉప ముఖ్యమంత్రి పదవిని తెలంగాణా వాసికి ఇవ్వలేదు; అసలు ఆ పదవినే సృష్టించలేదు. అయితే 1959లో దామోదరం సంజీవయ్య ముఖ్యమంత్రి కాగానే ఉప ముఖ్యమంత్రిగా తెలంగాణ ప్రాంతానికి చెందిన కొండా వెంకట రంగారెడ్డి (కె.వి.రంగారెడ్డి) ని నియమించాడు. అయితే మళ్ళీ 1962 నుండి 1969 వరకు ఉపముఖ్యమంత్రి పదవి లేదు. 1969లో తెలంగాణ ప్రాంతానికి చెందిన జె.వి.నర్సింగరావును ఉప ముఖ్యమంత్రిగా నియమించారు. ఈ విధంగా రాజకీయ పదవుల విషయంలో తమకు అన్యాయం జరిగిందని తెలంగాణ వారు భావించారు. అలాగే ఆంధ్ర ప్రాంతం నుండి తరలి వచ్చిన ప్రజలు తెలంగాణ ప్రాంతంలో భూములు కొని, వ్యవసాయం చేసారు. ఇది తమ భూముల ఆక్రమణగా కొందరు తెలంగాణా ప్రజలు భావించారు. ప్రభుత్వ ఉద్యోగాలు, ఉపాధ్యాయుల నియామకాల్లో తమకు అన్యాయం జరిగిందనే భావన కూడా తెలంగాణా ప్రజల్లో బలంగా కలిగింది. తెలంగాణ విద్యాసంస్థల్లో కూడా తమకు తగినన్ని సీట్లు రాలేదని విద్యార్థుల్లో అసంతృప్తి నెలకొని ఉంది. ఈ నేపథ్యం లోనే "తెలంగాణ తొలి ఉద్యమం"... "తెలంగాణ హక్కుల పరిరక్షణ ఉద్యమం"గా మొదలైంది. తెలంగాణ రక్షణలను అమలు చెయ్యాలని కోరుతూ 1969, జనవరి 9 న ఖమ్మం పట్టణంలో బి.ఎ. స్టూడెంట్, నేషనల్ స్టూడెంట్స్ యూనియన్ నాయకుడైన రవీంధ్రనాథ్ గాంధీ చౌక్ వద్ద నిరవధిక దీక్ష ప్రారంభించాడు. ఆరోజు జరిగిన ఊరేగింపులో హింసాత్మక ఘటనలు జరిగాయి. మరుసటి రోజు ఉద్యమం నిజామాబాదుకు పాకింది. జనవరి 10 న హైదరాబాదులోని ఉస్మానియా విశ్వవిద్యాలయంలో జరిగిన విద్యార్థుల సమావేశంలో - తెలంగాణా రక్షణల అమలుకై జనవరి 15 నుండి సమ్మె చెయ్యాలని ప్రతిపాదించారు. అయితే, జనవరి 13 న అదే విశ్వవిద్యాలయంలో జరిగిన ఒక సమావేశంలో విద్యార్థులలోని ఒక వర్గం "తెలంగాణ విద్యార్థుల కార్యాచరణ సమితి"గా ఏర్పడి, ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనే తమ ధ్యేయంగా ప్రకటించారు. జనవరి 13న ఉస్మానియా యూనివర్సిటీలో "తెలంగాణ విద్యార్థుల కార్యాచరణ సమితి" ఏర్పడింది. ఆ రోజు మొట్టమొదటి సారిగా ప్రత్యేక తెంగాణ సాధనను తమ లక్ష్యంగా విద్యార్థులు ప్రకటించుకున్నారు. విద్యార్థుల కార్యాచరణ సమితి మెడికల్ విద్యార్థి మల్లిఖార్జున్‌ను ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకుంది. విద్యార్థులు ఎలాంటి త్యాగాలకైనా సిద్ధం కావాని మల్లిఖార్జున్ పిలుపునిచ్చారు. అదే రోజున పురప్రముఖులు కొందరు "తెలంగాణా పరిరక్షణల కమిటీ"ని ఏర్పాటు చేసారు. జనవరి 18 న విద్యార్థుల్లోని రెండు వర్గాలు (తెలంగాణ రక్షణల కోసం ఉద్యమించిన వారు, ప్రత్యేక తెలంగాణ కోరేవారు) వేరువేరుగా హైదరాబాదులో ఊరేగింపులు జరిపారు. ఈ రెండు ఊరేగింపులు ఆబిడ్స్ లో ఎదురైనపుడు ఘర్షణ చెలరేగింది. పోలీసులు లాఠీఛార్జి చెయ్యవలసి వచ్చింది. అదేరోజు శాసనసభలోని ప్రతిపక్ష పార్టీలు తెలంగాణా రక్షణల అమలు కొరకు ప్రభుత్వాన్ని వత్తిడి చేసాయి. ఉద్యమ కారుల కోరికలను చర్చించడానికి ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం జనవరి 19 న అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేసింది. ఆ సమావేశం ఒక ఒప్పందానికి వచ్చింది. తెలంగాణలో పనిచేస్తున్న ఆంధ్ర ఉద్యోగులను వెనక్కి పంపించాలి. పెద్దమనుషుల ఒప్పందం లోని తెలంగాణ రక్షణలను అమలు చెయ్యాలి. అయితే ప్రత్యేక తెలంగాణ వాదులు ఈ ఒప్పందానికి సమ్మతించలేదు. ప్రత్యేక రాష్ట్రమే తమ ధ్యేయమని, అది నెరవేరే వరకు తమ ఉద్యమం కొనసాగుతుందని ప్రకటించారు. జనవరి 24న సదాశివపేటలో కాల్పులు జరిగాయి. ఈ కాల్పుల్లో 14 మంది గాయపడ్డారు. గాయపడ్డ వారిలో 17 ఏళ్ల శంకర్ మరుసటి రోజు గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ చనిపోయాడు. 1969 తెలంగాణ ఉద్యమంలో తొలి అమరుడు శంకర్. కాల్పులకు నిరసనగా కొండా లక్ష్మణ్ బాపూజీ తన మంత్రి పదవికి రాజీనామా చేశారు. ప్రత్యేక తెలంగాణ కాంగ్రెస్ సమితిని ఏర్పాటు చేశారు. అఖిలపక్ష కమిటీ ఒప్పందాన్ని అమలు చేస్తూ జనవరి 22న ప్రభుత్వం ఒక ప్రభుత్వ ఉత్తర్వును జారీ చేసింది. దీని ప్రకారం ఫిబ్రవరి 28 కల్లా స్థానికులు కాని ఉద్యోగులని వారి వారి స్థానాలకు వెనక్కి పంపివేస్తారు. తెలంగాణ రక్షణల అమలుకై మిగులు నిధుల అంచనాకు ఢిల్లీనుండి ఒక బృందం వస్తుంది. ఈ హామీలతో ఉద్యమానికి ఆద్యుడైన ఖమ్మం విద్యార్థి రవీంద్ర నాథ్ తన దీక్షను విరమించాడు. దీనితో తెలంగాణ రక్షణల అమలు ఉద్యమం ఆగిపోయింది. ప్రత్యేక తెలంగాణ ఉద్యమం రెండవ దశలోకి ప్రవేశించింది. జనవరి 28న వరంగల్లులో కాళోజీ నారాయణరావు అధ్యక్షతన జరిగిన సదస్సులో ముఖ్యమంత్రి రాజీనామా చెయ్యాలని, రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించాలని తీర్మానం చేసారు.

1969 ఫిబ్రవరి 28 న యువకులు, మేధావి వర్గాలు కలిసి హైదరాబాదులో తెలంగాణ ప్రజాసమితి ని స్థాపించారు.జూన్ 4న తెలంగాణ పరిస్థితి తీవ్రతను తెలుసుకున్న ప్రధాన మంత్రి ఇందిరాగాంధీ హైదరాబాద్ నగరానికి వచ్చి విద్యార్థి నాయకులు, తెలంగాణ ప్రజా సమితి నాయకులతో చర్చలు జరిపింది. తెలంగాణ తొలి ఉద్యమ కాలంలో మొత్తం 95 సార్లు కాల్పులు జరిగాయి. హైదరాబాద్, వరంగల్ నగరాల్లో కర్ఫ్యూ విధించారు. ఉద్యమంలో 369 మంది చనిపోగా, ప్రభుత్వ లెక్కలు మాత్రం 57 మంది చనిపోయినట్టుగా చెప్పాయి. తెలంగాణ ప్రజా సమితి నేతతో కేంద్రం చర్చలు జరిపింది. సెప్టెంబర్‌లో చెన్నారెడ్డి ఢిల్లీలో చర్చలు జరిపి వచ్చిన తర్వాత విద్యార్థులు తరగతులకు హాజరు కావాలని చెన్నారెడ్డి, విద్యార్థి నాయకుడు మల్లికార్జున్ ఒక ప్రకటన చేశారు. చదువులు కొనసాగిస్తూనే ఉద్యమంలో పాల్గొనాని విజ్ఞప్తి చేశారు. ఈ విధంగా ఉద్యోగులను, విద్యార్థును ఉద్యమం నుంచి పక్కకు తప్పించారు. మర్రి చెన్నారెడ్డి నేతృత్వంలోని తెలంగాణ ప్రజాసమితి 1971 లో పార్లమెంటుకు జరిగిన మధ్యంతర ఎన్నికలలో 10 సీట్లు సాధించడం, ఆ ఎన్నికల్లో ఇందిరా గాంధీకి సంపూర్ణ ఆధిక్యత రావడంతో తెలంగాణా ప్రజాసమితి మద్దతు కీలకం కాకపోవడం,1971 సెప్టెంబర్ 24 న బ్రహ్మానంద రెడ్డి రాజీనామా చేసాక కొద్దిరోజులకు చెన్నారెడ్డి తెలంగాణా ప్రజా సమితిని రద్దు చేయడం, ఆ పార్టీని జాతీయ కాంగ్రెస్ పార్టీలో విలీనం చేయడం క్రమానుగతంగా జరిగి పోయాయి.

# 'అన్వేష'తో 2026కి శ్రీకారం... మరో ఉపగ్రహా ప్రయోగానికి సిద్ధమవుతున్న ఇస్రో

భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) 2026 సంవత్సరంలో తన తొలి ప్రయోగానికి సిద్ధమవుతోంది. ఈ నెల 12వ తేదీన ఉదయం 10:17 గంటలకు శ్రీహరికోటలోని సతీశ్ ధావన్ స్పేస్ సెంటర్ మొదటి ప్రయోగ వేదిక నుంచి పీఎస్ఎల్వీ-సీ62 రాకెట్‌ను ప్రయోగించనున్నట్లు ఇస్రో ప్రకటించింది. ఈ ప్రయోగం ద్వారా ఎర్త్ అబ్జర్వేషన్ శాటిలైట్ (జుూూ-చీ1)తో పాటు మరో 15 చిన్న ఉపగ్రహాలను కక్ష్యలో ప్రవేశపెట్టనున్నారు.ఈ మిషన్‌లో ప్రధాన ఉపగ్రహమైన EOS`N1కు 'అన్వేష' అని కూడా పేరు పెట్టారు. వ్యవసాయం, పట్టణ ప్రణాళిక, పర్యావరణ పర్యవేక్షణ వంటి కీలక రంగాలలో దేశ సామర్థ్యాన్ని పెంచడానికి ఈ ఉపగ్రహం ఉపయోగపడనుంది. "రాకెట్, ఉపగ్రహాల అనుసంధాన ప్రక్రియ పూర్తయింది. ప్రయోగానికి ముందు జరగాల్సిన తనిఖీలు కొనసాగుతున్నాయి" అని ఇస్రో ఒక ప్రకటనలో వెల్లడించింది.ఈ ప్రయోగంలో స్పెయిన్‌కు చెందిన ఒక స్టార్టప్ అభివృద్ధి చేసిన 'కెస్ట్రెల్ ఇనీషియల్ టెక్నాలజీ డెమాన్‌స్ట్రేటర్' (KID) అనే ఒక చిన్న రీ-ఎంట్రీ వాహనాన్ని కూడా పరీక్షిస్తున్నారు. అన్ని ఉపగ్రహాలను కక్ష్యలో ప్రవేశపెట్టిన తర్వాత ఇది భూ వాతావరణంలోకి తిరిగి ప్రవేశించి దక్షిణ పసిఫిక్ మహాసముద్రంలో కూలిపోనుంది.పీఎస్ఎల్వీ రాకెట్‌కు ఇది 64వ ప్రయోగం కాగా, రెండు స్ట్రాప్-ఆన్ మోటార్లు కలిగిన పీఎస్ఎల్వీ-డీఎల్ వేరియంట్‌తో ఇది ఐదో ప్రయోగం. చంద్రయాన్-1, మార్స్ ఆర్బిటర్ మిషన్, ఆదిత్య-ఎల్1 వంటి ఎన్నో ప్రతిష్ఠాత్మక ప్రయోగాలను పీఎస్ఎల్వీ విజయవంతంగా పూర్తి చేసింది. కాగా, గత ఏడాది మే నెలలో చేపట్టిన పీఎస్ఎల్వీ-సీ61 ప్రయోగం సాంకేతిక లోపం కారణంగా విఫలమైన విషయం తెలిసిందే.

## డ్రగ్స్ దందా... కువైట్‌లో ఇద్దరు భారతీయులకు మరణశిక్ష

కువైట్ న్యాయస్థానం మాదకద్రవ్యాల అక్రమ రవాణా కేసులో ఇద్దరు భారతీయులకు మరణ శిక్ష విధించింది. హెరాయిన్, మెథాంపె, టమైన్‌లతో పట్టుబడిన ఇద్దరికి అక్కడి న్యాయస్థానం మరణ శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించింది.దేశంలో మాదకద్రవ్యాల అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపాలని నిర్ణయించిన కువైట్ అంతర్గత వ్యవహారాల శాఖ, ఇటీవల ప్రత్యేక ఆపరేషన్ చేపట్టింది. ఇందులో భాగంగా డ్రగ్ కంట్రోల్ అధికారులు కైఫాన్, షువైఖ్ ప్రాంతాల్లో నిఘా పెట్టి ఇద్దరు భారతీయులను అరెస్టు చేశారు.వారి వద్ద నుంచి 14 కిలోల హెరాయిన్, 8 కిలోల మెథాంఫెటమైన్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితులకు అంతర్జాతీయ డ్రగ్స్ నెట్‌వర్క్‌తో సంబంధం ఉన్నట్లు దర్యాప్తులో తేలిందని సమాచారం. ఈ మేరకు ఆధారాలను ప్రాసిక్యూటర్లు కోర్టులో ప్రవేశపెట్టగా, దోషులకు మరణశిక్ష విధిస్తూ న్యాయస్థానం తీర్పు వెలువరించింది.

## ఖాళీ అవుతున్న హైదరాబాద్... కిటకిటలాడుతున్న సికింద్రాబాద్ రైల్వే స్టేషన్

- 2 పేజి తరువాయి

కుటుంబాలు పెద్ద సంఖ్యలో సొంతూళ్లకు పయనమవు తున్నాయి. ఉదయం నుంచే సికింద్రాబాద్, కాచిగూడ, నాంపల్లి స్టేషన్లకు ప్రయాణికులు పోటెత్తారు. సికింద్రాబాద్ స్టేషన్ అయితే పూర్తిగా రద్దీతో నిండిపోయింది. లగేజీలు, పిల్లలు, పెద్దలతో జనసంద్రం కనిపించింది.ఈ రద్దీని ముందుగానే అంచనా వేసిన దక్షిణ మధ్య రైల్వే ఇప్పటికే 150 స్పెషల్ ట్రైన్లను అనౌన్స్ చేసింది. ముఖ్యంగా విశాఖపట్నం, విజయవాడ, కాకినాడ, తిరుపతి వంటి ఏపీ ప్రాంతాలకు డిమాండ్ ఆకాశాన్నంటడంతో అదనపు సర్వీసులు ఏర్పాటు చేశారు. సికింద్రాబాద్ స్టేషన్ పై ఒత్తిడి తగ్గించేందుకు... జనవరి 7 నుంచి 20 వరకు 27 ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హైటెక్ సిటీ, చర్లపల్లి స్టేషన్లలో తాత్కాలిక హాల్ట్ కల్పించారు. దీనివల్ల ఐటీ కారిడార్‌లో ఉండే ఉద్యోగులు సికింద్రాబాద్ రాకుండా

నేరుగా హైటెక్ సిటీలోనే రైలు ఎక్కే సౌకర్యం లభిస్తుంది, ఇది చాలా మందికి భారీ రిలీఫ్‌గా మారింది.

సికింద్రాబాద్ స్టేషన్‌లో అభివృద్ధి పనులు జరుగుతున్న కారణంగా ప్లాట్‌ఫామ్ 10 వైపు పార్కింగ్, ఎగ్జిట్ మార్గాలు మార్చారు. ప్రయాణికులు ఇబ్బంది పడకుండా అదనపు సిబ్బంది, పోలీసు బలగాలను మోహరించారు. ఇక అన్‌రిజర్వ్‌డ్ టికెట్లు తీసుకునేవాళ్లు 'రైల్ వన్' యాప్ ద్వారా టికెట్ బుక్ చేసుకుంటే 3 శాతం డిస్కౌంట్ లభిస్తుందని రైల్వే అధికారులు చెప్పారు.

## తిరుమల రథసప్తమి వేడుకల ఏర్పాట్లపై అదనపు ఈవో సమీక్ష..

- 2 పేజి తరువాయి

చేయాలని అధికారులకు సూచించారు.టీటీడీ అధికారులు, విజిలెన్స్ సెక్యూరిటీ, పోలీసులతో సమన్వయం చేసుకుని ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. ముందస్తుగా భక్తుల రద్దీని అంచనా వేసుకుని ట్రాఫిక్, పార్కింగ్ , అత్యవసర టీమ్స్ లపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు.సమగ్ర బందోబస్తు పై ముందస్తు ప్రణాళికలు రూపొందించాలని, ఘాట్ రోడ్డు వాహనాల కదలికను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, అత్యవసర పరిస్థితుల్లో వాహనాలను తరలించేలించేందుకు వీలుగా కార్యాచరణ రూపొందించాలని కోరారు. ప్రతి ఒక్కరూ సమాచారాన్ని ఎప్పటికప్పుడు చేరవేసేలా సమన్వయం చేసుకోవాలని ఆయన ఆదేశించారు.ఇంజినీరింగ్, అన్నప్రసాదం, పారిశుద్ధ్యం, శ్రీవారి సేవకులు, వైద్య బృందాలు, ఎల్ ఈ డీ స్క్రీన్లు, పుష్పాలంకరణ, సాంస్కృతిక కళా బృందాలు, ఎస్వీబీసీ, సోషియల్ మీడియాలో ప్రచారం ఇతర ఏర్పాట్లపై సమీక్షించారు.

**వాహనసేవల వివరాలు :**

తెల్లవారుజామున 5.30 నుంచి 8 గంటల వరకు (సూర్యోదయం ఉదయం 6.45 గంటలకు) సూర్యప్రభ వాహనం.

ఉదయం 9 నుంచి 10 గంటల వరకు చిన్నశేష వాహనం.

ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు గరుడ వాహనం.

మధ్యాహ్నం 1 నుంచి 2 గంటల వరకు హనుమంత వాహనం.

మధ్యాహ్నం 2 నుంచి 3 గంటల వరకు చక్రస్నానం.

సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు కల్పవృక్ష వాహనం.

సాయంత్రం 6 నుంచి 7 గంటల వరకు సర్వభూపాల వాహనం.

రాత్రి 8 నుంచి 9 గంటల వరకు చంద్రప్రభ వాహనం.

**ఆర్జిత సేవలు, ప్రత్యేక దర్శనాలు రద్దు :**

రథసప్తమి వేడుకల సందర్భంగా భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని పలు ప్రత్యేక సేవలు రద్దు చేస్తున్నట్లు అదనపు ఈవో ప్రకటించారు.

కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్ర దీపాలంకార సేవలు రద్దు

ఎన్.ఆర్.ఐలు, చంటి బిడ్డల తల్లిదండ్రులు, సీనియర్ సిటిజన్లు, వికలాంగుల ప్రివిలేజ్ దర్శనాల రద్దు

తిరుపతిలో జనవరి 24 నుండి 26వ తేది వరకు స్లాటెడ్ సర్వదర్శనం టోకెన్లు జారీ రద్దు.

ప్రోటోకాల్ ప్రముఖులకు మినహా విఐపి బ్రేక్ దర్శనాలు రద్దు, బ్రేక్ దర్శనాలకు సంబంధించి జనవరి 24న ఎలాంటి సిఫార్సు లేఖలు స్వీకరించబడవు.

ఈ సమావేశంలో టీటీడీ జేఈవో శ్రీ వీరబ్రహ్మం, సీవీఎస్వో శ్రీ మురళీకృష్ణ, తిరుమల అదనపు ఎస్పీ శ్రీ రామకృష్ణలతో కలిసి రథ సప్తమి రోజున భద్రత, భక్తుల రద్దీ నిర్వహణ, తదితర అంశాలపై సమీక్షించారు.

## వాటికి అడ్డు చెప్పవద్దని ఏపీ పునర్విభజన చట్టంలో ఉంది

- 2 పేజి తరువాయి

కేసీఆర్ ప్రజలను పదేపదే మోసం చేశారని ఆయన ఆరోపించారు. పోతిరెడ్డిపాడు ద్వారా నీటిని తరలించినప్పుడు ఎవరూ స్పందించలేదని విమర్శించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి నదీ జలాల అంశాన్ని తెరపైకి తెచ్చాయని ఆయన అన్నారు. కృష్ణా జలాల్లో తెలంగాణ తన వాటాను పూర్తిగా వాడుకోలేదని, అవసరం ఉన్నప్పటికీ వినియోగించుకోలేదని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర విభజన సమయంలో అప్పటికే నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులకు అభ్యంతరం చెప్పవద్దని ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంలో స్పష్టంగా ఉందని, అయితే ఆ చట్టంలో పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు సంబంధించిన ప్రస్తావన లేదని ఆయన అన్నారు. పోతిరెడ్డిపాడు ద్వారా ఆంధ్రప్రదేశ్‌కు 4 టీఎంసీల నీటిని తరలించారని, దీనిని తెలంగాణ కాంగ్రెస్ గానీ, బీఆర్ఎస్ గానీ గతంలో పట్టించుకోలేదని విమర్శించారు. తెలంగాణ రాష్ట్రానికి కాంగ్రెస్, బీఆర్ఎస్ చేసిన తప్పిదాలు చూస్తే తనకు ఆశ్చర్యం కలుగుతోందని ఆయన అన్నారు.

## కేసీఆర్ ఫామ్‌హౌస్‌కు మంత్రులు కొండా సురేఖ, సీతక్క.. బీఆర్ఎస్ అధినేత ఆత్మీయ పలకరింపు

- 2 పేజి తరువాయి

వారిని ఆయన మర్యాద పూర్వకంగా పసుపు, కుంకుమ, చీర, తాంబూలాలతో సత్కరించారు.

మంత్రులు కేసీఆర్‌కు ఆహ్వాన పత్రికను, ప్రసాదంను అందజేసి, మరికొన్ని రోజుల్లో ప్రారంభం కానున్న జాతరకు రావాల్సిందిగా రాష్ట్ర ప్రభుత్వం తరపున ఆహ్వానించారు. కేసీఆర్ దంపతులు ఇచ్చిన తేనీటి విందును మంత్రులు స్వీకరించారు. అనంతరం వారు కేసీఆర్ యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఎర్రవెల్లి ఫామ్ హౌస్ వద్ద మంత్రులకు మాజీ ఎంపీ జోగినపల్లి సంతోష్ కుమార్ స్వాగతం పలికారు.

## అమెరికా నౌకలను ముంచేస్తాం... రష్యా ఎంపీ వార్నింగ్

- 2 పేజి తరువాయి

జరిగిన ఈ ఘటనపై రష్యా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. అమెరికా తీరు ఇలాగే కొనసాగితే, వారి కోస్ట్ గార్డ్ పడవలను టార్పిడోలతో ముంచివేయాల్సి వస్తుందని రష్యా చట్టసభ సభ్యుడు ఒకరు గట్టి హెచ్చరిక జారీ చేశారు.ఐస్‌లాండ్‌కు దక్షిణంగా 190 మైళ్ల దూరంలో 'మారినెరా' అనే రష్యన్ ట్యాంకర్‌ను అమెరికా రక్షణ శాఖ, కోస్ట్ గార్డ్ సంయుక్తంగా సీజ్ చేశాయి. ఈ ఆపరేషన్‌కు బ్రిటన్ కూడా సహకరించింది. హెలికాప్టర్ ద్వారా నౌకపైకి దిగిన అమెరికా మెరైన్లు సిబ్బందిని అదుపులోకి తీసుకున్నారు. ఇదే సమయంలో, జెండా లేని 'ఎం/టీ సోఫియా' అనే మరో నౌకను కూడా స్వాధీనం చేసుకున్నారు. ఈ ఆపరేషన్‌కు సంబంధించిన వీడియోను యూఎస్ కోస్ట్ గార్డ్ విడుదల చేసింది.ఈ ఘటనపై రష్యా ఎంపీ అలెక్సీ జురావ్లెవ్ తీవ్రంగా స్పందించారు. "ఏం చేసినా శిక్ష పడదన్న ధీమాతో అమెరికా ఉంది. అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘిస్తే సైనిక దాడులకు సిద్ధంగా ఉండాలి. అవసరమైతే అమెరికా కోస్ట్ గార్డ్ పడవలను ముంచేయాల్సి వస్తుంది" అని ఆయన హెచ్చరించారు. ఈ చర్యను 'సముద్రపు దోపిడీ' అని రష్యా అధికారులు అభివర్ణించారు. ఇది అంతర్జాతీయ సముద్ర చట్టాలను ఉల్లంఘించడమేనని రష్యా రవాణా శాఖ ఖండించింది.

వెనెజువెలా చమురు ఎగుమతులపై అమెరికా విధించిన ఆంక్షలను అమలు చేయడంలో భాగంగానే ఈ చర్యలు చేపట్టినట్లు తెలుస్తోంది. ఆంక్షలను తప్పించుకోవడానికి వెనెజువెలా, ఇరాన్ వంటి దేశాలు ఉపయోగిస్తున్న 'షాడో ఫ్లీట్' నౌకలను లక్ష్యంగా చేసుకుని అమెరికా ఈ ఆపరేషన్లు నిర్వహిస్తోంది. ఈ తాజా ఘటనతో అమెరికా, రష్యా మధ్య ఉద్రిక్తతలు మరింత పెరిగాయి.

## రాహుల్ గాంధీని రేవంత్ రెడ్డి ఏం అన్నాడో నేనూ అదే అన్నాను

- 2 పేజి తరువాయి

రాహుల్ గాంధీ 'పప్పు' కాదని, 'ముద్దపప్పు' అని రేవంత్ రెడ్డి గతంలో అన్నారని, ఇప్పుడు తాను కూడా అదే పదం ఉపయోగించానని ఆయన స్పష్టం చేశారు."రేవంత్ రెడ్డి అసెంబ్లీలో అసభ్యకర పదాలు మాట్లాడితే కోపం వచ్చి, నేను కూడా రాహుల్ గాంధీని ఒక మాట అన్నాను. నా వ్యాఖ్యలపై కాంగ్రెస్ నాయకులు విమర్శలు చేస్తున్నారు. కానీ, నేను కొత్తగా ఏమీ అనలేదు. రేవంత్ రెడ్డి అన్న మాటనే నేను అన్నాను. మీ రేవంత్ రెడ్డి రాహుల్ గాంధీని 'పప్పు' కాదు 'ముద్దపప్పు' అని అన్నారు. కాబట్టి ఆ విమర్శలు ఏమైనా ఉంటే రేవంత్ రెడ్డిపై చేయండి. మీ సోనియా గాంధీని మీ రేవంత్ రెడ్డి 'బలిదేవత' అన్నారు. అలాంటి వ్యక్తిని తీసుకువచ్చి మీరు ముఖ్యమంత్రిగా చేశారు. తనను ముఖ్యమంత్రిగా చేసిన రాహుల్ గాంధీని 'ముద్దపప్పు' అని అన్నది రేవంత్ రెడ్డే" అని కేటీఆర్ వ్యాఖ్యానించారు.తెలంగాణ భవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, ఈ 'దద్దమ్మ' కాంగ్రెస్ పాలనలో యూరియా కోసం రైతులు కుస్తీలు పట్టాల్సిన దుస్థితి నెలకొందని అన్నారు. ఒక్క బస్తా యూరియా కోసం కూడా భారీ క్యూలైన్‌లలో గంటల తరబడి నిలబడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. చివరికి క్రాప్ హాలిడేలు ప్రకటించాల్సిన పరిస్థితి ఏర్పడిందని అన్నారు. కేసీఆర్ పదేళ్ల పాలనలో యూరియా కోసం కుస్తీలు లేవని, విత్తనాల కోసం పోటీ లేదని, కరెంటు కష్టాలు లేవని, క్రాప్ హాలిడేలు లేవని ఆయన వెల్లడించారు.పెండింగ్ పనులు పూర్తి చేస్తే కేసీఆర్‌కు పేరు వస్తుందనే అక్కసుతోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని పక్కన పెట్టారని కేటీఆర్ ఆరోపించారు. కేవలం 10 శాతం పనులు పూర్తి చేస్తే వేల ఎకరాలకు సాగునీరు అందే అవకాశం ఉన్నా ఈ ప్రభుత్వం ఆ పని చేయడం లేదని విమర్శించారు. పెండింగ్ పనులు పూర్తి చేస్తే కేసీఆర్‌కు పేరు వస్తుందని, తన బాస్‌కు కోపం వస్తుందనే భయంతో రేవంత్ రెడ్డి రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నాడని ఆయన అన్నారు.

## రేవంత్ రెడ్డితో హిమాచల్ ప్రదేశ్ మంత్రి సమావేశం... తెలంగాణ సీఎంపై ప్రశంస

- 2 పేజి తరువాయి

ఆసక్తి కనబరిచారు. ప్రభుత్వ విద్యా వ్యవస్థ బలోపేతానికి తెలంగాణ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేపడుతున్న కార్యక్రమాలను అభినందించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ విద్యా శాఖ కమిషనర్ యోగితా రాణి, పాఠశాల విద్యా డైరెక్టర్ నవీన్ నికోలస్, ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, హిమాచల్ ప్రదేశ్ ప్రభుత్వ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

**విద్యా శాఖ ఉన్నతాధికారులకు రేవంత్ రెడ్డి సూచన**

ప్రతి రెండు అసెంబ్లీ నియోజకవర్గాలకు ఒక సెంట్రలైజ్డ్ కిచెన్ ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యా శాఖ ఉన్నతాధికారులకు సూచించారు. ఆయన విద్యా శాఖ ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో అల్పాహారం, మధ్యాహ్న భోజనం ఏర్పాట్లపై చర్చ జరిగింది. విద్యార్థులకు నాణ్యమైన బ్రేక్ ఫాస్ట్, లంచ్ అందించాలని ఆదేశించారు. సోలార్ కిచెన్లు ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించాలని అధికారులకు సూచించారు. బడ్జెట్ కేటాయింపుల్లో యంగ్ ఇండియా స్కూళ్లకు ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు.

# వికసిత్ భారత్ సాధనలో ప్రవాసీ భారతీయుల పాత్ర

**హైదరాబాద్ పెన్ పవర్:** 09 జనవరి 1915న ప్రవాసీ భారతీయుడైన మహాత్మాగాంధీ దక్షిణ ఆఫ్రికా నుంచి తిరిగి తన జన్మ భూమికి చేరిన రోజుకు గుర్తుగా ప్రతి ఏట 09 జనవరిన "ప్రవాసీ భారతీయుల దినోత్సవం లేదా ప్రవాసీ భారతీయ దివస్ లేదా నాన్-రెసిడెంట్ ఇండియన్స్ డే"గా 2003 నుంచి పాటించడం జరుతున్నది. ప్రవాసీ భారతీయుల నైపుణ్యాలు, మేధస్సు, శాస్త్రసాంకేతిక పరిజ్ఞానం, సంపదలను తమ జన్మభూమి అభివృద్ధికి వినియోగించడాన్ని ప్రోత్సహించడం, ప్రవాసాలను సాదరంగా ఆహ్వానించడం, భారత అభివృద్ధికి కృషి చేసిన ప్రవాసీలను సన్మానించడం లాంటి అంశాలను చర్చించే వేదికగా ప్రవాసీ భారతీయుల దినోత్సవం ఉపయోగపడుతున్నది. ప్రవాసీ భారతీయ దివస్ నేపథ్యంలో న్యూఢిల్లీలో విదేశాంగ మంత్రిత్వ శాఖ "వికసిత్ భారత్ సాధనకు ప్రవాసీ భారతీయుల పాత్ర" అనబడే ప్రత్యేక సదస్సును నిర్వహించడం కూడా కొనసాగుతున్నది. ప్రవాసీ భారతీయులతో పాటు భారతీయ మూలాలు కలిగిన వ్యక్తులు (పరసన్స్ ఆఫ్ ఇండియన్ ఆరిజిన్, పిఐఓ) కూడా భారత దేశంలో పెట్టుబడులు పెట్టి దేశాభివృద్ధికి చేయూతనివ్వడం నిరంతరం కొనసాగాలని ప్రభుత్వం, పౌర సమాజం కోరుకుంటున్నది. సంస్కృతులు, వాణిజ్యం, టెక్నాలజీ, ఇన్నొవేషన్, సృజన మెండుగా ఉన్న దేశభక్తి కలిగిన ప్రవాసీ భారతీయులు 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్య సాధనకు దోహదపడాలనే సదుద్దేశంతో ఎన్ఆర్ఐలను ప్రోత్సహిస్తూ రెడ్ కార్పెట్ ఆహ్వానం పలుకుతోంది. 2024 వివరాల ప్రకారం, 15 మిలియన్ల ప్రవాసీ భారతీయులు, మరో 20 మిలియన్ల భారత మూలాలు కలిగిన పిఐఓలు పలు అభివృద్ధి చెందిన దేశాల్లో స్థిరపడి ఉన్నారు. అత్యధిక ప్రవాసీ భారతీయులు కలిగిన దేశంగా అమెరికా ప్రసిద్ధిగాంచింది. అమెరికాలో 44.6 లక్షలు, యూఏఈలో 35 లక్షలు, మలేసియాలా 29.14 లక్షలు, కెనడాలో 28.76 లక్షలు, సౌథీ అరేబియాలా 24.64 లక్షల ప్రవాసీ భారతీయులు ఉన్నారని తెలుస్తున్నది. 'మేధో వలస' లేదా 'బ్రెయిన్ డ్రేయిన్' అనబడే పదాన్ని తొలిసారి యూకెలో 1960లో ప్రయోగించారు. నైపుణ్యం, ఉన్నత విద్య ప్రమాణాలు కలిగిన యువత ఉన్నత భవితకు తమ దేశాన్ని వదిలి అభివృద్ధి చెందిన దేశాలకు వలస పోవడాన్ని 'మేధో వలస లేదా హ్యూమన్ క్యాపిటల్ ఫ్లైట్' అని అంటున్నారు. అభివృద్ధి చెందుతున్న యువభారతం నుంచి ఆకర్షణీయ వేతనాలు, ఉద్యోగ అవకాశాలు, ఉన్నత ప్రమాణాలు కలిగిన యూనివర్సిటీల విద్యా బోధనలు, అత్యాధునిక శాస్త్ర సాంకేతిక పరిశోధనలకు అవకాశాలు, ఉత్తమ జీవనశైలి, సులభ వీసా విధానాలు, రూపాయి విలువ పతనం, రాజకీయ స్థిరత్వం లాంటి కారణాలతో భారత యువత లక్షల సంఖ్యలో ప్రతి ఏట అభివృద్ధి చెందిన దేశాలకు వలస పోవడం, అక్కడే స్థిరపడి ప్రవాసీ భారతీయులుగా మారడం జరుగుతోంది. ఉన్నత విద్యకు మాత్రమే కాకుండా నైపుణ్యం, సృజనశీల మేధస్సు కలిగిన వ్యక్తులు కూడా విదేశాలకు వెళ్లి అక్కడే స్థిరపడడం కూడా కొనసాగుతున్నాయి. భారత్‌లో విద్యా ప్రమాణాలు తగ్గడం, పరిశోధనాలయాల కొరత, నిరుద్యోగం, వేతన వ్యత్యాసాలు, రాజకీయ అస్థిరత్వం, జీవనశైలి ప్రమాణాలు తగ్గడం, ఆర్థిక అవకాశాలు మూతపడడం లాంటి కారణాలు కూడా యువత విదేశీ పయనాలకు దోహదపడుతున్నాయి. అమెరికాలో 12 శాతం శాస్త్రవేత్తలు, 38 శాతం వైద్యులు, 36 శాతం నాసా ఉద్యోగులు ప్రవాసీ భారతీయులే అని తెలిసి ఆశ్చర్యపోతున్నాం. అంతే కాకుండా మైక్రోసాఫ్ట్ ఉద్యోగుల్లో 34 శాతం, ఐబిఎంలో 28 శాతం, ఇంటెల్‌లో 17 శాతం, గూగుల్‌లో 12 శాతం ఉద్యోగులు ప్రవాసీ భారతీయులే అని తెలుసుకోవాలి. మేధో వలసలో ప్రథమ స్థానం భారత్ చేజిక్కించుకుంది. 2022 ఏడాదిలో 7.7 లక్షల యువత విద్య కోసం విదేశాలకు వెళు తున్నారు. 2024లో దాదాపు 1.8 మిలియన్ల భారతీయ యువత చదువుల నిమిత్తం విమానయానం చేసారని తెలుస్తున్నది. 2014 నుంచి నేటి వరకు 23,000 మిలియనీర్లు భారత్‌ను వదిలి విదేశాలకు వెళ్లి స్థిరపడ్డారు. మేధో వలసను తగ్గించడానికి మన యూనివర్సిటీ విద్యా ప్రమాణాలను అంతర్జాతీయ స్థాయి వరకు పెంచడం, తిరిగి వచ్చే ప్రవాసీ భారతీయులకు పన్ను రాయితీలను ఇవ్వడం, పేటెంట్ పొందే వారికి పన్నులు తగ్గించడం లాంటివని

కల్పించాలని సూచిస్తున్నారు. భారత దేశ అమూల్య వనరు అయిన మేధావులు, నైపుణ్యం కలిగిన టెక్నోక్రాట్లు, ప్రొఫెషనల్స్ దేశాన్ని వదిలి వెళ్లడం జన్మభూమికి తీవ్రమైన నష్టాన్ని కలిగిస్తున్నది. అదే విధంగా నిరంతరం మేధో వలస కొనసాగితే దేశ సామాజిక-ఆర్థిక సమగ్రాభివృద్ధికి తీవ్రమైన విఘాతం కలుగుతుందని తెలుసుకోవాలి. మేధో వలస వల్ల స్వదేశంలో ఇన్నొవేషన్, పరిశోధనలు, సుస్థిరాభివృద్ధి కుంటుపడుతుంది. మేధో వనరు వలస వల్ల దేశానికి కొంత ఆర్థిక చేయూత లభిస్తే అది కొంత వరకు ఊరటను ఇస్తుంది. ఒక మొక్కను నాటి, సకల పరిచర్యలు చేసి, నీరు పోసి, ఎరువు వేసి పెంచిన తర్వాత పండ్లు లభించే స్థాయిలో దానిని మరోకరు ఇవ్వడం ఎంత బాధను కలిగిస్తుందో అంతే నష్టాన్ని మేధో వలస కూడా జన్మభూమికి చేస్తుందని తెలుసుకోవాలి. మేధో వలస వల్ల అభివృద్ధి చెందిన దేశాలకుపెట్టుబడి పెట్టకుండానే 'రెడీ టు యూజ్ స్కిల్డ్ యూత్' ఉచితంగా లభిస్తున్నది.నేటి ప్రవాసీ భారతీయ దినం వేదిక భారత దేశానికి, ప్రవాసీ భారతీయులకు మధ్య వారధిగా నిలవాలని, ప్రవాసీ పౌర సమాజం తిరిగి తమ దేశంలో మేధోపరమైన, ఆర్థికపరమైన పెట్టుబడులు పెట్టి భారతాన్ని 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశాల జాబితాలోకి చేర్చడానికి తమ వంతు కృషి చేయాలని కోరుకుందాం. మన ప్రవాసీలను ప్రేమతో ఆలింగనం చేసుకుందాం.

# ఓటు బ్యాంకులుగా ప్రవాస భారతీయులు

**హైదరాబాద్ పెన్ పవర్:** ఒకనాడు ఉన్నత విద్య అనంతరం మోహన్ దాస్ కరమ్ చాంద్ గాంధీ దక్షిణా ఆఫ్రికా వెళ్లి న్యాయ వాద వృత్తి చెప్పట్టేలా చేసింది. 1893 లో దక్షిణాఫ్రికాకు వెళ్ళిన మహాత్మా గాంధీ, దేశం బానిస రాజుల చేతిలో మగ్గి పోతుంది అనే వాస్తవాన్ని గ్రహించి, 9 జనవరి 1915 న దక్షిణాఫ్రికా నుంచి భారత దేశానికి జాతిపిత మహాత్మాగాంధీ తిరిగి వచ్చిన దినం సందర్భంగా, మహాత్ముడు ప్రవాసీ నాయకుడే అనే భావనతో, ప్రవాస భారతీయుల దినోత్సవము జనవరి 9 న జరుపుకొన బడుతున్నది. భారతదేశ అభివృద్ధికి విదేశీ భారతీయ వర్గాల సహకారాన్ని గుర్తించడానికి భారతదేశపు రిపబ్లిక్ ద్వారా జనవరి 9 న ఏటా జరిగే వేడుక రోజు. ఎల్.ఎమ్. సింగ్వి నేతృత్వంలోని ఉన్నత స్థాయి కమిటీ జనవరి 2002 లో ఈ దినోత్సవాన్ని సిఫారసు చేసింది. 2003 నుండి ప్రతి సంవత్సరం జనవరి 9 న ప్రవాస భారతీయుల దినోత్సవాన్ని జరుపు తున్నారు. భారత ప్రభుత్వ విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ మరియు ఇండియన్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ సమాఖ్య, భారత పరిశ్రమల సమాఖ్య మరియు నార్త్ ఈస్టర్న్ రీజియన్ యొక్క అభివృద్ధి మంత్రిత్వ శాఖ చేత స్పాన్సర్ చేయబడింది. దేశం యావత్తు ప్రవాసీ భారతీయ దివస్ పేరిట ఎన్నో కార్యక్రమంలో నిర్వహిస్తూ వస్తున్నది భారత ప్రభుత్వం. వివిధ దేశాల్లో భారత సంతతి వారు అందరూ కలిసి దాదాపు 3కోట్ల వరకూ వివిధ దేశాల్లో స్థిరపడ్డారు. మాతృ దేశ అభివృద్ధికి ఎందరో దేశాభిమానంతో విశేష కృషి చేస్తున్నారు. నేడు భారత జాతి ప్రగతిలో ప్రవాస భారతీయుల భాగస్వామ్యం చిరస్మరణీయం. ప్రవాస భారతీయుల దినోత్సవం సందర్భంగా వివిధ రంగాల్లో ప్రశంసనీయమైన కృషి చేసిన ప్రవాస భారతీయులకు భారతదేశ వృద్ధిలో ప్రవాసి భారతీయుల పాత్రను అభినందించడానికి, వారిలో అసాధారణమైన యోగ్యత కలిగిన వ్యక్తులకు, భారత రాష్ట్రపతి ప్రతిష్టాత్మక ప్రవాసీ భారతీయ సమ్మాన్ పురస్కా రాలను ప్రతి సంవత్సరం అందజేస్తారు. మానవ జాతి పరిణామ క్రమంలో వలస ఒక ముఖ్యమైన మార్గం, విశ్వ వ్యాపితంగా నా భారతావని అనే స్వామి వివేకానందుల మాటలను నిజం చేస్తూ భారతీయ మూలాలు లేని మనుషులు లేరు. ఈ దేశంలో అని ప్రపంచ దేశాల్లో ఒక్క దేశాన్ని కూడా చూపించ లేము. భారతీయుల మేధాశక్తి ఒక దశలో వలస పోయింది అనకుండ మేధో వలస అనే పరిస్థితి వచ్చింది. చదువు మేధా సంపత్తి వైట్ కాలర్ ఉద్యో గాల పేరిట యూరోప్ వైపు వల సలు జరిగితే, అపార కండర బలం ఉండి శ్రామికులుగా గల్ఫ్ దేశాలకు నిరక్షరాసులైన కార్మిక వర్గం విస్తృత స్థాయిలో వలసలు జరిగాయి. వలసల ప్రక్రియ భారత జాతి వికాసానికి గణనీయమైన బాటలు పరిచింది. వ్యక్తి గత అభివృద్ధితో పాటు దేశాభివృద్ధి శరవేగంగా జరగడం ప్రారంభ మైంది. 90వ దశకంలో వచ్చిన ఆర్థిక సరళీకరణ, ప్రపంచీ కరణ విధానాలు కూడా కొంత అభివృధికి దోహద పడ్డాయి. ఈ వలసలకు అభివృద్ధికి గల ప్రముఖమైన సంబంధాన్ని కాదనలేము, విస్మరించలేము. కానీ ఈ ప్రవాసీ భారతీయ దివస్ బడా పారిశ్రామిక వేత్తల పెట్టుబడిని ఆహ్వానించే ఒక సంపన్నుల కార్య స్థలంగా రూపు దిద్దు కొన్నదే కానీ, శ్రమ జీవులను ఒక్క తాటికి తీసుకొచ్చె శ్రమైక జీవన సౌందర్యాన్ని ఒక వేదికపై ఆవిష్కరించ లేక పోయింది. ఈ వలసలను విస్తృత కోణంలో అర్థం చేసుకో గలిగితే ప్రతి ఒక్కరి ప్రయోజనాలు నెరవేరుతాయి, సమిష్టి ప్రయోజనాలు మెరుగు పడుతాయి. ఒక వైపు ప్రపంచం ఒక కుగ్రామం అయినా నేడు సంపన్న పాశ్చాత్య దేశాల భారతీయుల సేవలు ఇంకా అవసరమైన దేశాలు స్థిర నివాసం ఏర్పరుచు కొనుట కోసం ఎన్నో రాయితీ ప్రయోజనాలు వలస మార్గాలను సులభతరం చేశాయి. అనేక దేశాలలో ప్రవాస భారతీ యులు అక్కడి దేశపు చట్ట సభల్లో ప్రముఖమైన స్థానాల్ని కైవసం చేసు కుంటున్నారు. మరో వైపు ఈ గల్ఫ్ దేశాలకు పెద్ద సంఖ్యలో మన దేశం నుండి కార్మికుల వలసలు 1970 నుండి మొదలై, నేటికీ కొనసాగు తున్నాయి. వీరి ఆర్జన మొత్తం ఈ దేశానికి పంపుతున్న... ఆర్థిక సైనికులైన గల్ఫ్ వలస కార్మికుల వలస జీవితాల్లో గణనీయమైన మార్పు రావాల్సి ఉంది. కార్మికులుగా వలస వెళ్లిన వీరు తిరిగి కుటుంబాన్ని కలవాలి అంటే అది ఒక గొప్ప విజయమే, ఇట్టి కార్మికులు గల్ఫ్ నుండి 48 డిగ్రీల పై ఉండే అధిక ఉష్ణోగ్రతలో తమ రక్తాన్ని చెమట చుక్కలుగా, ఆపై విదేశీ మారకంగా మార్చి పంపుతున్న క్రమంలో, విదేశీ మారకంతో క్రూడాయిల్, పెట్రోల్ వంటివి కొనడానికి ఉపయోగ పడుతున్నాయి. కార్మికుడిగా వెళ్లి ఎన్నో వ్యాపారాల్లో ఉన్నత స్థాయి అందుకున్న మన భారతీయ గల్ఫ్ ప్రవాసీలు, ప్రవాసీ భారతీయ దివస్ లో ప్రవాసీ సమ్మాన్ అవార్డు అందుకోలేక పోతున్న అంశమే బాధాకరం. టాక్స్‌ల రూపంలో అందుకుంటున్న ప్రభుత్వాలు, వారి దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి విధాన పరమైన నిర్ణయాలు తీసుకున్న దాఖలాలే లేక పోగా... వారిని ఓటు బ్యాంక్ గా మార్చు కుంటూ, ఆచరణకు నోచులోని హామీలతో కాలం వెళ్లదీవడం అత్యంత శోచనీయం. గల్ఫ్ వలస కార్మికులకు కనీస ప్రాతినిధ్యం లేని, ప్రవాసీ భారతీయ దివస్ ను "మజ్దూర్ ప్రవాసీ భారతీయ దివస్" గా మార్చాలని దశాబ్దానికి పైగా ప్రవాసుల సంక్షేమ వేదిక అధ్యక్షులు మంద భీం రెడ్డి నిరంతరం కార్మికుల హక్కులకోసం అవిశ్రాంతంగా పోరాడుతూనే ఉన్నారు. కార్మికుల జీవిత భీమా, ఆరోగ్య సంరక్షణ, మృత ధన సహాయం, పునరావాసం పునరేకీకరణ, నైపుణ్యంతో తిరిగి వచ్చిన కార్మికులకు తోడ్పాటు, ప్రధానంగా గల్ఫ్ వర్కర్స్ వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని, అప్పుడే ప్రవాసీ ల కృషికి గుర్తింపు ఇచ్చి నట్లు అవుతుందని ప్రవాసీ లేబర్ యూనియన్ అధ్యక్షులు స్వదేశ్ పరికి పండ్ల అభిప్రాయ పడు తున్నారు.

# మున్సిపల్ ఎన్నికలకు ఇంకా ఆలస్యం...

**విజయవాడ, జనవరి 8, పెన్ పవర్:**
తెలంగాణలో సర్పంచ్ ఎన్నికలు ముగిశాయి. మున్సిపల్ ఎన్నికలకు అంతా రెడీ అవుతోంది. ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు కసరత్తు జరుగుతోంది. ఇదే టైమ్‌లో ఏపీలో కూడా లోకల్ బాడీ, మున్సిపల్ ఎలక్షన్స్‌కు వేగంగా అడుగులు పడ్డాయి. ఈ జనవరిలోనే స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లేందుకు స్టేట్ ఈజీ సిద్ధమైంది.వార్డుల విభజన, ఓటర్ల జాబితా తయారీ స్పీడప్ చేసింది. కూటమి పార్టీలు కూడా ఎన్నికల వ్యూహాల్లో బిజీగా అయిపోయాయి. కట్ చేస్తే ఏపీలో లోకల్ బాడీ ఎన్నికలు, మున్సిపల్ పోల్స్ ఇప్పట్లో జరిగే పరిస్థితి లేదన్న టాక్ బయలుదేరింది. ఏపీలో ప్రస్తుత సర్పంచుల పదవీకాలం ఏప్రిల్‌లో ముగుస్తుంది.మార్చిలో కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లో కార్పొరేటర్లు, కౌన్సిలర్ల పదవీకాలం ముగియనుంది. కానీ అంతలోపే జనగణన స్టార్ట్ అవుతుంది. దీంతో పంచాయితీల విలీనం, విభజన..సేమ్‌టైమ్ మున్సిపాలిటీల విలీనం, విభజనకు అవకాశం లేకుండా పోతోంది. దీంతో ఏపీలో మున్సిపల్ ఎన్నికలు ఆలస్యం అవుతాయని అంటున్నారు.లేటెస్ట్ డెవలప్‌మెంట్ ప్రకారం జనగణన తర్వాతే ఏపీలో మున్సిపల్ ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోందట. మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ కూడా మున్సిపల్ ఎన్నికలపై స్పష్టత ఇచ్చేశారు. ఈ ఏడాది కేంద్రం జనగణన నిర్వహిస్తోంది. ఈ ప్రాసెస్ అంతా పూర్తి కావడానికి కనీసం ఆరు ఏడు నెలలు పడుతుందట.జనగణన మొత్తం పూర్తి అయి.. ఓ క్లారిటీ రావాలంటే ఏడాది సమయం పక్కా పడుతుందని..2026 డిసెంబర్ వరకు జనగణన మొత్తం పూర్తవుతుందని భావిస్తున్నారట. దాంతో జనగణన కంప్లీట్ అయ్యాకే ఆ వివరాలు అన్నీ చూసుకుని కొత్త డేటా ప్రకారం ఎన్నికలు పెట్టాలనేది కూటమి ప్రభుత్వం ఆలోచనగా చెబుతున్నారు. 2027 స్టార్టింగ్‌లో లోకల్ బాడీస్, ఆ తర్వాత మున్సిపల్ ఎన్నికలకు వెళ్లాలనే ఆలోచనలో ఉందట ఏపీ సర్కార్.ప్రస్తుతం ప్రభుత్వం దగ్గర 2011 జనాభా లెక్కల వివరాలే ఉన్నాయి. ఆ తర్వాత అయితే




2021లో కరోనా కారణంగా జనగణన జరగలేదు. ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం జనగణనను చేయాలని డిసైడ్ అయింది. దీంతో ఏపీలో ఎన్నికలు వాయిదా పడతాయని అంటున్నారు. కొత్త లెక్కలతో సామాజిక సమీకరణలు కూడా చూసుకుని పూర్తి సమాచారంతో అన్ని వర్గాలకు న్యాయం చేసేలా రిజర్వేషన్ కూర్పు చేస్తారని చర్చ జరుగుతోంది.ఇక మార్చితో మునిసిపాలిటీలు, కార్పొరేషన్ల పాలక వర్గం గడువు ముగుస్తుంది. దాంతో పాలక మండళ్లు రద్దు అవుతాయి. అయితే తొమ్మిది నెలల నుంచి ఏడాది దాకా ప్రత్యేక అధికారుల పర్యవేక్షణలోనే లోకల్ బాడీస్ పాలన సాగుతుందని అంటున్నారు. ఇక విజయవాడని గ్రేటర్‌గా మార్చాలనే ప్రతిపాదన ఉందట. తిరుపతి కార్పొరేషన్‌ను కూడా గ్రేటర్‌గా చేసే ఆలోచన ఉందంటున్నారు.ఈ డిమాండ్లపై కూడా జనగణన లెక్కలు వచ్చాక.. 2027లోనే ఓ అంచనాకు వస్తారని అంటున్నారు. ఫైనల్‌గా ఈ ఏడాదిలో మున్సిపల్ ఎన్నికలు అయితే ఉండవంటున్నారు. దాంతో ఇటు కూటమి పార్టీలకు..ఇటు వైసీపీకి స్థానిక వ్యూహాలు రచించేందుకు ఇంకో ఏడాది టైమ్ దొరికినట్లు అయింది.మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి జనగణన తరువాత ఉంటుందని సంకేతాలు ఇచ్చారు. దీంతో ఏపీలో స్థానిక సంస్థల ఎన్నికలు ఈ ఏడాది జరిగే అవకాశం లేదని ప్రచారం మొదలైంది. 2027 ప్రథమార్థంలో జరుగుతాయని టాక్ నడుస్తోంది. కొద్దిరోజుల కిందట రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి నీలం సాహ్ని స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి సన్నాహాలు ప్రారంభించారు. కానీ ఇప్పుడు జనగణన తెరపైకి రావడంతో.. అది పూర్తయిన తర్వాతే ఎన్నికలు అని స్పష్టమవుతోంది.

లి 2021లో స్థానిక సంస్థల ఎన్నికలు జరిగాయి. ముందుగా పంచాయితీ ఎన్నికలు జరగగా.. తరువాత మున్సిపల్ ఎన్నికలు జరిగాయి. చివరిగా మండల, జిల్లా ప్రాదేశికాలకు సంబంధించి ఎన్నికలు నిర్వహించారు.లి పంచాయితీ ఎన్నికలకు సంబంధించి ఫిబ్రవరితో గడువు ముగియనుంది. అయితే ముందుగా పంచాయతీ ఎన్నికలు నిర్వహించి.. తరువాత మిగతా ఎన్నికలు పూర్తి చేయాలని భావిస్తోంది ప్రభుత్వం.లి మార్చి వరకు మున్సిపాలిటీలతోపాటు కార్పొరేషన్లకు గడువు ఉంది. జిల్లా పరిషత్తులకు అయితే జూన్ వరకు గడువు ఉంది.లి ఏప్రిల్ నుంచి జనగణన ప్రారంభం కానుంది. అది కొలిక్కి రావాలంటే ఈ ఏడాది డిసెంబర్ పడుతుంది. అందుకే కొత్త జనాభా లెక్కల ప్రకారం ఎన్నికలు నిర్వహించాలి అనుకుంటే 2027 వరకు ఆగాల్సిందే.

లి ప్రస్తుత జనాభా లెక్కలు 2011 వరకు మాత్రమే ఉన్నాయి.. ప్రతి పది సంవత్సరాలకు జరగాల్సిన జనగణన 2021లో కరోనా కారణంగా జరగలేదు. అందుకే ఇప్పుడు జనగణన పూర్తి చేసే పనిలో ఉంది కేంద్ర ప్రభుత్వం. ఒకవేళ పాత జనాభా లెక్కల ప్రకారం ఎన్నికలకు నిర్వహించాలి అంటే ముందుగా పంచాయతీలను పూర్తి చేస్తారు.లి అయితే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించకపోతే కేంద్ర ఆర్థిక సంఘం నిధులతో పాటు ప్రత్యేక నిధులు వర్తించవు. అదే జరిగితే గ్రామాల్లో మౌలిక వసతులు నిలిచిపోతాయి. అది ప్రభుత్వానికి ఇబ్బంది కరం. అందుకే ఎంత మాత్రం ఎన్నికలు నిర్వహించేందుకే ప్రభుత్వం మొగ్గు చూపుతోందని తెలుస్తోంది.

## కృత్రిమ జన్యువు సృష్టి కర్త ఖొరానా

**హైదరాబాద్ పెన్ పవర్:** కృత్రిమ జన్యువును నిర్మించిన శాస్త్రవేత్తగా హరగోవింద్ ఖొరానా ఆధునిక జీవశాస్త్రములో ఒక విప్లవానికి తెర లేపాడు. ప్రతి అమినో ఆమ్లపు నిర్మాణ క్రమము మూడు న్యూక్లియోటైడ్ల అమరికతో జన్యువులలో పొందుపరచడి ఉన్నదని కనుగొన్న జీవ శాస్త్ర వేత్త హర గోవింద ఖొరానా. వరుసగా ఉన్న కృత్రిమ జీన్ (డిఎన్ఏ) ముక్కను ప్రయోగశాలలో మొదటిసారిగా సృష్టించడం ద్వారా ఎన్నో పరిశోధనలకు బాట వేశాడు. ఖొరానా నూతన ఆవిష్కరణ జెనెటిక్ ఇంజనీరింగ్ అనే నూతన శాస్త్ర అధ్యయనానికి దారి తీసింది. ప్రయోగశాలలో డీఎన్ఏ (డీ ఆక్సీ రైబో న్యూక్లిక్ ఆమ్లం) సంశ్లేషణ చేయగల్గిన మొట్టమొదటి శాస్త్రజ్ఞుడిగా హరగోవింద్ ఖొరానా పేరుపొందాడు. అత్యంత ప్రతిష్ఠాత్మకమైన నోబెల్ పురస్కార గ్రహీతలలో సర్. సి.వి.రామన్ తదనంతరం పేర్కొనదగిన శాస్త్రవేత్త హరగోవింద్ ఖొరానా. పంజాబ్ (ఇప్పుడు పాకిస్తాన్) లో ఓ గ్రామంలోని ఏకైక అక్షరాస్యత కుటుంబంలో జన్మించి, చదవడం, వ్రాయడం తన తండ్రి ద్వారా నేర్చుకుని, నోబెల్ బహుమతి గ్రహీతగా... కృత్రిమ జన్యువును నిర్మించిన మొదటి వ్యక్తిగా ఎదిగాడు హరగోవింద్ ఖొరానా. హరగోవింద్ ఖొరానా (9 జనవరి 1922- 9 నవంబర్ 2011) భారతీయ సంతతికి చెందిన, నోబెల్ బహుమతి పొందిన ప్రఖ్యాత జీవ శాస్త్రజ్ఞుడు. 1922 జనవరి 9న అవిభక్త భారత దేశములోని పంజాబ్ రాష్ట్రమునకు చెందిన రాయపూరు అనే గ్రామములో జన్మించాడు (ప్రస్తుతం పాకిస్తాన్లో ఉన్నది). తండ్రి పన్నులు వసూలు చేసే గ్రామ పట్వారి. అయిదుగురి సంతానములో చివరి వాడు. తొలుత తండ్రి శిక్షణలోను, తదుపరి ముల్తాన్ లో చిన్నతనం నుండే సైన్స్ పట్ల ఆకర్షితుడైన హర్ గోవింద్ చెట్టు కింద గుమిగూడిన ముల్తాన్ లోని దయానంద్ ఆర్య విద్యా ఉన్నత పాఠశాల నుండి తన పాఠశాల విద్యను పూర్తి చేశాడు. పంజాబ్ విశ్వ విద్యాలయము, లాహోర్ (ప్రస్తుతం పాకిస్తాన్) 1943 లో బీ.ఎస్సీ 1945లో ఎం.ఎస్సీ పట్టాలు పొందాడు. లివర్ పూల్ విశ్వ విద్యాలయములో 1945 నుండి 1948 వరకు శాస్త్ర పరిశోధనలు చేసి పీ.హెచ్.డీ పట్టా పొందాడు. సేంద్రీయ కెమిస్ట్రీలో డాక్టరేట్ పొందిన తరువాత, ప్రొఫెసర్ వ్లాదిమిర్ ప్రిలాగ్‌తో కలిసి తదుపరి రెండు సంవత్సరములు పని చేయడానికి జూరిచ్ వెళ్లాడు. వ్లాదిమిర్ ఒక గురువుగా వ్యవహరించాడు. సైన్స్ పట్ల తనకున్న ప్రేమను హరగోవింద్ ఖొరానా మరింత పెంచుకున్నాడు. 1951-52లో విశ్వవిఖ్యాత కేంబ్రిడ్జ్ విశ్వ విద్యాలయములో మాంసకృత్తులు, న్యూక్లిక్ ఆమ్లములకు సంధించిన పరిశోధన మొదలు పెట్టాడు. 1952లో కెనడా లోని బ్రిటిష్ కొలంబియా (వ్యంకూవర్) విశ్వ విద్యాలములో చేరాడు. అక్కడ అతను తన ఆఔం పరిశోధనను ప్రారంభించాడు. అటు పిమ్మట 1960 లో అమెరికా లోని విస్కాన్సిన్ విశ్వ విద్యాలయములో (మెడిసన్) ఆచార్యునిగా చేరాడు. 1966 లో అమెరికన్ పౌరసత్వం పొందాడు. 1970లో ప్రతిష్ఠాత్మకమైన మశాచుసెట్స్ సాంకేతిక సంస్థలో రసాయన శాస్త్ర ఆచార్యునిగా చేరాడు. 2007లో పదవీ విరమణ చేశాడు. అప్పటి నుండి గౌరవ ఆచార్యునిగా పరిశోధనలు సాగించాడు. జీవ శాస్త్రవేత్తలు ఎప్పటినుండో ఎదుర్కొంటున్న ప్రశ్న-ప్రయోగ శాలలో జీవాన్ని కృత్రిమంగా సృష్టించడం సాధ్యమేనా? ఈ దిశలో వంశ పారంపర్యముగా సంక్రమించు జీవ నిర్మాణానికి దోహదం చేసే "కృత్రిమ జీన్"ను సృష్టించ గలిగాడు. ఈ ఆవిష్కరణ జెనెటిక్ ఇంజనీరింగ్ (ఉవనివబితిఇ ఇనిణతినివవతీతినిణ) అనే నూతన శాస్త్ర అధ్యయనానికి దారి తీసింది. జన్యువులలోని కోడ్‌లను సమగ్రంగా వివరించ గలగడం తో, జన్యువులలో తగు విధంగా మార్పులు చేయటం, జీవరాశులలో జన్యు మార్పిడి విధానాల ద్వారా జన్యువులలో అవాంఛిత లక్షణాలు తొలగించటం, అవసరమైనచోట్ల జన్యు మార్పిడి చేయగలగటం వంటి ఎన్నో విధానాలు అమలులోకి వచ్చాయి. ఖొరానా చేసిన ఈ పరిశోధనల ఫలితంగా ఈ రంగం 'బయో టెక్నాలజీ' అనే ప్రత్యేకమైన శాస్త్ర విభాగంగా ఏర్పడింది. ప్రతి అమినో ఆమ్లపు నిర్మాణ క్రమము మూడు న్యూక్లియోటైడ్ల అమరికతో జన్యువులలో పొందు పరచడి ఉన్నదని ఖొరానా కనుక్కొన్నాడు. వరుసగా ఉన్న కృత్రిమ జీన్ (డీఎన్ఏ ) ముక్కను ప్రయోగశాలలో మొదటిసారిగా సృష్టించాడు. డీఎన్ఏ ముక్కలను అతికించు డీఎన్ఏ లిగసే అనబడు ఎంజైమును కనుగొన్నాడు.ఈ పరిశోధనల మూలముగా ఆధునిక జీవశాస్త్రములో ఒక విప్లవము వచ్చింది. 1968లో వైద్య శాస్త్రములో నోబెల్ బహుమతి లభించింది. రాబర్ట్ హోలీ, మార్షల్ నైరెన్‌బర్గ్‌లతో కలిసి అందుకున్నాడు. గైరిందర్ ఫౌండేషన్ ఇంటర్నేషనల్ అవార్డు, లూయిసా స్థూల హోర్విట్జ్ బహుమతి, ప్రాథమిక మెడికల్ రీసెర్చ్ ఆల్బర్ట్ లస్కెర్ అవార్డు, విల్లార్డ్ గిబ్స్ అవార్డు, పద్మవిభూషణ్ అవార్డులను అందుకున్నాడు. 1968లో ఫిజియాలజీ/మెడిసిన్‌లో కణాల జన్యు సంకేతాన్ని కలిగి ఉన్న న్యూక్లియిక్ ఆమ్లాలలో న్యూక్లియోటైడ్ల క్రమం, కణాల ప్రోటీన్ల సంశ్లేషణను ఎలా నియంత్రిస్తుందో చూపించే పరిశోధన కోసం మార్షల్ డబ్ల్యూ. నైరెన్‌బర్గ్ మరియు రాబర్ట్ డబ్ల్యూ హోలీలతో కలిసి ఖొరానా నోబెల్ పురస్కారం పంచుకున్నాడు. నోబెల్ బహుమతి పొందిన తరువాత ఒక సందర్భంలో, డాక్టర్ ఖొరానా ఇలా వ్రాశాడు: 'పేదవాడు అయినప్పటికీ, నా తండ్రి తన పిల్లలకు విద్యను అందించడానికి జీవితాన్ని అంకితమిచ్చాడు. సుమారు 100 మంది నివసించే గ్రామంలో ఏకైక అక్షరాస్యత కుటుంబం మేము.' అర్థ శతాబ్దానికి పైగా, డాక్టర్ ఖొరానా - వేలాది మంది విద్యార్థులకు శాస్త్రీయ విద్యను అందించడం ద్వారా, మానవ జ్ఞాన రంగాలను అభివృద్ధి చేయడం ద్వారా తన తండ్రి వారసత్వాన్ని కొనసాగించాడు. ఖొరానా నవంబర్ 9, 2011 న కంకార్డ్, మసాచుసెట్స్ లో 89వ ఏట సహజ మరణము చెందాడు.

## కేతిరెడ్డి ఆన్ ఫైర్...

**అనంతపురం, జనవరి 8, పెన్ పవర్:** ధర్మవరం రాజకీయం మరింత వేడెక్కనుంది. త్వరలోనే మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి ప్రజల్లోకి వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. త్వరలోనే మళ్లీ గుడ్ మార్నింగ్ ధర్మవరం కార్యక్రమాన్ని కేతిరెడ్డి మొదలుపెట్టనున్నారు. దాదాపు రెండేళ్ల విరామం తర్వాత తిరిగి ధర్మవరంలో ఆయన తన పట్టును నిలుపుకునేందుకు ప్రయత్నాలు ప్రారంభిస్తున్నారు. కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డిపై గతంలో అధికారలో ఉన్నప్పుడు కబ్జా ఆరోపణలు చేసినప్పటికీ వాటిని అధికారంలోకి వచ్చిన రెండేళ్లలో నిరూపించలేకపోయారని కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి అంటున్నారు. నిజానికి గత ఎన్నికల్లో తన ఓటమిని కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి తట్టుకోలేకపోయారు. నిత్యం ప్రజల్లో ఉంటూ వారి అవసరాలు, సమస్యలను వెంటనే పరిష్కరించే తనను ఓడించారంటే తాను ఇప్పటికీ నమ్మలేకపోతున్నానంటున్నారు.అందుకే పార్టీ అధికారంలో కోల్పోయిన తర్వాత కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి ఒకానొక దశలో వైసీపీ అధినేత జగన్ పై విమర్శలు చేయడానికి కూడా వెనుకాడలేదు. మద్యం విషయంలో తమ ప్రభుత్వం విఫలమయిందన్నారు. ముఖ్యమంత్రిని కలిసేందుకు కూడా తమకు అవకాశం లేదని చెప్పారు. సీఎంవోలో ధనుంజయ్ రెడ్డి వ్యవహార శైలిపై కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి నాడు ధ్వజమెత్తారు. తాను ఉన్నది ఉన్నట్లు మాట్లాడతానని, తాను వైసీపీలోనే కొనసాగుతానని తర్వాత కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి వివరణ ఇచ్చారు. జగన్ కూడా అధికారంలోకి వచ్చిన తర్వాత కార్యకర్తలను మర్చిపోవడం, వాలంటీర్లనే సర్వస్వంగా భావించడం ఈ దుస్థితికికారణమని కూడా కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి అన్నారు.అలాంటి కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి తిరిగి యాక్టివ్ అవుతున్నారు. కేతిరెడ్డి ఒకసారి కాంగ్రెస్ నుంచి మరొక సారి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి గెలిచారు. రెండు సార్లు ఓటమి పాలయ్యారు. అయితే 2024 ఎన్నికల్లో ఓటమికి తాను కారణం కాదన్న ధోరణి ఆయనలో స్పష్టంగా ఇప్పటికీ కనిపిస్తుంది. తన నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధితో పాటు ప్రజలతో తాను మమేకమైన తీరు ఓటమి అసాధ్యమన్న భావనలోనే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి ఉన్నారు. అందుకే మరొకసారి గుడ్ మార్నింగ్ ధర్మవరం కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు సిద్ధమవుతున్నారు. ఎన్నికలకు మూడేళ్ల ముందే ధర్మవరంలో తిరిగి గెలుపొంది తనపై వచ్చిన విమర్శలకు చెక్ పెట్టాలన్న యోచనలో కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి ఉన్నట్లు కనపడుతుంది.

## గ్రౌండ్ లెవెల్ లో ఏం జరుగుతుందో తెలుసా

**విజయవాడ, జనవరి 8, పెన్ పవర్:** కూటమి ప్రభుత్వం ఏర్పాటయిన తర్వాత గ్రౌండ్ లెవెల్ రియాలిటీని చంద్రబాబుకు చేరకుండా కొందరు అడ్డుపడుతున్నారన్నవిమర్శలున్నాయి. తెలుగుదేశం పార్టీలో క్షేత్రస్థాయిలో ఏం జరుగుతుందన్నది పార్టీ నాయకత్వానికి తెలియడం లేదా అంటే లేదనే సీనియర్ నేతలు అంటున్నారు. క్షేత్ర స్థాయిలో బూత్ స్థాయిలో నియమించి నెలవారీ జీతాలు చెల్లించి పెట్టుకున్న వారు సయితం పెద్దగా యాక్టివ్ గా లేరని సాక్షాత్తూ గోరంట్ల బుచ్చయ్య చౌదరి చెప్పడం పార్టీలో చర్చనీయాంశమైంది. చంద్రబాబు నాయుడు, లోకేశ్ లు కేవలం కేంద్ర రాష్ట్ర పార్టీ కార్యాలయంలోని మూడో అంతస్తు నుంచి వచ్చే నివేదికలను చూసి సంబపరపడుతున్నారని, కానీ గ్రౌండ్ లెవెల్లో జరుగుతున్న విషయాన్ని తెలుసుకోలేకపోతున్నారని కొందరు తెలుగుదేశం పార్టీ కార్యకర్తలే సోషల్ మీడియా వేదికగా బయటపెడుతున్నారు.దీంతో పాటు అధికారులు తీసుకుంటున్నారో.. లేక మంత్రుల నిర్ణయమో తెలియదు కానీ.. వైసీపీ నేతలకు, కాంట్రాక్టర్లకు పనులు బాగా ఈ కూటమి ప్రభుత్వంలో అవుతున్నాయన్న ఆవేదన కూడా కార్యకర్తల్లోనూ, నేతల్లోనూ ఉంది. ఆ విషయం కూడా తెలుగుదేశం పార్టీ అనుకూల మీడియాలో పుంఖాను పుంఖాలుగా కథనాలు వస్తున్నాయి. వైసీపీ ప్రభుత్వ హయాంలో పనిచేసిన కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లిస్తూ ఇప్పుడు టీడీపీ హయాంలో చేసిన పనులకు కాంట్రాక్టర్లకు చెల్లించకపోవడాన్ని వారు అభ్యంతరం చెబుతున్నారు. అసలు ప్రభుత్వంలో ఏం జరుగుతుందన్నది చంద్రబాబుకు తెలిసి జరుగుతుందా? లేక తెలియక జరుగుతుందా? అని నెట్టింట్లో కార్యకర్తలు ప్రశ్నిస్తున్నారు.ఇక తాజాగా తిరుమల వైకుంఠ ద్వార దర్శనాలకు తిరుమలకు వచ్చినప్పుడు వైసీపీ నేతలకు టీటీడీ అధికారులు ప్రత్యేక దర్శనాలు చేయించడం కూడా సోషల్ మీడియా వేదికగా కార్యకర్తలు ఫైర్ అవుతున్నారు. అసలు ప్రభుత్వంలో ఏం జరుగుతుంది? రాష్ట్రంలో జరుగుతున్న వాస్తవాలు చంద్రబాబు, లోకేశ్ కు చేరకుండా ఎవరైనా అడ్డుపడుతున్నారా?అన్న అనుమానాలను కూడా వ్యక్తం చేస్తున్నారు. చంద్రబాబు, లోకేశ్ లు క్యాడర్ కోసం, పార్టీ కోసం కష్టపడిన వారి కోసం నిచేస్తామంటుంటే అందుకు విరుద్ధంగా పనులు జరుగుతుండటం పట్ల కార్యకర్తలు, నేతల్లో అసంతృప్తి వ్యక్మవుతుంది.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001
and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965

# రష్యా వాణిజ్య భాగస్వామ్య దేశాలపై టారిఫ్‌లకు ట్రంప్ గ్రీన్ సిగ్నల్

**హైదరాబాద్ పెన్ పవర్:** అమెరికా అధ్యక్షుడు ట్రంప్ రష్యాపై బెదిరింపులకు దిగారు. రష్యా వాణిజ్య భాగస్వామ్య దేశాలపై టారిఫ్‌లను విధించేందుకు సిద్ధమయ్యారు. ద్వైపాక్షిక రష్యా ఆంక్షల బిల్లుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు రిపబ్లికన్ సెనెటర్ లిండ్సే గ్రాహం పేర్కొన్నారు. రష్యా చమురు కొనుగోలు చేసినందుకు వాణిజ్య భాగస్వాములైన భారత్, చైనా, బ్రెజిల్‌లపై జరిమానా విధించేందుకు ఈ బిల్లును వినియోగించనున్నారు. గ్రాహం-బ్లూమెంటల్ బిల్లు ఆమోదం పొందితే, రష్యా చమురు లేదా యురేనియంను కొనుగోలు చేస్తున్న దేశాలపై 500శాతం వరకు సుంకాలు విధించడానికి అధ్యక్షుడికి అనుమతి లభిస్తుంది. బుధవారం వైట్‌హౌస్‌లో అధ్యక్షుడు ట్రంప్‌తో సమావేశమయ్యానని గ్రాహం పేర్కొన్నారు. ఈ సందర్భంగా ట్రంప్ నెలల తరబడి చర్చిస్తున్న బిల్లుకు తన మద్దతు తెలిపారని అన్నారు. వైట్‌హౌస్ సీనియర్ అధికారి ఒకరు మీడియాతో మాట్లాడుతూ.. ఈ అంశాన్ని ధృవీకరించారు. వచ్చే వారం ప్రారంభంలో ఓటింగ్ జరగవచ్చని గ్రాహం అన్నారు. ఈ బిల్లుని హౌస్ ఆమోదిస్తే, ప్రస్తుతం పరిశీలిస్తున్న స్కేల్-బ్యాక్డ్ ప్రభుత్వ నిధుల ప్యాకేజీని వచ్చే వారం సెనెట్ చేపట్టనుంది. గ్రాహం మరియు డెమోక్రటిక్ సెనెటర్ రిచర్డ్ బ్లూమెంటల్ ప్రధానంగా ఈ బిల్లును రూపొందించారు. రష్యా చమురు, గ్యాస్, యురేనియం మరియు ఇతర ఎగుమతులను కొనుగోలు చేసే దేశాలపై 500శాతం వరకు సుంకాలు మరియు ద్వితీయ ఆంక్షలను విధించేందుకు ట్రంప్‌యంత్రాంగాన్ని అనుమతిస్తుంది. అంటే రష్యాపై ఆర్థికంగా ఒత్తిడి విధించేందుకు రూపొందించింది. గతంలో ఈ బిల్లులో కొన్ని సవరణలు చేపట్టాలని వైట్‌హౌస్ సూచించింది.

# ఉక్రెయిన్‌కు పటిష్టమైన భద్రత



**హైదరాబాద్ పెన్ పవర్:** రష్యాతో కాల్పుల విరమణ ఒప్పందానికి అంగీకరిస్తే ఉక్రెయిన్‌కు పటిష్టమైన భద్రత కల్పిస్తామని అమెరికా, దాని మిత్రదేశాలు హామీ ఇచ్చాయి. ఉక్రెయిన్‌లో శాంతి కోసం ఫ్రాన్స్ రాజధాని పారిస్ వేదికగా జరిగిన సమావేశంలో ఈ హామీని ఇచ్చాయి. కాల్పుల విమరణ ఒప్పందం అమల్లోకి వచ్చిన వెంటనే ఉక్రెయిన్‌కు తమ దళాలను తరలిస్తామని స్పష్టం చేశాయి. ఈ సమావేశంలో ఉక్రెయిన్ అధ్యక్షులు జెలెన్‌స్కీ, ఫ్రాన్స్ అధ్యక్షులు మాక్రాన్, బ్రిటన్ అధ్యక్షులు కెయిర్ స్టార్మర్, జర్మనీ ఛాన్సలర్ ఫ్రెడ్రిక్ మెర్జ్, అమెరికా ప్రతినిధి బృందం పాల్గొన్నారు. అమెరికా బృందంలో ట్రంప్ అల్లుడు జారెడ్ కుష్నర్ కీలక సభ్యుడుగా ఉన్నారు. ఉక్రెయిన్ భద్రతకు అమెరికా కూడా హామీ ఇచ్చింది. రష్యాతో శాంతి ఒప్పందం కుదిరితే ఉక్రెయిన్‌కు భద్రతా దళాలను తరలించే ఉప్పందంపై జెలెన్‌స్కీ, మాక్రాన్, స్టార్మర్ సంతకాలు కూడా చేశారు. ఈ సమావేశం తరువాత వివరాలను నాయకులు వెల్లడించారు. ఉక్రెయిన్ భద్రత కోసం తాము కట్టుబడి ఉన్నామని, కాల్పుల విమరణ తరువాత ఉక్రెయిన్ దాడులను నిరోధించడానికి, ఉక్రెయిన్ పునర్నిర్మాణానికి సహాయం చేస్తామని నాయకులు తెలిపారు. 'కోలిషన్ ఆఫ్ విల్లింగ్' పేరుతో మంగళవారం, బుధవారం ఈ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఉక్రెయిన్‌కు భద్రతా హామీలు కల్పించడంపై భాగస్వామ్య దేశాల మధ్య గణనీయమైన ఏకాభిప్రాయం ఏర్పడినట్టు యూరోపియన్ కమిషన్ ప్రకటించింది. సమావేశం అనంతరం ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ మాట్లాడుతూ ఉక్రెయిన్ భద్రత విషయంలో మిత్రదేశాల మధ్య గతంలో ఎన్నడూ లేనంతటి అపూర్వమైన ఐక్యత కనిపించిందని పేర్కొన్నారు. కేవలం యుద్ధం ఆపడమే కాకుండా, భవిష్యత్తులో శాంతిని నిలబెట్టేందుకు అవసరమైన సెక్యూరిటీ గ్యారెంటీలపై అందరూ ఒకే తాటిపైకి వచ్చారని ఆయన స్పష్టం చేశారు.

# ఆగని అమెరికా బరితెగింపు

**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రపంచ వ్యాప్తంగా తీవ్ర స్థాయిలో నిరసనలు వ్యక్తమవుతున్నప్పటికీ అమెరికా బరితెగింపు ఏమాత్రం తగ్గడం లేదు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వైఖరిలో ఏమాత్రం మార్పు లేకపోవడంతో ఉద్రిక్తతలు మరింతగా పెరుగుతున్నాయి. ఆ దిశలో బుధవారం చోటుచేసుకున్న మూడు పరిణామాలు ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశమయ్యాయి. చైనా, రష్యా, ఫ్రాన్స్‌లు ఆ పరిణామాల లక్ష్యం కావడంతో ఆ దేశాలు విడివిడిగా తీవ్ర స్థాయిలో స్పందిచాయి. తొలుత వెనిజులా తమకు భారీ స్థాయిలో ఆయిల్ అప్పగిస్తోందంటూ అమెరికా అధికారులు మీడియాకు తెలియచేశారు. ఆ మేరకు వెనిజులా కొత్త ప్రభుత్వంతో ఒప్పందం కుదిరిందని కూడా వారు చెప్పారు. దీనిపై మీడియాలో వార్తలు వస్తుండగానే అమెరికా అధ్యక్షుడు ట్రంప్ స్వయంగా ఆ మేరకు స్వయంగా ప్రకటన చేశారు. 282 బిలియన్ల డాలర్ల విలువైన 50 మిలియన్ బ్యారళ్ళ చమురును వెనిజులా అప్పగించనుందన్నది ఈ ప్రకటన సారాంశం. ఈ మేరకు వెనిజులా ప్రభుత్వం అంగీకరించదని. దానిని మార్కెట్ ధరకు విక్రయిస్తామని ఆయన సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు. అయితే, వెనిజులా ప్రభుత్వం నుండి ఎటువంటి ప్రకటన రాకపోవడం గమనార్హం. ట్రంప్ పోస్ట్‌కు పెద్ద ఎత్తున ప్రచారం కల్పించిన మీడియా కూడా ఈ విషయాన్ని విస్మరించింది. అయితే, ఆల్‌జజీరా ఛానల్ మాత్రం 'ట్రంప్ ప్రకటనపై వెనిజులా అధికారికంగా ఎటువంటి స్పందన వ్యక్తం చేయలేదు' అని పేర్కొంది. వెనిజులా చమురుపై పెత్తనాన్ని సొంతం చేసుకోవడానికి అమెరికా చేస్తున్న ప్రయత్నాలను చైనా తీవ్రంగా ఖండించింది. ఇలాంటి బెదిరింపులను మానుకోవాలని సూచించింది.

# గ్రీన్‌ల్యాండ్ స్వాధీనం కోసం ట్రంప్ యత్నం




**హైదరాబాద్ పెన్ పవర్:** వెనిజులా అధ్యక్షుడు మదురోను నిర్భంధించిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తాజాగా గ్రీన్‌ల్యాండ్‌ను స్వాధీనం చేసుకునేందుకు యత్నిస్తున్నారు. గ్రీన్‌ల్యాండ్‌ను స్వాధీనం చేసుకునేందుకు అవసరమైన ఎంపికలపై అధ్యక్షుడు ట్రంప్, ఆయన బృందం చర్చిస్తోందని వైట్‌హౌస్ మంగళవారం ప్రకటించింది. లక్ష్యాన్ని సాధించేందుకు 'మిలటరీ'ని ప్రయోగించడాన్ని కూడా పరిశీలిస్తున్నట్లు తెలిపింది. ఆర్కిటిక్ ప్రాంతంలో ప్రత్యర్థులను అడ్డుకునేందుకు గ్రీన్‌ల్యాండ్‌ను స్వాధీనం చేసుకోవడం అమెరికా జాతీయ భద్రతా ప్రాధాన్యతగా ట్రంప్ భావిస్తున్నారని జాతీయ మీడియా ప్రశ్నలకు ప్రతిస్పందనగా వైట్‌హౌస్ ఒక ప్రకటనలో తెలిపింది. గ్రీన్‌ల్యాండ్‌ను స్వాధీనం చేసుకునే మార్గాల గురించి ఓవల్ కార్యాలయంలో చర్చలు కొనసాగుతున్నాయని మరియు సలహాదారులు వివిధ మార్గాలపై చర్చిస్తున్నారని అమెరికా సీనియర్ అధికారి తెలిపారు. గ్రీన్‌ల్యాండ్‌కు మద్దతుగా నాటో నేతలు చేసిన ప్రకటనలపై ట్రంప్ భయపడటం లేదని అన్నారు. గ్రీన్‌ల్యాండ్‌ను అమెరికా కోనుగోలు చేయడం లేదా ఆ భూభాగంతో స్వేచ్ఛా అనుబంధ ఒప్పందం (సిఒఎఫ్‌ఎ) ఏర్పరుచుకోవడం కూడా ఉందని పేరు వెల్లడించేందుకు నిరాకరించిన ఒక అధికారి తెలిపారు. సిఒఎఫ్ఐ ఒప్పందం గ్రీన్‌ల్యాండ్‌ను అమెరికాలో భాగం చేయాలనే ట్రంప్ లక్ష్యాన్ని నెరవేరుస్తుందని అన్నారు. వెనిజులా అధ్యక్షుడు మదురోను నిర్భంధించిన అనంతరం గ్రీన్‌ల్యాండ్‌పై సుమారు రెండు నెలల్లో నిర్ణయం ప్రకటిస్తానని ట్రంప్ ఆదివారం వెల్లడించిన సంగతి తెలిసిందే.

# షూటింగ్ కోచ్ అంకుశ్ భరధ్వాజ్‌పై సస్పెన్షన్ వేటు



**హైదరాబాద్ పెన్ పవర్:** మైనర్ షూటర్‌పై లైంగిక వేధింపులకు పాల్పడిన కోచ్ అంకుశ్ భరద్వాజ్‌ను నేషనల్ రైఫిల్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఎన్ఆర్ఎఐ) సస్పెండ్ చేసింది. ఫరీదాబాద్‌లో అంకుశ్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు ఎన్ఆర్ఐఐ ధృవీకరించింది. ఆయనకు షోకాజ్ నోటీసులు జారీ చేయనున్నట్లు ఎన్ఆర్ఎఐఐ కార్యదర్శి రాజీవ్ భాటియా తెలిపారు.ఢిల్లీలోని డాక్టర్ కర్ణిసింగ్ షూటింగ్ రేంజ్‌లో జాతీయస్థాయి షూటింగ్ పోటీల సమయంలో ఈఘటన జరిగింది. వివరాల ప్రకారం.. మైనర్ షూటర్ తల్లిదండ్రులు నొయిడాలో నివసిస్తుండగా, ఆమె చండీగఢ్‌లో చదువుతోంది. 2017 నుండి షూటర్‌గా శిక్షణ పొందుతున్న ఆమె, గతేడాది అంకుశ్ భరద్వాజ్ వద్ద శిక్షణ ప్రారంభించింది. డిసెంబర్ 16న డాక్టర్ కర్ణిసింగ్ షూటింగ్ రేంజ్‌లో జాతీయ స్థాయి షూటింగ్ పోటీల కోసం ఢిల్లీకి వెళ్లారు. పోటీ కోసం వెళుతుండగా ఆటతీరును అంచనా వేయాలంటూ ఆమెను హోటల్‌కు పిలిపించి, ఆమెపై లైంగిక వేధింపులకు పాల్పడ్డారు. బయటకు వెల్లడిస్తే తన కెరీర్‌ను నాశనం చేస్తామని బెదిరించినట్లు ఫిర్యాదులో తెలిపారు. మైనర్ షూటర్ కుటుంబసభ్యుల సమాచారం మేరకు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. అంకుశ్ భరద్వాజ్‌పై బిఎన్ఎస్ కింద, పోక్సో చట్టంలోని సెక్షన్ 6 కింద అభియోగాలు నమోదు చేసినట్లు ఎన్ఆర్ఎఐ సెక్రటరీ జనరల్ పవన్ సింగ్ తెలిపారు. ఇది తీవ్రమైన లైంగిక వేధింపుల కేసని, విచారణ కొనసాగుతోందని, అంకుశ్‌ను సస్పెండ్ చేశామని అన్నారు.

# ప్రఖ్యాత పర్యావరణవేత్త మాధవ్ గాడ్గిల్ కన్నుమూత



**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రఖ్యాత పర్యావేరణవేత్త మాధవ్ గాడ్గిల్ (82) కన్నుమూశారు. ఆయన అనారోగ్య సమస్యలతో బాధపడుతూ పూనెలోని తన నివాసంలో బుధవారం రాత్రి తుదిశ్వాస విడిచినట్లు ఆయన కుమారుడు సిద్ధార్థ్ గాడ్గిల్ మీడియాకు వెల్లడించారు. ఆయన అంత్యక్రియలు సాయంత్రం నాలుగు గంటలకు పూనెలోని వైకుంఠ స్మశానవాటికలో జరగనున్నాయి. మాధవ్ గాడ్గిల్ పశ్చిమ కనుమల పర్యావరణ ప్రాముఖ్యతకు ఆయన విశేష కృషి చేశారు. ప్రపంచ జీవవైవిధ్య హాట్‌స్పాట్ అయిన పశ్చిమ కనుమలలో ఆయన చేసిన కృషికి గాను 2024లో ఐక్యరాజ్యసమితి అత్యున్నత పర్యావరణ గౌరవమైన వార్షిక ఛాంపియన్స్ ఆఫ్ ది ఎర్త్ అవార్డును బహూకరించింది. కాగా, ఆయన పర్యావరణానికి సంబంధించి విలువైన సిఫార్సులను అందించారు. అత్యంత సున్నితమైన ప్రాంతాల్లో పర్యావరణానికి నష్టం చేకూర్చకుండా కఠినమైన ఆంక్షలను తన నివేదికలో సిఫార్సు చేశారు. వాటిల్లో కొత్త రోడ్లు లేదా భవన నిర్మాణాల కట్టడాలకు అనుమతించరాదని, నిటారుగా ఉన్న వాలులో అభివృద్ధి చేయరాదని, రాతి తవ్వకాలపై నిషేధం విధించాలని ఆయన సిఫార్సు చేశారు. మాధవ్ గాడ్గిల్ మృతికి మాజీ పర్యావరణశాఖా మంత్రి, కాంగ్రెస సీనియర్ నేత జైరాం రమేశ్ సంతాపం తెలిపారు. 'మాధవ్ గాడ్గిల్ ఒక అత్యున్నతస్థాయి విద్యావేత్త, అవిశ్రాంత క్షేత్ర పరిశోధకుడు, మార్గదర్శక సంస్థ నిర్మాత, గొప్ప సంభాషణకర్త, ప్రజల నెట్‌వర్క్‌లు, ఉద్యమాలను దృఢంగా నమ్మిన వ్యక్తి, ఐదు దశాబ్దాలకు పైగా చాలామందికి స్నేహితుడు, తత్వవేత్త, మార్గదర్శి, గురువు. ఆధునిక శాస్త్రంలో అత్యుత్తమ విశ్వవిద్యాలయాలలో శిక్షణ పొందిన ఆయన జీవవైవిధ్య పరిరక్షణలో ఛాంపియన్‌గా నిలిచారు' అని జైరాం రమేష్ తన సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్టు చేశారు. అలాగే మాధవ్ స్ఫూర్తిదాయక వ్యక్తిగా నిలిచిపోతారని జైరాం రమేష్ అన్నారు.

# 6.5 కోట్ల ఓటర్ల పేర్లు తొలగింపు



**హైదరాబాద్ పెన్ పవర్:** ఎన్నికల సంఘం నిర్వహిస్తున్న ఓటర్ల స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్)2 ప్రభావం భారీగా పడింది. ఈ ఎస్ఐఆర్2 ప్రక్రియ నిర్వహించిన తొమ్మిది రాష్ట్రాలు , మూడు కేంద్రపాలిత ప్రాంతాల్లో 6.5 కోట్ల మంది పేర్లను తొలగించారు. ఈ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో ప్రచురించిన ముసాయిదా ఓటర్ల జాబితా ప్రకారం ఈ వివరాలు వెల్లడయ్యాయి. గతేడాదిలో ప్రారంభమైన ఎస్ఐఆర్ 2వ దశకు ముందు.. ఈ 12 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో 50.90 కోట్ల మంది ఓటర్లు ఉండగా, ముసాయిదా జాబితాలు ప్రచురించాక ఓటర్ల సంఖ్య 44.40 కోట్లకు తగ్గింది. ఎస్ఐఆర్ ప్రక్రియ జరుగుతున్న రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లోని గ్రామీణ ప్రాంతాలతో పోలిస్తే పట్టణ ప్రాంతాల్లో గణన ఫారమ్‌ల సేకరణ చాలా తక్కువ ఉన్నదని అధికారులు వెల్లడించారు. అండమాన్-నికోబార్ దీవులు, లక్షద్వీప్, ఛత్తీస్‌గఢ్, గోవా, గుజరాత్, కేరళ, మధ్యప్రదేశ్, పుదుచ్చేరి, రాజస్థాన్, తమిళనాడు, ఉత్తరప్రదేశ్ , పశ్చిమ బెంగాల్‌లలో ఎస్ఐఆర్-2 ప్రక్రియ ప్రారంభమై ముసాయిదా జాబితాలను విడుదల చేశారు. అసోంలో ఈ ప్రక్రియ పురోగతిలో ఉంది.

# భారత్, ఇజ్రాయిల్ మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యం బలోపేతం

**హైదరాబాద్ పెన్ పవర్:** భారత్, ఇజ్రాయిల్ మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని బలోపేతం చేసేందుకు గల మార్గాలపై ప్రధాని నరేంద్ర మోడీ, ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహు చర్చించారు. బుధవారం మోడీకి నెతన్యాహు ఫోన్ చేసి గాజా శాంతి ప్రణాళికపై సమాచారాన్ని అందించారు.

కాగా నెతన్యాహు, మోడీ పరస్పరం నూతన సంవత్సర శుభాకాంక్షలు చెప్పుకున్నారని ప్రధానమంత్రి కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. గాజాలో న్యాయమైన, శాశ్వత శాంతి ఏర్పాటు దిశగా కొనసాగతున్న ప్రయత్నాలకు భారత్ మద్దతును మోడీ పునరుద్ఘాటించారని ఆ ప్రకటన తెలిపింది.స్నేహితుడు నెతన్యాహుతో మాట్లాడడం సంతోషంగా వుందని మోడీ ఎక్స్‌లో ట్వీట్ చేశారు. ప్రాంతీయంగా నెలకొన్న పరిస్థితులపై ఇరువురు నేతలు అభిప్రాయాలు పంచుకున్నారు.మరింత ధృఢ నిశ్చయంతో ఉగ్రవాదంపై పోరు సల్పాలన్న తీర్మానాన్ని కూడా ఇరువురు నేతలు పంచుకున్నారని ఎక్స్ పోస్టు పేర్కొంది. ప్రజాస్వామ్య విలువలు, పరస్పర విశ్వాసం, ముందు చూపు, దార్శనికత వంటి అంశాలపై దృష్టి పెడుతూ ఇరు దేశాల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని పటిష్టపరుచుకునేందుకు గల ఉమ్మడి ప్రాధాన్యతలను వారు గుర్తించారు. డిసెంబరు 10న కూడా నెతన్యాహు, మోడీకి ఫోన్ చేసి పశ్చిమాసియాలో నెలకొన్న పరిస్థితులపై వివరించారు. త్వరలోనే ఇరువురు నేతలు భేటీ జరిగే అవకాశముందని నెతన్యాహు తెలిపారు.

# ఆర్థిక మంత్రి పేరిట వైరల్ అవుతున్న పెట్టుబడి వీడియోలు నకిలీవని వెల్లడి



**హైదరాబాద్ పెన్ పవర్:** కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ పేరుతో కొన్ని నకిలీ పెట్టుబడి వీడియోలు వైరల్ అవుతున్నాయి. ఈ విషయంపై ప్రెస్ ఇన్‌ఫర్మేషన్ బ్యూరో యొక్క ఫ్యాక్ట్ చెక్ విభాగం స్పందించింది. నిర్మలా సీతారామన్ కొన్ని పెట్టుబడి పథకాలకు ప్రచారం చేస్తున్నట్లుగా వైరల్ అవుతున్న వీడియోలు వాస్తవం కాదని తెలిపింది.సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఆ వీడియోలు నకిలీవని, కేంద్ర ప్రభుత్వం కానీ, ఆర్థిక మంత్రి కానీ ఎలాంటి పెట్టుబడి పథకాలను ప్రోత్సహించడం లేదని పేర్కొంది. పెట్టుబడులకు సంబంధించిన సమాచారం కోసం అధికారిక పోర్టల్స్, ఆర్బీఐ, సెబీ వంటి నియంత్రణ సంస్థల ద్వారా ధృవీకరించుకోవాలని సూచించింది.నిర్మలా సీతారామన్ పెట్టుబడి సూచనలు చేస్తున్నట్లుగా కనిపించే లింక్స్‌ను క్లిక్ చేసే ముందు వాటిని పరిశీలించాలని సూచించింది. ఎవరితోనూ వ్యక్తిగత వివరాలు, ఓటీపీ, బ్యాంకింగ్ సంబంధిత సమాచారాన్ని పంచుకోవద్దని ప్రజలను హెచ్చరించింది.

## జర్మనీ అధికారుల సంరక్షణలో ఉన్న బేబీ అరిహా షాను రప్పించండి

**హైదరాబాద్ పెన్ పవర్:** తల్లిదండ్రులకు దూరంగా జర్మనీలో బాలల సంరక్షణ కేంద్రంలో వుంటున్న భారత పౌరురాలైన ఐదేళ్ళ బాలిక అరిహా షాను స్వదేశానికి రప్పించి, తల్లిదండ్రుల వద్దకు చేర్చే అంశాన్ని పరిశీలించి, చర్యలు తీసుకోవాల్సిందిగా సిపిఎం ఎంపి జాన్ బ్రిట్టాస్ విదేశాంగ మంత్రి జై శంకర్‌కు లేఖ రాశారు. మానవతావాదంతో ఈ అంశాన్ని వెంటనే చేపట్టాల్సి వుందని ఆయన కోరారు. ఆమె తల్లిదండ్రులపై లైంగిక దూషణల ఆరోపణలు కొట్టివేసినప్పటికీ ఆ బాలిక మాత్రం జర్మనీలోనే వుంది. ఈ విషయంలో ఆ బాలిక హక్కులు ఉల్లంఘించబడుతున్నాయని జాన్ బ్రిట్టాస్ ఆందోళన వ్యక్తం చేశారు. బంధువుల సంరక్షణ పొందే హక్కు, తన గుర్తింపును పరిరక్షించుకునే హక్కు అలాగే సాంస్కృతిక వారసత్వం వంటి అంశాల్లో ఆమెకు గల హక్కులన్నీ అతిక్రమించబడుతున్నాయని ఆ లేఖలో పేర్కొన్నారు. ప్రస్తుతం బేబీ అరిహాను ఆమె తల్లిదండ్రులతో, కుటుంబ సభ్యులతో మాట్లాడనివ్వడం లేదన్నారు. ఈ తరుణంలో కుటుంబ ఐక్యతను గౌరవిస్తూ, మైనర్ బాలికల హక్కులను పరిరక్షించడంతో పాటూ అంతర్జాతీయ బాలల హక్కుల ఒప్పందాలకు కట్టుబడి వ్యవహరించాల్సి వుందని ఆయన పేర్కొన్నారు. ఈ నెల 12, 13 తేదీల్లో జర్మనీ ఛాన్సలర్ భారత్‌కు వస్తున్న నేపథ్యంలో బేబీ అరిహాను సురక్షితంగా భారత్‌కు రప్పించే విషయంలో తక్షణమే దౌత్యపరమైన కార్యాచరణను చేపట్టాల్సిందిగా బ్రిట్టాస్ ఆ లేఖలో కోరారు. గతంలో ఇలా భారతీయ చిన్నారులను విజయవంతంగా దేశానికి రప్పించిన ఉదాహరణలను ఆయన పేర్కొన్నారు. ఈ విషయంలో సహానుభూతితో వ్యవహరించి, సమస్యను త్వరగా పరిష్కరించాల్సిందిగా కోరారు.

## వీసాలపై భారతీయ విద్యార్థులకు అమెరికా వార్నింగ్

**హైదరాబాద్ పెన్ పవర్:** స్టూడెంట్ వీసాల విషయంలో భారతీయ విద్యార్థులకు అమెరికన్ ఎంబసీ కీలక హెచ్చరిక జారీ చేసింది. వీసాలు హక్కు కాదని, అది ఒక ప్రత్యేక గౌరవం మాత్రమే అని తెలిపింది. స్టూడెంట్ వీసాలపై వెళ్లిన విద్యార్థులు అమెరికా చట్టాలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించింది. నిబంధనలు పాటించకపోతే.. వీసాల రద్దు, స్వదేశాలకు తరలింపు, కొంతకాలం వరకు బ్లాక్ లిస్టులో పెట్టడం, అరెస్టు చేయడం వంటి చర్యలుంటాయని తెలిపింది. భవిష్యత్తులో అమెరికాకు రాకుండా నిషేధం కూడా విధిస్తామని హెచ్చరించింది. ఈ మేరకు అమెరికా రాయబార కార్యాలయం సోషల్ మీడియా ద్వారా వెల్లడించింది. భారతీయ విద్యార్థులు సహా విదేశీయులు స్థానిక చట్టాలను గౌరవించాలని సూచించింది. ఇటీవల అమెరికా స్టూడెంట్ వీసాల్ని కఠినతరం చేస్తూ నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. అలాగే వర్కింగ్ వీసాలు, టూరిస్ట్, బిజినెస్ వీసాల విషయంలో కూడా కఠినంగా వ్యవహరిస్తోంది. అన్ని విభాగాల్లోనూ కొత్త వీసాల మంజూరులో కఠిన నిబంధనలు అమలు చేస్తోంది. ట్రంప్ అధికారం చేపట్టిన తర్వాత ఈ మార్పులు చోటు చేసుకున్నాయి. నిబంధనలు పాటించని వారిని బలవంతంగా స్వదేశాలకు పంపిస్తున్న సంగతి తెలిసిందే.

## రష్యా అడ్డుకున్నా.. వెనెజువెలా చమురు నౌకను స్వాధీనం చేసుకున్న అమెరికా

**హైదరాబాద్ పెన్ పవర్:** వెనెజువెలా దేశాన్ని స్వాధీనం చేసుకున్న అమెరికా ఇప్పుడు ఆ దేశానికి చెందిన చమురు నౌకపై కన్నేసింది. రెండు వారాలుగా వెనెజువెలాకు చెందిన చమురునౌకను స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నించగా.. రష్యా అడ్డుకునే ప్రయత్నం చేసింది. అయినప్పటికీ.. అమెరికా, ఆ నౌకను సీజ్ చేసిందని సమాచారం. అట్లాంటిక్ సముద్రంలో, బెల్లా-1 అనే ఒక చమురు నౌక ప్రయాణిస్తోంది. వెనెజువెలా చమురు ఎగుమతులపై ఆంక్షలు విధించిన అమెరికా ఆ నౌకను స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నించింది. అక్కడికి ప్రత్యేక నౌకను పంపింది. కానీ, సముద్ర జలాల్లో ఆటుపోట్ల కారణంగా స్వాధీనం చేసుకోవడం సాధ్యం కాలేదు. ఇదే క్రమంలో రష్యా ఆ నౌకకు మద్దతుగా సబ్ మెరైన్, యుద్ధ నౌకను మోహరించింది. అయినప్పటికీ అమెరికా ఆ నౌకను ఐస్ లాండ్ తీరంలో స్వాధీనం చేసుకున్నట్లు ప్రకటించింది. అమెరికా నౌకదళం, సైన్యం సంయుక్తంగా ఈ పని చేసినట్లు తెలిపింది. ఈ నేపథ్యంలో అమెరికా-రష్యా మధ్య ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది. ఇటీవల వెనెజువెలాపై అమెరికా దాడి చేసి, అధ్యక్షుడిని అదుపులోకి తీసుకున్న సంగతి తెలిసిందే. ఈ దాడుల్లో 24 మందికిపైగా వెనెజువెలా సెక్యూరిటీ మరణించినట్లు సమాచారం.

# సెన్సెక్స్ 1,144 పాయింట్ల పతనం



హైదరాబాద్ పెన్ పవర్: దలాల్ స్ట్రీట్‌ను అమెరికా భయాలు వెంటాడుతున్నాయి. వరుసగా మూడో రోజూ మార్కెట్లు నష్టపోయాయి. వెనిజులా అధ్యక్షుడు మదురో, ఆయన భార్యను అమెరికా దుర్మార్గంగా బంధించి భౌగోళిక ఉద్రిక్తతలను రెచ్చగొట్టడం ఇన్వెస్టర్లను తీవ్ర ఆందోళనకు గురి చేస్తోంది. మరోవైపు భారత్‌పై మరిన్ని సుంకాలు పెంచుతామని డొనాల్డ్ ట్రంప్ హెచ్చరికలు మార్కెట్లను ఒత్తిడికి గురి చేస్తోన్నాయి. యుఎస్ ఆంక్షలు కొనసాగుతోన్న వేళ రిలయన్స్ ఇండిస్ట్రీస్ దొడ్డిదారిన రష్యా నుంచి చమురు దిగుమతులను చేసుకుంటుందన్న బ్లూమ్‌బర్గ్ రిపోర్ట్ ఆ కంపెనీ షేరును ఒత్తిడికి గురి చేస్తోంది. మరో ప్రధాన సూచీ హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ ప్రతికూలతను ఎదుర్కొంటుంది. ఈ పరిణామాలతో మూడు రోజుల్లో సెన్సెక్స్? 1,144 పాయింట్లు పతనమయ్యింది. సెషన్‌లో బిఎస్‌ఇ సెన్సెక్స్ 102 పాయింట్లు లేదా 0.12 శాతం నష్టంతో 84,961 వద్ద ముగిసింది. ఎన్‌ఎస్‌ఇ నిఫ్టీ 37.95 పాయింట్లు తగ్గి 26,141 వద్ద నమోదయ్యింది. సెన్సెక్స్ 30 సూచీలో మారుతీ సుజుకీ, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, టాటా మోటార్స్ పాసింజర్ వెహికల్స్, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్, ఏషియన్ పెయింట్స్ షేర్లు అధికంగా నష్టపోయిన వాటిలో ఉన్నాయి. టైటాన్, హెచ్‌సిఎల్ టెక్నాలజీస్, టెక్ మహీంద్రా, ఇన్ఫోసిస్, సన్‌ఫార్మా లాభపడ్డాయి. నిఫ్టీలో మిడ్‌క్యాప్, స్మాల్ క్యాప్ సూచీలు 0.45 శాతం, 0.39 శాతం లాభపడటం విశేషం. ఆటో, ఆయిల్ అండ్ గ్యాస్ సూచీలు అధికంగా నష్టపోయిన వాటిలో ఉన్నాయి.

# బీమా కంపెనీల కక్కుర్తి..!




హైదరాబాద్ పెన్ పవర్: బీమా కంపెనీలు వ్యాపార కక్కుర్తితో ప్రజలను తప్పుదోవ పట్టించి భారీగా మోసపూరిత పాలసీలను అంటగడుతున్నాయి. వ్యక్తుల అవసరాలకు సరిపడని, నియమ, నిబంధనలు, షరతులు గురించి పూర్తిగా వివరించకుండా కేవలం ప్రయోజనాల గురించే చెబుతూ తప్పుడు పాలసీలను (మిస్ సెల్లింగ్) విక్రయిస్తోన్నాయి. ఇవి ఏడాదికేడాదికి పెరగడం గమనార్హం. ఇన్సూరెన్స్ రెగ్యూలేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఐఆర్‌డిఎఐ) 2024–25 రిపోర్ట్ ప్రకారం.. 2023–24లో జీవిత బీమా కంపెనీలకు వ్యతిరేకంగా 1,20,726 ఫిర్యాదులు నమోదయ్యాయి. 2024–25లోనూ ఇదే స్థాయిలో 1,20,429 ఫిర్యాదులు వచ్చాయి. కాగా.. బీమా కంపెనీల అనైతిక వ్యాపార విధానాలపై ఫిర్యాదులు 26,667కు పెరిగాయి. 2023–24లో 23,335 అనైతిక ఫిర్యాదులు నమోదయ్యాయి. గతేడాది మొత్తం ఫిర్యాదుల్లో అనైతిక వ్యాపార పద్ధతులకు సంబంధించినవి 19.33 శాతం నుంచి 22.14 శాతానికి పెరిగాయని ఐఆర్‌డిఎఐ వెల్లడించింది. పలు బ్యాంక్‌లు, బీమా ఏజెంట్ల ద్వారా మిస్ సెల్లింగ్ పాలసీ విక్రయాలు జరుగుతున్నాయి. ”అనైతిక బీమా పాలసీ విక్రయాలను నిరోధించేందుకు గాను తగిన విధానాలను అమలు చేయాలని బీమా సంస్థలకు సూచించాం. పాలసీదారునకు అనుకూలమైనా ప్లాన్‌ను అంచనా వేయడం, పంపిణీ ఛానల్ వ్యాప్తంగా కొన్ని నియంత్రణలు అమలు చేయడం, మిస్ సెల్లింగ్‌పై ఫిర్యాదుల పరిష్కారానికి ప్రణాళిక రూపొందించాలని.. తప్పుడు పాలసీల విక్రయానికి మూల కారణాలను గుర్తించేందుకు అధ్యయనం చేయాలని సూచించాము.” అని ఐఆర్‌డిఎఐ తన నివేదికలో పేర్కొంది. 2024–25 సంవత్సరానికి జిడిపిలో బీమా రంగం వాటా 3.7 శాతంగా ఉందని ఐఆర్‌డిఎఐ తెలిపింది. ఇది ప్రపంచ సగటు 7.3 శాతం కంటే చాలా తక్కువ. 2024–25లో ఐఆర్‌డిఎఐ గ్రివెన్స్ కాల్ సెంటర్, బీమా బరోసాకు మొత్తంగా 2.57 లక్షల కాల్స్ వచ్చాయని తెలిపింది. ఇందులో 1.20 లక్షలు జీవిత బీమా, 1.37 లక్షల కాల్స్ వైద్య, సాధారణ బీమా అనుమానాలు, ఫిర్యాదులకు సంబంధించినవి ఉన్నాయి.

# వెండి నగలకూ హాల్‌మార్క్?



హైదరాబాద్ పెన్ పవర్: ప్రస్తుతం బంగారు ఆభరణాలకే ఉంటున్న హాల్‌మార్క్.. ఇకపై వెండి నగలకూ రాబోతున్నదా? అంటే అవుననే సంకేతాలనే ఇస్తున్నాయి బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బీఐఎస్) వర్గాలు. తప్పనిసరి హాల్‌మార్కింగ్ విధానం కిందికి వెండి ఆభరణాలు, కళాఖండాలను తీసుకురావాలని కేంద్ర ప్రభుత్వం యోచిస్తున్నది మరి. గత ఏడాది మొదలు దేశ, విదేశీ మార్కెట్లలో వెండి ధరలు దూసుకుపోతున్న విషయం తెలిసిందే. కిలో ఆల్‌టైమ్ హైకి చేరి రూ. 2,56,000 పలికింది. ఈ నేపథ్యంలోనే మోసాలకు చెక్ పెట్టేలా వినియోగదారుల రక్షణార్థం వెండి నగలకూ హాల్‌మార్కింగ్ విధానాన్ని అవలంబించాలని చూస్తున్నట్టు బీఐఎస్ సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. నిజానికి సిల్వర్ హాల్‌మార్కింగ్ స్వచ్ఛంద ప్రాతిపదికన ఇప్పటికే దేశీయంగా అమల్లో ఉన్నది. అయితే పరిశ్రమ మాత్రం సిల్వర్ హాల్‌మార్కింగ్‌ను తప్పనిసరి చేయాలని డిమాండ్ చేస్తూ వస్తున్నది. కాగా, రెగ్యులేటరీ, అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి సారించామని బీఐఎస్ డైరెక్టర్ జనరల్ సంజయ్ గార్గ్ తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా వెండికి అత్యంత ఆదరణ ఉన్న దేశాల్లో భారత్ కూడా ఒకటి.

# ఎనిమిదేళ్ల తర్వాత ఎయిరిండియా చేతికి డ్రీమ్‌లైనర్




హైదరాబాద్ పెన్ పవర్: జటాటా గ్రూప్‌నకు చెందిన విమానయాన సంస్థ ఎయిరిండియా కొనుగోళ్లు జరిపిన విమానాలు ఒక్కొక్కొటిగా అందుబాటులోకి వస్తున్నాయి. తాజాగా బోయింగ్‌కు చెందిన 787–9 విమానం సంస్థ చెంతకు చేరింది. దాదాపు 8 ఏళ్ల తర్వాత డ్రీమ్‌లైనర్ విమానం ఎయిరిండియా ఫ్లీట్‌లో చేరడం గమనార్హం. ప్రైవేటీకరణ తర్వాత ఇదే తొలి డ్రీమ్‌లైనర్ కావడం విశేషం. జనవరి 7న సియాటెల్‌లోని తన ప్లాంట్ నుంచి బోయింగ్ ఈ విమానాన్ని డెలివరీ చేయగా... ఎయిరిండియా అందుకుంది. డైరెక్టర్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ తనిఖీల అనంతరం ప్రయాణానికి అందుబాటులోకి రానుంది. ప్రభుత్వ ఆధ్వర్యంలో ఉన్నప్పుడు 2017 అక్టోబర్‌లో చివరి డ్రీమ్‌లైనర్ ఎయిరిండియాలో చేరింది. మళ్లీ ఇన్నేళ్ల తర్వాత మరో డ్రీమ్‌లైనర్ కంపెనీకి చేరింది. సంస్థ అవసరాలకు అనుగుణంగా ఈ డ్రీమ్‌లైనర్‌ను బోయింగ్ రూపొందించింది. దీంట్లో ఎకానమీ, ప్రీమియం ఎకానమీ, బిజినెస్ క్లాస్ తరగతులు ఉండనున్నాయి. ఎయిరిండియాను కొనుగోలు చేసిన తర్వాత 2023లో 350 ఎయిర్‌బస్, 220 బోయింగ్ విమానాలకు టాటా గ్రూప్ ఆర్డర్ పెట్టిన సంగతి తెలిసిందే. అందులో 51 నారో బాడీ విమానాలు డెలివరీ కాగా.. తొలి వైడ్ బాడీ విమానం డెలివరీ అయ్యింది. ప్రస్తుతం ఎయిరిండియా వద్ద 300 విమానాలున్నాయి. 185 ఎయిరిండియా నడుపుతుండగా.. మిగిలినవి ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ నిర్వహిస్తోంది. మరికొన్ని డ్రీమ్‌లైనర్లు ఈ ఏడాదిలోనే అందుబాటులోకి రానున్నట్లు ఎయిరిండియా వర్గాలు చెబుతున్నాయి.

# రహస్య సమాచారం లీక్..

## ‘బ్యాంక్ ఆఫ్ అమెరికా’కు సెబీ నోటీసులు..!



హైదరాబాద్ పెన్ పవర్: భారత స్టాక్ మార్కెట్లకు చెందిన ఇన్‌సైడర్ ట్రేడింగ్ నిబంధనలను బ్యాంక్ ఆఫ్ అమెరికా ఉల్లంఘించిందని మార్కెట్ రెగ్యులేటర్ సెబీ (రాఇఃఎ) ఆరోపించింది. ఆదిత్య బిర్లా సన్‌లైఫ్ అసెట్ మేనేజ్‌మెంట్ సంస్థ స్టాక్ విక్రయాలకు సంబంధించిన డీల్ వేళ రహస్య సమాచారాన్ని లీక్ చేసిందని పేర్కొంది. అంతేగాక,

ఈ వ్యవహారంపై దర్యాప్తును పక్కదోవ పట్టించే ప్రయత్నం చేసిందంటూ బ్యాంక్ ఆఫ్ అమెరికా కు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు తెలిసింది. గత నవంబరులోనే ఈ నోటీసులను జారీ చేయగా.. తాజాగా ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ఈ మేరకు విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ రాయిటర్స్ కథనం వెల్లడించింది. 2024 మార్చిలో ఆదిత్య బిర్లా సన్‌లైఫ్ అసెట్ మేనేజ్‌మెంట్ స్టాక్ విక్రయాలకు సంబంధించిన లావాదేవీలను భారత్‌లోని బ్యాంక్ ఆఫ్ అమెరికా నిర్వహించింది. ఈ విక్రయాల విలువ దాదాపు 177 మిలియన్ డాలర్లు. ఆ సమయంలో స్టాక్ ధర, ఇతర రహస్య వివరాలను బ్యాంకు డీల్ టీమ్.. ఉద్యోగులు, ఇన్వెస్టర్లతో పంచుకుందని ఓ ప్రజావేగు ఆరోపించారు. దీంతో బ్యాంక్ ఆఫ్ అమెరికా అంతర్గత దర్యాప్తు జరిపి.. ఎలాంటి ఉల్లంఘనలు జరగలేదని పేర్కొంది. ఈ క్రమంలోనే ఈ వ్యవహారంపై సెబీ దర్యాప్తు చేపట్టగా కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఈ డీల్ విషయంలో అంతర్గత నైతిక కట్టుబాట్లను విస్మరించి బ్యాంక్ ఆఫ్ అమెరికా డీల్ టీమ్ రహస్య సమాచారాన్ని బయటపెట్టిందని సెబీ పేర్కొంది. వాస్తవాలను దాచి.. తప్పుడు స్టేట్‌మెంట్లతో దర్యాప్తును తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేసిందని ఆరోపించింది. అయితే, దీనిపై బ్యాంక్ ఆఫ్ అమెరికా గానీ.. సెబీ గానీ ఇంతవరకూ స్పందించలేదు. మరోవైపు, ఈ వ్యవహారంపై సెటిల్‌మెంట్‌కు సెబీ వద్ద బ్యాంక్ ఆఫ్ అమెరికా అప్లికేషన్ దాఖలు చేసినట్లు సమాచారం.

# మైక్రోసాఫ్ట్‌లో 22వేల మందికి లేఆఫ్‌లంటూ వార్తలు




హైదరాబాద్ పెన్ పవర్:కృత్రిమ మేధ వినియోగం వేళ దిగ్గజ కంపెనీల్లో లేఆఫ్‌లు గత కొంతకాలంగా టెక్ రంగాన్ని కుదిపేస్తున్నాయి. ఈ పరిణామాల వేళ మైక్రోసాఫ్ట్‌లో మరోసారి భారీఎత్తున తొలగింపులంటూ ఓ నివేదిక రావడం గందరగోళానికి గురిచేసింది. జనవరిలో దాదాపు 22వేల మందికి కంపెనీ ఉద్వాసన పలకనుందన్న వార్త ఉద్యోగుల్లో ఆందోళనకు దారితీసింది. దీంతో ఈ ప్రచారంపై కంపెనీ స్పందిస్తూ.. అవన్నీ నిరాధార వార్తలని స్పష్టం చేసింది. అసలేం జరిగిందంటే..? టిప్‌ర్యాంక్స్(రీసెర్చ్ అండ్ అనాలసిస్ కంపెనీ) నివేదికతో ఈ ప్రచారం మొదలైంది. ఈ ఏడాది జనవరిలో మైక్రోసాఫ్ట్ 11వేల నుంచి 22వేల మంది ఉద్యోగులకు లేఆఫ్‌లు ఇవ్వాలని భావిస్తున్నట్లు ఆ నివేదిక పేర్కొంది. అజ్యూర్ క్లౌడ్ సర్వీసెస్, ఎక్స్‌బాక్స్, గ్లోబల్ సేల్స్ ఆపరేషన్స్ వంటి విభాగాల్లో ఈ కోతలు ఉండొచ్చని తెలిపింది. ఖర్చులు పెరగడం, కృత్రిమ మేధలో పెట్టుబడులు వంటి కారణాలతో ఈ తొలగింపులు చేపట్టాలని మైక్రోసాఫ్ట్ యోచిస్తున్నట్లు నివేదిక వెల్లడించింది. దీంతో ఈ వార్త సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. ఈ క్రమంలోనే మైక్రోసాఫ్ట్ చీఫ్ కమ్యూనికేషన్స్ ఆఫీసర్ ఫ్రాంక్ ఎక్స్ షా సోషల్ మీడియాలో స్పందించారు. “ఇవన్నీ 100శాతం నిరాధార వార్తలే. ఉద్యోగుల కోత అవాస్తవం” అని వెల్లడించారు.

అంతకుముందు విండోస్ సెంట్రల్ ఎడిటర్ జెజ్ కార్డన్ స్పందిస్తూ.. లేఆఫ్‌ల సమాచారం తప్పని తెలిపారు. అయితే, దీనిపై కంపెనీ తరఫున మైక్రోసాఫ్ట్ అధికారిక ప్రకటన ఏదీ విడుదల చేయలేదు. గతేడాది జులైలో మైక్రోసాఫ్ట్ భారీ సంఖ్యలో తొలగింపులు చేపట్టిన సంగతి తెలిసిందే. దాదాపు 9వేల మందికి లేఆఫ్ నోటీసులు ఇచ్చింది. అప్పట్లో దీనిపై ఎక్స్‌బాక్స్ హెడ్ ఫిల్ స్పెన్సర్ మాట్లాడుతూ.. కంపెనీ దీర్ఘకాల ప్రణాళికలో భాగంగా ఈ కోతలు తప్పలేదని పేర్కొన్నారు. ఆ లేఆఫ్‌ల సమయంలోనే పలు గేమ్ ప్రాజెక్ట్‌లను కంపెనీ రద్దు చేసుకుంది. కొన్ని స్టూడియోలను మూసేసింది.

# కరూర్ తొక్కిసలాట కేసులో విజయ్‌కి సీబీఐ నోటీసులు

హైదరాబాద్ పెన్ పవర్: తమిళనాడు ఎన్నికలకు ముందు.. ఆ రాష్ట్రంలో సంచలన పరిణామం చోటు చేసుకుంది. గతేడాది జరిగిన కరూర్ తొక్కిసలాట ఘటనకు సంబంధించిన కేసులో.. తమిళగ వెట్రి కళగం పార్టీ అధినేత విజయ్‌కి తాజాగా సీబీఐ సమన్లు జారీ చేసింది. ఈనెల 12వ తేదీన ఢిల్లీ విచారణకు హాజరు కావాలని.. సీబీఐ అధికారులు జారీ చేసిన నోటీసుల్లో ఆదేశించారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు కరూర్ తొక్కిసలాట ఘటన కేసులో జరుగుతున్న ఈ స్వతంత్ర దర్యాప్తు ఇప్పుడు విజయ్ రాజకీయ ప్రయాణంలో కీలక మలుపుగా మారింది. 2025 సెప్టెంబర్ 27వ తేదీన కరూర్ జిల్లాలో నిర్వహించిన ర్యాలీలో తొక్కిసలాట చోటు చేసుకుని.. 41 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ తొక్కిసలాట ఘటనపై కేసు నమోదు చేసిన తమిళనాడు పోలీసులు.. టీవీకే అధినేత విజయ్‌పై కేసు నమోదు చేశారు. తమిళగ వెట్రి కళగం పార్టీ స్థాపించిన విజయ్.. తన రాష్ట్రవ్యాప్త పర్యటనలో భాగంగా కరూర్‌లోని వేలుసామిపురంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అయితే ర్యాలీ నిర్వహించే ప్రాంతం చాలా ఇరుకుగా ఉండటం.. మధ్యాహ్నం రావాల్సిన విజయ్.. చాలా ఆలస్యంగా రాత్రి పూట రావడంతో.. అప్పటివరకు వేచి చూసిన ఫ్యాన్స్, పార్టీ కార్యకర్తలు ఒక్కసారిగా ఎగబడటంతో.. తొక్కిసలాట చోటు చేసుకుంది. ఈ ఘటనలో 41 మంది ప్రాణాలు కోల్పోగా.. 60 మందికి పైగా తీవ్రంగా గాయపడ్డారు. కేవలం 10 వేల మందికి సరిపడా సామర్థ్యం ఉన్న ప్రదేశంలో సుమారు 30 వేల మందికి పైగా జనం గుమిగూడడం.. సరైన రక్షణ చర్యలు లేకపోవడం, విజయ్ రాక ఆలస్యం కావడం వల్ల తొక్కిసలాట జరిగినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ తొక్కిసలాట ఘటనపై మొదట తమిళనాడు పోలీసులు ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ద్వారా విచారణ చేపట్టారు. అయితే.. పారదర్శకమైన దర్యాప్తు జరగాలని బాధితుల కుటుంబాలు కోరడంతో.. ఈ కేసులో సుప్రీంకోర్టు జోక్యం చేసుకుంది.

# రోజుకో యాపిల్ తింటే ఎన్నో బెనిఫిట్స్ అనుకుంటున్నారా..?

**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రస్తుతం మార్కెట్‌లో లభించే బెండకాయలు, ఆపిల్స్‌పై రసాయనాలు, స్ప్రేలు వాడుతున్నారని ప్రముఖ ఆర్గానిక్ వ్యవసాయదారుడు సతీష్ బాబు గద్దె వెల్లడించారు. బ్రోమైడ్ వంటివి కూరగాయలు, పండ్లపై ఉపయోగించి తాజాగా కనిపించేలా చేస్తున్నారని తెలిపారు. ఈ పద్ధతులు వినియోగదారుల ఆరోగ్యానికి హానికరం అని ఆయన హెచ్చరించారు. ఆహార కల్తీ ప్రస్తుత సమాజంలో ఒక తీవ్రమైన సమస్యగా మారింది. పాలు, కూరగాయలు, పండ్ల వంటి నిత్యవసర వస్తువులలో రసాయనాల వాడకం గురించి ప్రముఖ ఆర్గానిక్ వ్యవసాయదారుడు సతీష్ బాబు గద్దె ఇటీవల వివరించారు. పశువులకు హార్మోనల్ ఇంజెక్షన్లు ఇవ్వడం వల్ల అవి మనుషుల ఆరోగ్యంపై ఎంతవరకు ప్రభావం చూపుతాయో ఆయన ప్రశ్నించారు. పాలు వంటి ఉత్పత్తులకు వినియోగదారులు తక్కువ ధర చెల్లించడానికి మొగ్గు చూపడం వల్ల, ఉత్పత్తిదారులు అనైతిక పద్ధతులకు పాల్పడుతున్నారని ఆయన అభిప్రాయపడ్డారు. పాలకు అధిక ధర ఉంటే, ఉత్పత్తిదారులు సహజసిద్ధమైన పద్ధతులను అనుసరించే అవకాశం ఉంటుందని ఆయన పేర్కొన్నారు. కూరగాయల విషయంలో, బెండకాయలను ఉదాహరణగా తీసుకున్నారు. గతంలో ముదిరిన బెండకాయలు విరిస్తే విరిగిపోకపోయేవని, కానీ ఇప్పుడు మార్కెట్‌లో ఎంత లావుగా ఉన్నా అన్ని బెండకాయలు లేతగా, తాజాగా కనిపిస్తాయని తెలిపారు. దీనికి కారణం కోసే ముందు వాటిపై ఒక రకమైన స్ప్రే చేయడం అని ఆయన వెల్లడించారు. ఈ స్ప్రే చేసిన తర్వాత ముదిరిన బెండకాయలు కూడా లేతగా మారి, సులువుగా విరిగిపోతాయని వివరించారు. ఈ ప్రక్రియలో స్ప్రే చేసిన బెండకాయలు ఒక రోజు తర్వాత కోసి, హోల్‌సేల్‌కు, ఆపై రిటైల్‌కు వస్తాయని, అప్పటికే వాటిలో రసాయనాలు ఇమిడి ఉంటాయని ఆయన హెచ్చరించారు. పండ్ల విషయానికి వస్తే, ఆపిల్స్‌ను ఉదాహరణగా చూపారు.



పోలాండ్ నుంచి ఒక నెల రోజుల ప్రయాణం తర్వాత కూడా చెన్నై ఎయిర్‌పోర్ట్‌కు వచ్చిన ఆపిల్స్ పాడవకుండా తాజాగా ఉన్నాయని ఆయన స్నేహితుడు చెప్పిన విషయాన్ని ప్రస్తావించారు. ఇవి మన లోకల్ మార్కెట్లకు వచ్చి, వినియోగదారుల ఇళ్లలో కూడా ఐదారు రోజులు తాజాగా ఉంటాయని అన్నారు. దీనికి కూడా కూరగాయలపై వాడే రసాయనాల లాంటి స్ప్రేలే కారణమని ఆయన పేర్కొన్నారు. ముఖ్యంగా, కూరగాయలు, పండ్లపై వాడే రసాయనాలలో "బ్రోమైడ్" ఒకటి అని ఆయన స్పష్టం చేశారు. ఎలుకలను చంపడానికి వాడే బ్రోమైడ్ రసాయనాన్ని కూరగాయలు, పండ్లపై కొడుతున్నారని ఆయన తెలిపారు.

# రంగుల బ్రాలు ధరిస్తే.. రొమ్ము క్యాన్సర్ వస్తుందా.?



**హైదరాబాద్ పెన్ పవర్:** బ్రా ధరించడం గురించి అనేక పుకార్లు, అపోహలు ఉన్నాయి. బ్రా ధరించడం మంచిదా చెడ్డదా అనే చర్చకు మించి, బ్రాను చాలా గట్టిగా ధరించడం లేదా కొన్ని రంగుల బ్రాలు ధరించడం వల్ల రొమ్ము క్యాన్సర్ వచ్చే ప్రమాదం పెరుగుతుందని చెబుతారు. మీరు బిగుతుగా ఉండే బ్రాలు ధరించి నిద్రపోకూడదు. ఇది చాలా సమస్యలను కలిగిస్తుందని, మీరు బిగుతుగా ఉండే బ్రా లేదా ముదురు రంగుల బ్రా ధరిస్తే ఈ ప్రమాదం ఎక్కువగా ఉంటుందని చెబుతారు. బ్రాలకు, క్యాన్సర్ కు సంబంధం ఉందా?: నేషనల్ సెంటర్ ఫర్ హెల్త్ రీసెర్చ్‌లో కరోలిన్ నోవాస్ రాసిన ఒక వ్యాసం , బ్రా ధరించడం వల్ల క్యాన్సర్‌తో సంబంధం ఉందా లేదా అనే విషయాన్ని చర్చించింది. అందులో, ఈ రెండు విషయాల మధ్య ఎటువంటి సంబంధం లేదని, ముఖ్యంగా, మీరు ధరించే బ్రా రంగుకు, రొమ్ము క్యాన్సర్‌కు ఎటువంటి సంబంధం లేదని వారు పేర్కొన్నారు. ఈ అధ్యయనంలో, దాదాపు 1500 మందిని నమూనాగా తీసుకున్నారు. వారిలో 500 మంది బ్రాలు ధరించే అలవాటు లేనివారు. 1000 మంది బ్రా ధరించేవారు. పాత అధ్యయనల వల్ల పుకారు వ్యాప్తి: 1991లో జరిపిన ఒక అధ్యయనంలో బ్రాలు ధరించని మహిళలకు రొమ్ము క్యాన్సర్ వచ్చే ప్రమాదం తక్కువగా ఉందని తేలింది . అక్కడే ఆ పుకారు మొదలైంది. అధ్యయనంలో ఉపయోగించిన డేటా సరిపోదని, నమ్మదగనిదిగా పరిగణించబడినప్పటికీ, ఇది కొనసాగుతోంది. ఆ అధ్యయనంలో టైట్ బ్రాలు ధరించిన చాలా మంది మహిళలు కూడా అధిక బరువు కలిగి ఉన్నారు. వారి క్యాన్సర్ ప్రమాదం పెరగడానికి కారణం వారు ధరించిన బ్రా కాదు, వారి అధిక బరువు. కానీ ఆ పుకారు అప్పటి నుండి బ్రాల వైపు మళ్లింది.

అది పుకారులా ఎందుకు వ్యాపించింది?: మీరు చేసే ప్రతి పనికి క్యాన్సర్‌తో సంబంధం ఉందని కొంతకాలంగా ప్రచారంలో ఉన్న పుకారు ఇది అని మీరు అనుకోవచ్చు. కానీ ఈ పురాణం కొత్తది కాదు. ఇది 30 సంవత్సరాలుగా జరుగుతోంది. 1995లో ప్రచురించబడిన డ్రెస్డ్ టు కిల్ అనే పుస్తకంలో, బిగుతుగా ఉండే బ్రా ధరించడం వల్ల శోషరస వ్యవస్థపై ఒత్తిడి పెరుగుతుందని, ఇది క్యాన్సర్‌కు కారణం అవుతుందని ఒక సందేశం ఉంది. ఇది నిరాధారమైనది. దీని వెనుక ఎటువంటి శాస్త్రీయ ఆధారాలు లేవు. కానీ ఇక్కడే పుకారు వ్యాప్తి చెందడం ప్రారంభమైంది. బిగుతుగా ఉండే బ్రా ధరించడం వల్ల రక్త ప్రసరణకు ఆటంకం కలుగుతుందా?: చాలా బిగుతుగా ఉండే బ్రా ధరించడం వల్ల శోషరస లేదా రక్త ప్రవాహాన్ని అడ్డుకోవచ్చని చెబుతారు. అది పూర్తిగా నిజం కాదు. ఎందుకంటే రక్త నాళాలు చర్మానికి కొంచెం దిగువన ఉంటాయి. శోషరస వ్యవస్థ శరీరంలో కొంచెం లోతుగా ఉంటుంది. కానీ మీరు బ్రా ఎంత బిగుతుగా ధరించినా, అది చర్మం ఉపరితలంపైనే ఉంటుంది. కాబట్టి దీనివల్ల శోషరస వ్యవస్థపై ఇలాంటి ప్రభావం ఉండదు. నిజానికి, చాలా బిగుతుగా ఉండే బ్రా ధరించడం వల్ల చర్మంపై ఒత్తిడి కారణంగా మీకు అసౌకర్యం లేదా నొప్పి వస్తుంది. బ్రా రంగుకి, క్యాన్సర్ కి సంబంధం ఉందా?: ఇది పూర్తి అపోహ. సాధారణంగా, లేత రంగు బ్రా కంటే ముదురు రంగు బ్రా ధరించడం కొంచెం ప్రమాదకరమని, ముదురు రంగు బ్రా ధరించడం వల్ల క్యాన్సర్ వస్తుందని పుకార్లు ఉన్నాయి. కానీ నలుపు లేదా ఎరుపు రంగు మాత్రమే కాకుండా ఏదైనా ముదురు రంగు బ్రా ధరించడం వల్ల క్యాన్సర్ వస్తుందని పుకార్లు ఉన్నాయి. ఫాబ్రిక్‌లోని రంగులు చర్మంలోకి చొచ్చుకుపోయి క్యాన్సర్ వస్తుందనే భయాన్ని వదిలేయండి. దీనికి ఎలాంటి ఆధారాలు లేవు.

# కాశ్మీర్ లోయలో కనువిందు చేస్తున్న అందాలు..



**హైదరాబాద్ పెన్ పవర్:** భూతల స్వర్గంగా పిలువబడే కాశ్మీర్ మళ్లీ పర్యాటకులతో కళకళలాడుతోంది. గతేడాది ఏప్రిల్‌లో పహల్గామ్‌లో జరిగిన విషాదకర ఉగ్రదాడి తర్వాత ఒడిదుడుకులకు లోనైన పర్యాటక రంగం.. ఇప్పుడు శీతాకాలం రాకతో సరికొత్త ఊపిరి పోసుకుంటోంది. మంచుతో కప్పబడిన పర్వతాలు, గడ్డకట్టిన సరస్సులు పర్యాటకులను మంత్రముగ్ధులను చేస్తుంటే.. కాశ్మీరీల మోహాల్లో మళ్లీ చిరునవ్వులు విరుస్తున్నాయి. 2024లో రికార్డు స్థాయిలో దాదాపు 30 లక్షల మంది పర్యాటకులు కాశ్మీర్ లోయను సందర్శించి సరికొత్త చరిత్ర సృష్టించారు. అయితే, ఏప్రిల్ 2025లో జరిగిన ఉగ్రదాడి పర్యాటకుల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసింది. దీంతో బుకింగ్స్ భారీగా రద్దయ్యాయి. కానీ, ప్రభుత్వం చేపట్టిన కట్టుదిట్టమైన భద్రతా చర్యలు, స్థానికుల ఆత్మీయ ఆతిథ్యం పర్యాటకుల్లో మళ్లీ నమ్మకాన్ని నింపాయి. ప్రస్తుతం గుల్‌మార్గ్, సోన్‌మార్గ్, పహల్గామ్ వంటి ప్రాంతాల్లో హోటళ్లు 80 శాతం నుంచి 90శాతం ఆక్యుపెన్సీతో నడుస్తున్నాయి. డిసెంబర్, జనవరి నెలల్లో కాశ్మీర్ అందం వర్ణనాతీతం. గుల్ మార్గ్ లోని ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన స్కీ రిసార్ట్ పర్యాటకులతో కిక్కిరిసిపోతోంది. గడ్డకట్టిన దాల్ సరస్సుపై షికారా ప్రయాణం సరికొత్త అనుభూతిని ఇస్తోంది.

కేవలం పర్యాటక రంగంపైనే ఆధారపడి జీవిస్తున్న లక్షలాది కుటుంబాలకు ఈ రద్దీ పెద్ద ఊరటనిస్తోంది. షికారా వాలాలు, హస్తకళల వ్యాపారులు, ట్యాక్సీ డ్రైవర్లు మళ్లీ బిజీ అయ్యారు. పర్యాటక రంగాన్ని కాపాడేందుకు జమ్మూ కాశ్మీర్ ప్రభుత్వం వినూత్న చర్యలు చేపట్టింది. విమానాశ్రయాల్లో మెరుగైన విజిబిలిటీ పరికరాలు, మంచు తొలగింపు యంత్రాలు, పర్యాటక ప్రదేశాల వద్ద అదనపు సెక్యూరిటీ బలగాలను మోహరించారు. సోషల్ మీడియా ద్వారా కాశ్మీర్ సురక్షితమని పర్యాటకులు షేర్ చేస్తున్న ఫోటోలు, వీడియోలు దేశవ్యాప్తంగా సానుకూల వాతావరణాన్ని సృష్టిస్తున్నాయి. అందమైన లోయ మళ్లీ మాకు స్వాగతం చెబుతోంది.. ఇక్కడ భయం లేదు, కేవలం మంచు అందాలే ఉన్నాయి అంటూ పర్యాటకులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఉగ్రవాదంపై పర్యాటకం పైచేయి సాధిస్తోందని చెప్పడానికి ఈ వింటర్ సీజనే నిదర్శనం. ప్రకృతి అందాల మధ్య కాశ్మీర్ లోయ మళ్లీ పూర్వ వైభవాన్ని సంతరించుకుంటోంది.

## మునగ ఈ వ్యాధుల పాలిట బ్రహ్మాస్త్రం..



**హైదరాబాద్ పెన్ పవర్:** మునగలో ఎన్నో పోషకాలతోపాటు.. ఔషధ గుణాలు పుష్కలంగా దాగున్నాయి.. మునగ మొక్క, వేర్లు, మునక్కాయలు, ఆకులు, పువ్వులు అన్నీ పవర్‌ఫులే.. అందుకే.. వీటిని రెగ్యులర్ గా తీసుకుంటే.. ఆరోగ్యానికి చాలా మంచిదని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. సాధారణంగా దాదాపు అన్ని సీజన్లలో లభించే.. మునగలో ఆరోగ్యానికి మేలు చేసే విటమిన్లు, ఖనిజాలు, యాంటీఆక్సిడెంట్లు ఉన్నాయి. మునగలో ఎన్నో పోషకాలతోపాటు.. ఔషధ గుణాలు పుష్కలంగా దాగున్నాయి.. మునగ మొక్క, వేర్లు, మునక్కాయలు, ఆకులు, పువ్వులు అన్నీ పవర్‌ఫులే.. అందుకే.. వీటిని రెగ్యులర్ గా తీసుకుంటే.. ఆరోగ్యానికి చాలా మంచిదని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. సాధారణంగా దాదాపు అన్ని సీజన్లలో లభించే.. మునగలో ఆరోగ్యానికి మేలు చేసే విటమిన్లు, ఖనిజాలు, యాంటీఆక్సిడెంట్లు ఉన్నాయి.. మునగకాయ, మునగ ఆకులు.. దేనికదే ప్రసిద్ధి.. వీటిని సూప్ గా లేదా.. కూరగా, పప్పులో వేసుకుని తినవచ్చు.. ఇంకా జ్యూస్ గా కూడా తాగొచ్చు.. మునగాకులను ఆయుర్వేదం ప్రకారం.. తీసుకుంటే.. ఎన్నో సమస్యలను దూరం చేయొచ్చంటున్నారు నిపుణులు.. మునగ మొక్క దాని వేర్ల నుండి పువ్వుల వరకు ఔషధ గుణాలతో నిండిన మొక్క అని.. ఇది అనేక వ్యాధులను సులభంగా నయం చేయగలదని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు. అయితే.. మునగ ఆకులను పోషకాల పవర్‌హౌస్ గాపిలుస్తారు. కేవలం 100 గ్రాముల మునగాకులలో నారింజ కంటే ఏడు రెట్లు ఎక్కువ విటమిన్ సి ఉంటుంది. ఈ ఆకు ఆరోగ్యానికి ఎంత ముఖ్యమో ఇది చూపిస్తుంది. మునగాకులలో మెగ్నీషియం, మాంగనీస్, విటమిన్లు ఐ, ఇ కూడా పుష్కలంగా ఉన్నాయి. ఈ ఆకులలో ఫైబర్ పుష్కలంగా ఉంటుంది.. కేలరీలు ఉండవని పేర్కొంటున్నారు. టైఫాయిడ్ జ్వరంతో బాధపడుతుంటే మునగ మొక్క వేర్లను నీటిలో మరిగించి తాగితే ఫలితాలు కనిపిస్తాయి. తీవ్రమైన తలనొప్పి ఉంటే మునగాకులను బాగా నలిపి తలకు పట్టిస్తే తలనొప్పి క్రమంగా తగ్గిపోతుంది. మునగ మొక్క వేరు ఆరోగ్యానికి చాలా మంచిది.. మీకు గొంతు నొప్పి ఉంటే, మీరు దాని వేళ్ళతో కషాయం తయారు చేసి, నొప్పి నుండి ఉపశమనం పొందడానికి పుక్కిలించవచ్చు.


మీరు దాని ఆకులను నమలడం ద్వారా మీ చక్కెర స్థాయిలను నియంత్రించవచ్చు.

## బరువు తగ్గాలనే ఆరాటంలో లేనిపోని సమస్యలు తెచ్చుకోకండి!



**హైదరాబాద్ పెన్ పవర్:** ఆరోగ్యం పట్ల అవగాహన పెరిగిన తర్వాత చాలామంది ఇప్పుడు కొత్త రకమైన డైట్ పద్ధతులను అనుసరిస్తున్నారు. అందులో ప్రధానంగా వినిపిస్తున్న పేరు 'ఫైబర్ మాక్సింగ్'. శరీరంలోని చెడు కొలెస్ట్రాల్‌కు చెక్ పెట్టాలన్నా, జీర్ణక్రియ మెరుగుపడాలన్నా పీచు పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలని అందరూ భావిస్తుంటారు. అతి సర్వత్ర వర్జయేత్ అన్నట్లుగా.. ఏదైనా హద్దు దాటితే అది అమృతంలా కాకుండా విషంలా మారుతుంది. పీచు పదార్థాల విషయంలోనూ ఇదే జరుగుతోంది. గట్ ఆరోగ్యం కోసం అతిగా ఫైబర్ తీసుకోవడం వల్ల ప్రయోజనాల కంటే నష్టాలే ఎక్కువగా ఉంటాయని తాజా పరిశోధనలు హెచ్చరిస్తున్నాయి. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ ప్రకారం, వయస్సును బట్టి మనం తీసుకునే ఫైబర్ పరిమాణం మారుతుండాలి. పెద్దలు రోజువారీ ఆహారంలో సుమారు 30 గ్రాముల పీచు పదార్థం ఉండేలా చూసుకోవాలి. 15 ఏళ్లలోపు పిల్లలకు 20 గ్రాములు, మూడేళ్లలోపు చిన్నారులకు కేవలం 15 గ్రాముల ఫైబర్ సరిపోతుంది. అంతకంటే ఎక్కువ తీసుకుంటే శరీరంలోని సున్నితమైన జీర్ణ వ్యవస్థపై తీవ్రమైన ఒత్తిడి పడుతుంది.అతిగా పీచు పదార్థాలు తీసుకోవడం వల్ల పేగుల్లో చికాకు కలగడం, కడుపు బిగుతుగా ఉండటం వంటి ఇబ్బందులు ఎదురవుతాయి. ముఖ్యంగా ఫైబర్ ఎక్కువైనప్పుడు తగినంత నీరు తాగకపోతే మలబద్ధకం సమస్య మరింత జటిలమవుతుంది. అంతేకాకుండా, ఆహారంలోని క్యాల్షియం, ఐరన్, జింక్ వంటి కీలక పోషకాలను శరీరం గ్రహించకుండా ఈ ఫైబర్ అడ్డుకుంటుంది. దీనివల్ల బరువు విపరీతంగా తగ్గడంతో పాటు పేగుల్లో అడ్డంకులు కూడా ఏర్పడే ప్రమాదం ఉంది. ఫైబర్ మాక్సింగ్ డైట్ పాటించేవారు కొన్ని ముఖ్యమైన సూచనలు పాటించడం అవసరం. ఒకేసారి కాకుండా ఆహారంలో ఫైబర్ పరిమాణాన్ని క్రమంగా పెంచుకుంటూ పోవాలి. అప్పుడే జీర్ణాశయం ఆ మార్పుకు అలవాటు పడుతుంది. పీచు పదార్థాలు తీసుకున్నప్పుడు ద్రవ పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలి. లేకపోతే కడుపులో తిమ్మిర్లు వచ్చే అవకాశం ఉంటుంది. కృత్రిమ ఫైబర్ పౌడర్లకు బదులుగా పండ్లు, కూరగాయలు, చిక్కుళ్లు, తృణధాన్యాలను ఎంచుకోవాలి.

## చింతపండు తినే అలవాటు ఉందా?



**హైదరాబాద్ పెన్ పవర్:** పుల్లని, తీపి కలగలిసిన రుచితో ఉండే చింతపండు వంటలకు దట్టిస్తే తినడానికి రుచికరంగా ఉండటమే కాకుండా ఆరోగ్య ప్రయోజనాలను కూడా అందిస్తుంది. చింతపండును సాధారణంగా దాని వాసన, రుచి కోసం పలు వంటలలో ఉపయోగిస్తాం. ప్రతి ఇంటి వంటగదిలో వంటకు ఉపయోగించే రకరకాల పదార్థాలు ఉంటాయి. ఇందులో చింతపండు ఒకటి. చాలా మందికి ఈ పేరు వినగానే నోరు ఊరడం సహజం. పుల్లని, తీపి కలగలిసిన రుచితో ఉండే చింతపండు వంటలకు దట్టిస్తే తినడానికి రుచికరంగా ఉండటమే కాకుండా ఆరోగ్య ప్రయోజనాలను కూడా అందిస్తుంది. చింతపండును సాధారణంగా దాని వాసన, రుచి కోసం పలు వంటలలో ఉపయోగిస్తాం. వంటల్లో కాకుండా కొంతమందికి చింతపండు పచ్చిగానే తినడం మహా ఇష్టం. చింతపండులో యాంటీఆక్సిడెంట్లు, ఫైటోకెమికల్స్, విటమిన్లు ం, అ, ఇ, ఐ, ః6, మెగ్నీషియం, భాస్వరం, కాల్షియం, ప్రోటీన్ వంటి ముఖ్యమైన పోషకాలు దండిగా ఉంటాయి. ఇవి శరీరాన్ని వివిధ ఆరోగ్య సమస్యల నుంచి రక్షించడంలో సహాయపడతాయి. చింతపండు తినడం వల్ల చర్మ ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు. బరువు తగ్గడంలోనూ ఉపయోగపడుతుంది. తద్వారా రోగనిరోధక శక్తిని పెంచుతుంది. చింతపండులో విటమిన్ సి పుష్కలంగా ఉంటుంది. ఇది రోగనిరోధక శక్తిని పెంచడంలో సహాయపడుతుంది. బలమైన రోగనిరోధక వ్యవస్థ శరీరాన్ని అన్ని కాలాల్లో ఇన్ఫెక్షన్ల నుంచి రక్షించడంలో సహాయపడుతుంది. కానీ దాని వినియోగం ఎల్లప్పుడూ మితంగానే ఉండాలి. ముఖ్యంగా పీరియడ్స్ సమయంలో మహిళలు అనుభవించే అసౌకర్యానికి చింతపండు ఎంతో మేలు చేస్తుంది. ఇది ఋతు తిమ్మిరి నుంచి ఉపశమనం పొందడంలో, శరీరంలో ఒఆఉ కొలెస్ట్రాల్‌ను తగ్గించడంలో, ఊఆఉ కొలెస్ట్రాల్‌ను పెంచడంలో సహాయపడుతుంది. అంతేకాదు ఇది రక్తపోటు, హృదయ స్పందన రేటును నియంత్రించడంలో, శరీర ద్రవాలను సమతుల్యం చేయడంలో కూడా ఉపయోగపడుతుంది.

# 15 బంతుల్లోనే సర్ఫరాజ్ హాఫ్ సెంచరీ.. విజయ్ హజారే చరిత్రలో ఆల్ టైమ్ రికార్డ్



**హైదరాబాద్ పెన్ పవర్:** టీమిండియా టెస్ట్ బ్యాటర్ సర్ఫరాజ్ ఖాన్ తనలోని విశ్వ రూపాన్ని బయటపెట్టాడు. తనను టెస్ట్ క్రికెటర్ గా చూసే వారికందరికి దిమ్మ తిరిగే షాక్ ఇచ్చాడు. వన్డే ఫార్మాట్ లో జరుగుతున్న విజయ్ హజారే ట్రోఫీలో కేవలం 15 బంతుల్లోనే హాఫ్ సెంచరీ పూర్తి చేసుకొని ఆల్ టైం రికార్డ్ ను తన ఖాతాలో వేసుకున్నాడు. గురువారం (జనవరి 8) పంజాబ్ తో జరిగిన మ్యాచ్ లో సర్ఫరాజ్ విధ్వంసకర బ్యాటింగ్ తో చెలరేగాడు. ఈ మ్యాచ్ లో అభిషేక్ శర్మ వేసిన ఓవర్లో మూడు ఫోర్లు, మూడు సిక్సర్లతో ఏకంగా 30 పరుగులు రాబట్టాడు. ఓవరాల్ గా 20 బంతుల్లోనే 7 ఫోర్లు, 5 సిక్సర్లతో 62 పరుగులు చేసి ఔటయ్యాడు.

విజయ్ హజారే ట్రోఫీలో 15 బంతుల్లో హాఫ్ సెంచరీ ఆల్ టైం రికార్డ్ కావడం విశేషం. అంతకముందు ఈ రికార్డ్ బరోడాకు చెందిన అథీత్ సేథ్ పేరిట ఉంది. అథీత్ 2020-21 సీజన్ లో ఛత్తీస్ ఘడ్ పై 16 బంతుల్లో ఈ ఘనత సాధించగా.. తాజాగా సర్ఫరాజ్ ఈ రికార్డ్ బ్రేక్ చేసి చరిత్ర సృష్టించాడు. 2026 ఐపీఎల్ మినీ వేలంలో సర్ఫరాజ్ ను చెన్నై సూపర్‌కింగ్స్ దక్కించుకుంది. తొలి రౌండ్ వేలంలో సర్ఫరాజ్‌ను ఎవరూ తీసుకోలేదు. కానీ రెండో రౌండ్‌లో సీఎస్కే అతన్ని బేస్‌ప్రైస్ రూ. 75 లక్షలకు సొంతం చేసుకుంది. ప్రస్తుతం టీమిండియా టెస్ట్ జట్టులో స్థానం కోసం పోరాడుతున్నాడు.

2023లో చివరిసారి సన్‌రైజర్స్ హైదరాబాద్ తరఫున ఐపీఎల్ మ్యాచ్ ఆడిన సర్ఫరాజ్‌ను తర్వాతి రెండు సీజన్లలో ఎవరూ తీసుకోలేదు. డొమెస్టిక్ క్రికెట్‌లో మెరుగైన పెర్ఫామెన్స్ చేసినా.. టీమిండియాకు ఎంపిక కాలేదు. దాంతో అతని ఇంటర్నేషనల్ కెరీర్ గందరగోళంలో పడింది. గత ఐపీఎల్ ఎడిషన్లలో సర్ఫరాజ్ బెంగళూరు, పంజాబ్, ఢిల్లీకి ఆడాడు. ఇక టీమిండియా తరపున ఆరు టెస్టులు ఆడిన సర్ఫరాజ్ 37.10 సగటుతో 371 రన్స్ చేశాడు.

ఈ మ్యాచ్ విషయానికి వస్తే సర్ఫరాజ్ ధనాధన్ ఇన్నింగ్స్ ఆడినా ఫలితం లేకుండా పోయింది.

అత్యంత ఉత్కంఠ భరితంగా సాగిన ఈ మ్యాచ్ లో ముంబైపై పంజాబ్ ఒక్క పరుగు తేడాతో విజయం సాధించింది. మొదట బ్యాటింగ్ చేసిన పంజాబ్ ముంబై బౌలర్ల ధాటికి కేవలం 216 పరుగులకు ఆలౌటైంది. లక్ష్య ఛేదనలో ముంబై 215 పరుగులకు ఆలౌటైంది. సర్ఫరాజ్ ఖాన్ (62), శ్రేయాస్ అయ్యర్ (45) తప్ప మిగిలిన వారు విఫలమయ్యారు.

# విజయంతో వీడ్కోలు.. కెరీర్‌లో చివరి మ్యాచ్ ఆడేసిన ఆసీస్ దిగ్గజ క్రికెటర్



**హైదరాబాద్ పెన్ పవర్:** ఆస్ట్రేలియా స్టార్ ఓపెనర్, టెస్ట్ స్పెషలిస్ట్ ఉస్మాన్ ఖవాజా తన అంతర్జాతీయర్ క్రికెట్ ను ముగించాడు. యాషెస్ లో భాగంగా గురువారం (జనవరి 9) ఇంగ్లాండ్ తో జరిగిన ఐదో టెస్టులో ఖవాజా తన చివరి ఇన్నింగ్స్ ఆడేశాడు. వారం క్రితమే సిడ్నీ టెస్ట్ తన చివరిదని చెప్పిన ఈ ఆసీస్ ఓపెనర్.. గురువారం మ్యాచ్ ముగిసిన తర్వాత గుడ్ బై చెప్పాడు. ఖవాజా తన చివరి ఇన్నింగ్స్ లో 6 పరుగులు మాత్రమే చేసి జోష్ టంగ్ బౌలింగ్ లో బౌల్డయ్యాడు. ఈ మ్యాచ్ తొలి ఇన్నింగ్స్ లో 17 పరుగులతో సరిపెట్టుకున్నాడు. మ్యాచ్ లో తాను రాణించకపోయినా ఆస్ట్రేలియా జట్టు విజయం సాధించి ఖవాజాకు గ్రాండ్ గా వీడ్కోలు పలికాడు. కెరీర్ మొత్తం ఓపెనర్ గా గుర్తింపు తెచ్చుకున్న ఖవాజా.. తన చివరి మ్యాచ్ లో ఐదో స్థానంలో బ్యాటింగ్ చేశాడు. మ్యాచ్ తర్వాత ఈ ఆసీస్ ఓపెనర్ తన ఫ్యామిలీతో గ్రౌండ్ లో చివరిసారిగా కాసేపు సరదాగా గడిపాడు. ఇరు జట్లు ఖవాజాకు గార్డ్ ఆఫ్ హానర్ తో గౌరవించారు. ఆస్ట్రేలియా తరపున 15 ఏళ్ళ టెస్ట్ క్రికెట్ ఆడి స్టార్ ఓపెనర్ గా పేరొందిన ఉస్మాన్.. తన చివరి ఇన్నింగ్స్ లో ఔటైన తర్వాత ఎమోషనల్ అయ్యాడు. ఇప్పటికే వార్నర్ రూపంలో ఆసీస్ ఓపెనర్ సేవలను కోల్పోయిన సంగతి తెలిసిందే. తాజాగా ఖవాజా రిటైర్మెంట్ తో ఆసీస్ ఎవరిని రీప్లేస్ మెంట్ చేస్తుందో చూడాలి. ఖవాజా చిన్నతనంలో ఇస్లామాబాద్ నుండి ఆస్ట్రేలియాకు వలస వచ్చాడు. తాను ఒక ముస్లీమ్ గా ఆస్ట్రేలియా జట్టులో స్థానం సంపాదించడానికి చాలా ఇబ్బందులను ఎదుర్కొన్నాడు. 2011లో తొలిసారి ఆస్ట్రేలియా తరపున ఖవాజా టెస్ట్ అరంగేట్రం చేశాడు. అవకాశం వచ్చినప్పుడల్లా ఖవాజా తనను తాను నిరూపించుకొని జట్టులో తన స్థానం సుస్థిరం చేసుకున్నాడు. 39 ఏళ్ళ ఈ ఆసీస్ ఓపెనర్ ఓవరాల్ గా 88 టెస్టులు ఆడాడు. 42.66 యావరేజ్ తో 6229 పరుగులు చేశాడు. వీటిలో 16 సెంచరీలు.. 28 హాఫ్ సెంచరీలు ఉన్నాయి. తన తొలి టెస్ట్ సిడ్నీలో ఆడిన ఖవాజా.. చివరి టెస్ట్ కూడా అక్కడే ఆడి విజయంతో ముగించాడు. ఈ మ్యాచ్ విషయానికి వస్తే గురువారం (జనవరి 8) ఇంగ్లాండ్ తో ముగిసిన ఐదో టెస్టులో 5 వికెట్ల తేడాతో విజయాన్ని సాధించి 4-1 తేడాతో యాషెస్ ను తమ ఖాతాలో వేసుకుంది. ఇంగ్లాండ్ విధించిన 160 పరుగుల లక్ష్యాన్ని 5 వికెట్లకు కోల్పోయి ఆస్ట్రేలియా అలవోకగా ఛేజ్ చేసింది. తొలి మూడు టెస్టుల్లో ఆస్ట్రేలియా గెలిస్తే.. నాలుగో టెస్ట్ లో ఇంగ్లాండ్ గెలిచింది. తాజాగా ముగిసిన ఐదో టెస్టులో ఆస్ట్రేలియా గెలిచి 4-1 తేడాతో సిరీస్ కైవసం చేసుకుంది. తొలి ఇన్నింగ్స్ లో సెంచరీ కొట్టిన హెడ్ కు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్.. సిరీస్ మొత్తం బౌలింగ్ తో చెలరేగిన స్టార్క్ కు ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ అవార్డులు లభించాయి.

# గోల్డెన్ ఛాన్స్ ఎవరికి: వరల్డ్ కప్‌కు తిలక్ డౌట్.. రేస్‌లో ముగ్గురు క్రికెటర్లు

**టీమిండియా మిడిల్ ఆర్డర్ బ్యాటర్ తిలక్ వర్మ గాయపడ్డాడు. డొమెస్టిక్ క్రికెట్ టోర్నీ విజయ్ హజారే ట్రోఫీ ఆడుతున్నప్పుడు ఈ హైదరాబాద్ క్రికెటర్ కు గజ్జల్లో గాయమైంది. తిలక్ ను హాస్పిటల్ సర్జరీ చేయడంతో మూడు నుంచి నాలుగు వారాల పాటు రెస్ట్ అవసరం. దీంతో స్వదేశంలో జనవరి 21 నుంచి ప్రారంభం కానున్న టీ20 సిరీస్ కు తిలక్ వర్మ దూరమయ్యాడు. వరల్డ్ కప్ ముందు టీమిండియాకు ఇది బ్యాడ్ న్యూస్ అనే చెప్పుకోవాలి. ఒకవేళ వరల్డ్ కప్ సమయానికి ఈ తెలుగు కుర్రాడు ఫిట్ గా లేకపోతే అతని స్థానంలో ఎంపిక కావడానికి రేస్ లో ముగ్గురు క్రికెటర్లు ఉన్నారు. వారెవరో ఇప్పుడు చూద్దాం..**





**హైదరాబాద్ పెన్ పవర్:** తిలక్ వర్మ స్థానంలో ఎంపిక కావడానికి ప్రధానంగా రేస్ లో ఉంది శ్రేయాస్ అయ్యర్. ప్రస్తుతం శ్రేయాస్ అయ్యర్ పూర్తి ఫిట్ నెస్ సాధించాడు. ఇటీవలే జరిగిన విజయ్ హజారే ట్రోఫీలో ఆడి ఫామ్ తో పాటు ఫిట్ నెస్ ను నిరూపించుకున్నాడు. అయ్యర్ కూడా మిడిల్ ఆర్డర్ బ్యాటర్ కావడంతో తిలక్ వర్మ స్థానంలో ఛాన్స్ దక్కే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఐపీఎల్ 2025 సీజన్ లో 600 పైగా పరుగులు చేసి సత్తా చాటాడు. పరిస్థితులకు తగ్గట్టుగా బ్యాటింగ్ చేయడంతో పాటు దూకుడుగా ఆడగలడు. అయ్యర్ అనుభవం కూడా ఇండియాకు కలిసొస్తుంది.

**శుభమాన్ గిల్:**

పేలవ ఫామ్ తో టీమిండియా జట్టులో స్థానం కోల్పోయిన శుభమాన్ గిల్ కు మరోసారి భారత జట్టులో అవకాశం దక్కేలా ఉంది. గిల్ క్లాస్ ప్లేయర్. ఒక్కసారి ఫామ్ లోకి వస్తే ఈ పంజాబ్ ప్లేయర్ ను ఆపడం కష్టం. సౌతాఫ్రికాతో సిరీస్ వరకు జట్టులో వైస్ కెప్టెన్ గా కొనసాగిన గిల్ చెత్త ఫామ్ తో అనూహ్యంగా జట్టులో స్థానం కోల్పోయాడు. ఇప్పుడు తిలక్ వర్మకు గాయం కావడంతో ఆ స్థానంలో గిల్ ఎంపికయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. అయితే ఓపెనర్ కావడం గిల్ కు మైనస్ గా మారింది.


**రిషబ్ పంత్:**

టెస్ట్ క్రికెట్ లో అద్భుతంగా రాణిస్తున్న రిషబ్ పంత్.. కొంతకాలంగా భారత వన్డే, టీ 20 జట్టులో స్థానం దక్కించుకోలేకపోతున్నాడు. అయితే ఇప్పుడు గిల్ ముందు సువర్ణావకాశం. తిలక్ వర్మ గాయపడడంతో భారత జట్టులో ఎంపికయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. మిడిల్ ఆర్డర్ లో బ్యాటింగ్ చేయగలగడం.. వికెట్ కీపింగ్ లాంటి విషయాలు పంత్ కు అడ్వాంటేజ్ గా మారింది. 2024 టీ20 వరల్డ్ కప్ లో పంత్ మూడో స్థానంలో బ్యాటింగ్ చేసి పర్వాలేదనిపించాడు. ప్రస్తుతం ఫామ్ లో లేకపోయినా భారత జట్టు యాజమాన్యం అతనిపై నమ్మకముంచే అవకాశం ఉంది.



మిషా నారంగ్ చిక్ బ్రౌన్ క్రాప్ టాప్‌తో అభిమానులను ఆశ్చర్యపరిచింది

# తెలివైన నిర్ణయం.. బయటపడ్డ రామ్!



సాధారణంగా దర్శక రచయితలు ఒక కథను రాసుకునేటప్పుడు అందులో ఫలానా హీరో హీరోయిన్లను ఊహించుకుంటూ ఆ పాత్రలు రాస్తారు. ఆ తర్వాత ఆయా హీరోల వద్దకు ఆ స్క్రిప్ట్ వెళ్తే నచ్చితే ఓకే చేస్తారు లేకపోతే రిజెక్ట్ చేస్తారు. ఓకే చేసిన సినిమా డిజాస్టర్ గా నిలిచిన సందర్భాలు ఉన్నాయి. మరి కొంతమంది ఆ పాత్రల నుండీ తప్పించుకున్నాక .. ఆ సినిమా హిట్ అయింది అంటే అయ్యో ఈ సినిమాని వదులుకున్నామే అని బాధపడితే.. ఇంకొంత మంది ఆ సినిమా డిజాస్టర్ అయితే మంచి పని అయింది అని ఊపిరి పీల్చుకుంటారు. ఇకపోతే ఇక్కడ హీరో రామ్ మాత్రం తెలివైన నిర్ణయం తీసుకొని విమర్శల నుంచి బయటపడ్డారు మరి అసలు విషయం ఏమిటో ఇప్పుడు చూద్దాం.

ప్రముఖ డైరెక్టర్ కిషోర్ తిరుమల తాజాగా రవితేజ తో భర్త మహాశయులకు విజ్ఞప్తి అనే చిత్రానికి దర్శకత్వం వహించారు. జనవరి 13న ఈ సినిమా విడుదల కాబోతోంది. విడుదల తేదీ దగ్గరపడిన నేపథ్యంలో ప్రమోషనల్ కార్యక్రమాలు చేపట్టిన ఈయన పలు విషయాలను చెబుతూ అందరినీ ఆశ్చర్యపరుస్తున్నారు. ఈ క్రమంలోనే రఘువరన్ బీటెక్ సినిమా తెలుగులో రామ్ పోతినేని హీరోగా రీమేక్ చేయాలని భావించారని, అయితే చివరి నిమిషంలో నిర్మాతలు ఈ ప్రాజెక్టును వదిలేసి డబ్బింగ్ మొదలు పెట్టాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. రఘువరన్ బీటెక్ తెలుగు డబ్బింగ్ వెర్షన్ కు సంభాషణలు రాసిన దర్శకుడు కిషోర్ తిరుమల అసలు కథను తెలిపారు.కిషోర్ తిరుమల మాట్లాడుతూ..“ రఘువరన్ బీటెక్ చిత్రాన్ని మొదట తెలుగులో రీమేక్ చేయాలనుకున్నారు. అదే సమయంలో నేను శైలజా కి కూడా నాకు ఆమోదం లభించింది. అయితే నేను శైలజ చిత్రంతోనే నేను ముందుకు సాగాలని నిర్ణయించుకున్నాను. ఈ సినిమా బాక్స్ ఆఫీస్ వద్ద మంచి విజయం అందుకుంది. అటు రఘువరన్ బీటెక్ సినిమా కూడా మంచి విజయం సాధించింది. తెలుగు ప్రేక్షకులు ధనుష్ ను హృదయపూర్వకంగా స్వాగతించారు. ఆయన వెంటనే స్టార్ గా మారడానికి వీలు కల్పించారు.అయితే దీనిని రామ్ రీమేక్ చేసి ఉంటే ఇంత విజయవంతం అయ్యేది కాదు. ఎందుకంటే ఒరిజినల్ కి రీమేక్ కి మధ్య స్పష్టమైన తేడాలు తలెత్తేవి. అదృష్టవశాత్తు రామ్ తెలివిగా ఈ సినిమా నుండీ వెనక్కి తగ్గి విమర్శల నుండి తప్పించుకున్నాడు అంటూ కిషోర్ తిరుమల చెప్పుకొచ్చారు ఇకపోతే ఆ తర్వాత కిషోర్ తిరుమల రామ్ తో ఉన్నది ఒకటే జిందగీ సినిమా చేశారు.



ప్రకృతి పావని: టాలెంట్, బ్యూటీ & ఇన్‌స్టాగ్రామ్ చార్మ్ కంబైన్డ్

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965